ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్







# యుగశక్తి గాయత్రి

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి

సంపుటి 14 - సంచిక 5
**అక్టోబర్ 2010**
**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

Please send drafts in favour of
SRI VEDAMATA
GAYATRI TRUST
BUSINESS DIVISION,
HYDERABAD


## శక్తిపూజ రహస్యం

శక్తిపూజకు శక్తి సమీకరణ ఆవశ్యకం. ఆ సమీకరణ లేనిదే శక్తిపూజ సాధ్యం కాదు. జీవితంలో దాని ఫలితమూ అందదు. శక్తి సమీకరణ జరిగిన చోట సుఖ సత్కారాలూ, శాంతీ అనే పుష్పాలు వర్షిస్తాయి. శక్తి సమీకరణ చేసిన వ్యక్తియే సమర్థవంతుడూ, బుద్ధికుశలుడూ, అదృష్టవంతుడూ అవుతాడు.

శక్తిపూజ చేయగోరేవారు శక్తి సమీకరణకై నడుం బిగించాలి. మహాశక్తి పూజ కోసమై ఈ క్షణం నుండే సన్నాహాలు చేయాలి. శారీరక శక్తి, మానసిక శక్తి, భావనాత్మక శక్తి, ఆర్థిక శక్తి, ఆధ్యాత్మిక శక్తి–ఈ అయిదు శక్తులనూ సమీకరించడం ద్వారా వ్యక్తిలోని ప్రసన్నత వందరెట్లు పెరుగుతుంది. అది సత్కర్మలకు సద్వినియోగం అవుతుంది. ఫలితంగా వ్యక్తి సాఫల్యపు శిఖరాగ్రాన్ని చేరుకుంటాడు.

శరన్నవరాత్రిలోని తొమ్మిది రోజులు శక్తిపూజలోని ఈ రహస్యాన్ని తెలుసుకునే రోజులు. ఈ తొమ్మిది రోజులూ సమీకరించిన శక్తితో మనం మాత భగవతిని పూజిస్తాము. ఈ తొమ్మిది రోజులలో ఎన్నెన్నో రహస్యాలు ఇమిడి ఉన్నాయి. ప్రధాన రహస్యాల సంఖ్య తొమ్మిది. తత్, సవితుః, వరేణ్యమ్, భర్గో, దేవస్య, ధీమహి, ధియో, యోనః, ప్రచోదయాత్ అనే గాయత్రీ మంత్రంలోని తొమ్మిది శబ్దాలలో ఇవి ఇమిడి ఉన్నాయి. ఈ తొమ్మిది శబ్దాల మహిమవల్ల భూః, భువః, స్వః రూపంలో స్థూల, సూక్ష్మ కారణ శరీరాలలోని శక్తులన్నీ మేలుకొంటాయి. ఫలితంగా ఓంకార పరమ పదం ప్రాప్తిస్తుంది.

తన జీవితంలోని క్షణక్షణమూ శక్తిలోని కణకణాన్నీ సమీకరించి, దానిని సత్కర్మల కోసం సద్వినియోగం చేసి, తద్వారా విశ్వవ్యాపి అయిన వేదమాత, దేవమాత, విశ్వమాత గాయత్రిని అర్చన, ఆరాధన చేసే వ్యక్తి జీవితం ఆ పరమపదాన్ని పొందుతుంది.

★★★

పత్రిక అందనివారు ఈ క్రింది నంబరును సంప్రదించగలరు. **9949111175**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**

[redacted] సంస్కారిత జీవనమే ప్రత్యక్ష కల్పవృక్షం.

# విషయ సూచిక


1. **సంపాదకీయం :**
శక్తి పూజ రహస్యం 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :**
చెడు తలపెట్టకు 2
3. **వేదమంత్రం :** దైవేచ్ఛ 3
4. **వర్తమాన భారతం :** జీవితపు చివరిదశలో తల్లిదండ్రుల కలలను భగ్నం చేస్తున్నవారి ప్రియమైన సంతానం 4
5. **బాలల భవితకు బంగారు బాట-12 :**
మంచివారి సంఖ్యను పెంచు 7
6. **ధారావాహిక ప్రశ్నోపనిషద్ : ప్రథమ మండలం-తృతీయ అధ్యాయం :** మనిషికి తన భాగ్యానికి తానే నిర్మాత 8
7. **యుగ గీత-2 :** విషాదానికి పరాకాష్ఠ-శిష్యత్వ జాగృతి 9
8. **వ్యక్తి నిర్మాణం :**
ఉన్నత మానసికతకు నాలుగు వర్చస్సులు 13
9. **సూర్య విజ్ఞానం-1 :**
బ్రహ్మీచేతన ధృవకేంద్రం - మానవ అంతఃకరణ 15
10. **హనుమత్ కథామృతం-30 :**
భక్తుని మహిమ సాటిలేనిది 16
11. **బోధ కథ :** అనుభూతిలో ఉన్నది సత్యం 18
12. **గాయత్రి-24 శక్తిధారలు (17) :** కుండలిని 21
13. **పూజ్య గురుదేవుల అమృతవాణి :**
భగవంతుడెక్కడ ఉన్నాడు? 22
14. **వైజ్ఞానిక ఆధ్యాత్మికత :** పతంజలి యోగ సూత్రాలు 25
15. **ఆదిశక్తి యొక్క లీలా కథలు-4 :**
సఫలతకు మూల ఆధారం పారాయణ 27
16. **యజ్ఞవిద్య:** గాయత్రీ యజ్ఞం-ఉపయోగం,ఆవశ్యకత 29
17. **యోగసాధనయే ఉజ్జ్వల భవిష్యత్తు తీసుకువస్తుంది** 31
18. సర్వపాపాలను నశింపచేసే వృక్షరాజము - రావిచెట్టు 32
19. **నా వారితో నా మాట : 2011-2012 (శతాబ్ది సం॥)**
ఇంకా 131 రోజులు మాత్రమే ఉన్నాయి 34
20. **సద్గురువు మహిమ అనంతమైనది** 37
21. **సాధన విజ్ఞానం :**
పాత్రతను పెంచుకోండి - సిద్ధులను అందుకోండి 40
22. **దేవ సంస్కృతి విశ్వ విద్యాలయం :**
వ్యక్తిత్వ పరిష్కారము-రచనాత్మక జీవన కళ - 1 43
23. **ఆలోచనలకు పదును** 45
24. **వార్తలు** 46




## సద్గురు వచనామృతం

### చెడు తలపెట్టకు

నిప్పును ఎక్కడ ఉంచితే ఆ ప్రదేశాన్ని మొదట వేడిచేసి తర్వాత మండిస్తుంది. ఘాటైన ద్రావణాన్ని మామూలు లోహ పాత్రలో ఉంచితే అది మొదట ఆ పాత్రనే తినివేస్తుంది. ఇదే విధంగా ద్వేషం, దుర్భావన, పాపం, చెడు ఆలోచనలు ఎవరి మనసులో ఉంటాయో అవి అతడినే మొదట నాశనం చేస్తాయి. అవి స్థిరంగా ఉన్నంత వరకూ అతనికి హాని కలిగిస్తూనే ఉంటాయి. అందువలన దాని నివారణకై ఉచితమగు మార్గాన్ని శ్రద్ధగా వెదకాలి. మనసులో దాన్ని ముడివేసుకొని ఈర్ష్యా, ద్వేషాలను పెంచుకోవడం ఏ మాత్రం తగదు. మహాత్మాగాంధీ ఈ సిద్ధాంతాన్ని విజయవంతంగా ప్రయోగించి చూపారు. విరోధి పట్ల చెడు భావం లేకుండా చెడును తొలగించడం సాధ్యమని చూపారు. మనం కూడా అదే మార్గాన్నే అవలంభించాలి.

ఇతరుల దుఃఖాన్ని మన దుఃఖంగా, వారి ఆపదను మన ఆపదగా పరిగణించాలి. అపుడే ప్రపంచంలో శాంతి సామ్రాజ్యాన్ని స్థాపించగలము. మనం ద్వేష భావాన్ని వదిలివేసి, అందరిపట్లా ప్రేమభావాన్ని కలిగి ఉండాలి, స్వార్థ భావాన్ని వదిలివేసి పరమార్థ భావాన్ని ఆశ్రయించాలి. అపుడే అందరికీ శుభం జరుగుతుంది.

*అఖండజ్యోతి, జూన్, 1953,*

*- అనువాదం : ఊటుకూరి సత్యనారాయణ గుప్త*

## పండుగలు

**అక్టోబరు 2010**

| | |
|---|---|
| 02-10-2010 | గాంధీ జయంతి |
| 06-10-2010 | పండితశ్రీరామ శర్మఆచార్య జయంతి |
| 07-10-2010 | మహాలయ అమావాస్య |
| 17-10-2010 | విజయదశమి |

**నవంబరు 2010**

| | |
|---|---|
| 05-11-2010 | దీపావళి |
| 10-11-2010 | నాగుల చవితి |
| 14-11-2010 | బాలలదినోత్సవం (నెహ్రూ జయంతి) |
| 21-11-2010 | కార్తీక పౌర్ణమి, గురునానక్ జయంతి |

[redacted] సత్ ప్రయోజనాలవైపు మళ్ళించే సాహసమే ఆత్మసాధన.

### వేద మంత్రం

# దైవేచ్ఛ

**ఉద్యానం తే పురుష నావయానం జీవాతుం తే దక్షతాతిం కృణోమి ।**
**ఆహి రోహేమమమృతం సుఖం రథమథ జిర్విర్విదథమా వదాసి ॥**
**– (అథర్వవేద 8/1/6)**

**భావార్థం :** ఎవరు దైవేచ్ఛ, గురుజనుల శిక్షణను అంగీకరించి, కష్టాలలో కూడా ముందుకు వెళుతూ ఉంటారో వారికి సమాజంలో గౌరవం ప్రశంస లభిస్తుంది.

**సందేశం :** దైవేచ్ఛ వలన మనకు ఈ మనుష్య శరీరం లభిస్తుంది. జీవిత మార్గంలో ఇబ్బందులు తొలగించుకుంటూ ఎల్లప్పుడూ తన యొక్క సమాజం యొక్క ఉన్నతికి పనిచేయుట మన ముఖ్య కర్తవ్యంగా పరమాత్మ నిర్ధారించాడు. మనం ఎప్పుడూ నిరాశ చెందనక్కర్లేదు. ఎందుకంటే మన కృషిలో సహకరించుటకు పరమేశ్వరుడు స్వయంగా ప్రతిసారీ సిద్ధంగా ఉంటాడు. మనం కేవలం పురుషార్థం చేయవలసి ఉన్నది. భగవంతుడు ఎన్నడూ మన పతనం కోరుకొనడు. మనమే స్వయంగా దుష్ప్రవృత్తుల వలలో చిక్కుకొని మన పతనాన్ని మనమే కొనితెచ్చుకుంటున్నాము. ఆయన మన జీవితాన్ని ఎంత ప్రాణవంతము, శక్తివంతం చేసాడంటే దాని తేజస్సు ముందు సమస్త ప్రపంచము తలవంచుతుంది. మనం మన ఆత్మ, శరీరాల శక్తిని ఎంతగా గుర్తించితే అంత మంచిది.

ఎక్కువ మంది వ్యక్తులు తమ ఆత్మశక్తిని గుర్తించరు. తమ శరీరమే సర్వస్వంగా భావించి, దాని సేవలోనే తమను తరింపచేసుకుంటున్నారు! దీనివలన అసంఖ్యాక శారీరక, మానసిక వికారాలు ఉత్పన్నమవుతాయి. వారి అంతఃకరణ కషాయ కల్మషాల దుర్గంధంతో పూర్తిగా నిండిపోతుంది. ఈ శరీరం ఆత్మ యొక్క వాహనం మాత్రమేనని వారు మరచిపోతారు. ఎవరు శరీరాన్ని ఆత్మ మీద పెత్తనం చేయనిస్తారో వారి ఆత్మ ప్రకాశం బయటికి రాలేక ప్రగతిలో సహాయపడదు. కానీ ఎవరి ఆత్మ, శరీర రూప గుఱ్ఱాన్ని కళ్ళెంలాగి పట్టగలుగుతుందో అతడు ఉత్తరోత్తరా ఆత్మవికాస సోపానాలధిరోహించి ఉన్నత శిఖరం చేరుకోగలడు.

అటువంటి మనుష్యుల ప్రాణబలము దినదినము పెరుగుతూ పూర్ణవికాసం చెందుతుంది. తన జ్ఞానము, అనుభవంతో సమాజాన్ని సంస్కారవంతము చేయుటలో సహాయం చేయగల్గుతారు. సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యం వికసిస్తుంది. జీవనమార్గంలో చికాకులు వస్తూనే ఉంటాయి. అన్నీ మన ఇష్టప్రకారమే జరగవు. అటువంటి గడ్డు పరిస్థితులను సఫలతా పూర్వకంగా ఎదుర్కొనే సామర్థ్యం మన వ్యక్తిత్వాన్ని మరింత ఉన్నతంగా చేస్తుంది. దానివలన అంతటా గౌరవం, ప్రశంస ప్రాప్తిస్తుంది. సంఘర్షణ మన ఆత్మబలం, ప్రాణశక్తికి పరీక్ష వంటిది.

పరమాత్మ ఇచ్ఛవలననే ఈ ఆటంకాలు మన దారిలో వస్తాయి, మనలను సుషుప్తావస్థ నుండి మేల్కొలిపి ఆత్మోన్నతికి ప్రేరేపిస్తాయి. పరమపిత పరమేశ్వరుడు ఎంతో దయాళువు. ఆయన కృప తన ప్రియ పుత్రులపై అనంతంగా వర్షిస్తూ ఉంటుంది. జీవితంలో కష్టాలు వస్తాయి తర్వాత అవే వరాలుగా రూపొందుతాయి. పూర్వ పాప కర్మలకు శిక్షణ రూపంలో ఇవి మనుష్యునికి ప్రాయశ్చితం చేసుకొనే ఒక అవకాశం ఇస్తాయి. అతని ఆత్మబలం బంగారం వలె మెరవటానికి ఇది ఒక కొలిమి యొక్క పాత్ర వహిస్తుంది.

ఎవరు ఈ సంకట పరిస్థితులలో హతాశులుకారో, ఇతరులకు తగిన ప్రోత్సాహం ఇస్తారో వారే నిజమైన బ్రాహ్మణులు.

★★★

## చిన్నవారే సహాయపడతారు

*ఒక ఉడుత సెనగచేలోనికి వెళ్ళి కడుపునిండా తింటూ సుఖంగా జీవించేది. కాని ఒకనాడు దానికి ఇలాంటి చిన్న చిన్న వాళ్ళ దగ్గర కాక, పెద్దవాళ్ళ దగ్గరకు వెళ్ళి ఆహారాన్ని ఎందుకు స్వీకరించకూడదు అనే ఆలోచన వచ్చింది. ఎదురుగా ఒక పెద్ద బూరుగు దూది చెట్టు, చెట్టునిండా వందలాది కాయలు వేలాడుతూ కనిపించాయి. ఉడుత ఆత్రంగా చెట్టుమీదకు ఎక్కి కాయలను పండ్లతో కొరికింది. కేవలం దూది మాత్రమే పైకి వచ్చి గాలికి అటుఇటూ ఎగిరిపోయింది. ఉడుతకు చాలా నిరాశ కలిగింది.*

*పెద్దవాళ్ళు, గొప్పవాళ్ళు అనుకునేవారి వల్ల సాధారణ మానవులకు పెద్దలాభమేమి ఉండదు. సెనగ మొక్కల వలె చిన్నగా కనిపించే మనుష్యులే ఉడుత కడుపు నిండిన విధంగా సాటివారి అవసరాలను, ఆపదలను తీర్చడానికి సదా సన్నద్ధులై ఉంటారు. ఇది తెలియని అమాయకులు పెద్ద వారేదో ఉద్ధరిస్తారని భ్రమపడుతుంటారు.*

*– ప్రజ్ఞా పురాణం నుండి*

**[redacted] తెలియదు అని తెలుసుకోవడమే జ్ఞానానికి తొలిమెట్టు.**

వర్తమాన భారతం

# తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు

## వృద్ధాప్యము భవ్యంగా ఉండే ప్రణాళిక వికసించాలి

కొన్ని సంవత్సరాల క్రితం 'బాగవా' అనే ఒక హిందీ చలనచిత్రం వచ్చింది. దాని అర్థం – క్షమ. తమ సంతానమును చదివించి, సంపాదనాపరులుగా తీర్చిదిద్దిన ఒక వృద్ధదంపతుల కథ ఇది. సంతానమునకు కూడా పిల్లలు కలిగారు. అప్పటికి వీరికి పదవీవిరమణ సమయం వచ్చింది. ఈ మధ్యకాలంలో దంపతులు తమ సమస్తమును తమ సంతానమునకే వెచ్చిస్తూవచ్చారు. తమ సంతానం తమ బాగోగులు చూస్తారనే నమ్మకంతో ఈవిధంగా చేశారు కానీ అలా జరుగలేదు. తల్లిదండ్రులను వారు పంచుకున్నారు. తల్లి ఒకరితోను తండ్రి ఇంకోకరితోను ఉండేటట్లు ఒప్పందం చేసుకున్నారు. ప్రతి ఆరునెలలకు మార్పు చేసుకుందామని నిర్ణయించుకున్నారు. బాధలు పడుతూ, తిట్లు–చీవాట్లు తింటూ, చిన్నచిన్న విషయాలకే దెప్పిపొడుపులు అనుభవిస్తు, తిండికి కూడా మొహం వాచి తన భర్త నుండి వేరుగా ఉంటున్న ముసలితల్లి, భార్యనుండి వేరుగా ఉంటున్న ముసలి తండ్రి కథ ఇది.

ఇది ఒక చలనచిత్ర కథ. ఒక దర్శకుడు కోరుకున్నట్లుగానే దీని ముగింపు ఉంది. కానీ ఇలాంటి కథలు భారతదేశంలో నిత్యమూ కనిపిస్తూనే ఉంటాయి. మనస్సును కదిలించివేసే కొన్ని ఉదాహరణలను ఇక్కడ పొందుపరుస్తున్నాం.

1) జులై 2007 తమిళనాడులోని ఈరోడ్‌లో కాళ్లు, చేతులు కదిలించలేని నిస్సహాయస్థితిలో ఉన్న ఒక 75 సంవత్సరాల తల్లిని ఆమె కుమార్తె తన కొడుకు చేతుల మీదుగా చెత్తకుప్పలోకి విసిరివేయించింది. తరువాత ఎవరో ఆమెను ఒక సమాజసేవా సంస్థకు అప్పగించారు.

2) జూన్ 2008 లో లక్నోలోని అలీగంజ్‌లో నిర్లక్ష్యం చెయ్యబడ్డ ఒక వృద్ధుడు బలవంతంగా తన సామానుతోసహా వీధిపాలు కావల్సివచ్చింది. ఆయన సంతానమే ఆయనను తమ మంత్రగాని మాటలను అనుసరించి ముందుగా పీడించి, బెదిరించి, ఆ తరువాత బయటకు నెట్టివేశారు. ఇల్లు ఆ వృద్ధునిదే!

3) ఢిల్లీకి చెందిన శివసింహ్ ఖితౌలియా అనే 92 సంవత్సరాల వృద్ధుడు తమ పిల్లలు తనకు సహాయం చేయటంలేదని న్యాయస్థానం తలుపులు తట్టవల్సివచ్చింది. పిల్లలు ఆయనను స్వంత అపార్ట్‌మెంట్‌నుండి గెంటివేసి, దానిని ఆక్రమించుకున్నారు.

4) వృద్ధ సమాజ సేవకురాలు అయిన శిక్షావిద్ లోతికా సర్కార్ అనే ఆమెను ఆమె ఇంటి కిరాయిదారుడైన ఐ.పి.యస్ అధికారి మోసగించి ఆమెను ఆ ఇంటినుండి గెంటివేశాడు. రచయితల వర్గమంతా లోతికా పక్షాన నిలిచింది. గృహమంత్రిత్వశాఖ కార్యాలయం తలుపులు తట్టింది. ఉన్నత కుటుంబానికి చెందిన 87 సంవత్సరాల మహిళ ఐ.పి.యస్ అధికారి దౌర్జన్యాన్ని ఎదుర్కొనడానికి ప్రతి ఇంటి తలుపూ తట్టవలసివచ్చింది.

## జాలి, దయ లేని సమాజం - శాపగ్రస్తమైన వృద్ధావస్థ

పెరుగుతూపోతున్న భోగవాదం (విలాసజీవితం)– స్వేచ్ఛావాదాల పరంపర వ్యక్తిని భావనా రహితునిగా చేసిందనేది వాస్తవమని పై ఉదాహరణలు నిరూపిస్తున్నాయి. వృద్ధావస్థ నేడు ఒక శాపంగా పరిణమిస్తున్నది. వారి పొడిబారిన కళ్ళల్లో నిరంతరం భయమే కనపడుతున్నది. మృత్యువూ రాదు. సంతానం వదిలివేసింది. ఎక్కడికి వెళ్తారు? కొంతకాలం క్రిందట హరిద్వార్‌లో జరిగిన మహాకుంభమేళాలో తమవారినుండి తప్పిపోయిన వృద్ధమహిళలు కోకొల్లలుగా దొరికిన సంఘటనలు అనేకమున్నాయి. వీరంతా తప్పిపోలేదు అన్న విషయాన్ని తెలుసుకున్న రక్షకభటులు ఆశ్చర్యమునకు లోనైనారు. వీరిని వీరి కొడుకో, కూతురో, కోడలో వదిలించుకోవాలనుకున్నారు కనుక మేళాకు తీసుకువచ్చి జనసముద్రంలో వదిలేసి మాయమైపోయారు. దీనిని కలియుగం యొక్క పరాకాష్ఠ అనక ఇంకేమనగలం?

## పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

మన దేశంలో ప్రస్తుత గణాంకాల ప్రకారం ఏమీ చెయ్యలేని స్థితిలో ఉన్న వృద్ధుల సంఖ్య సుమారు 9 కోట్లు. ఈ సంఖ్య 2020 నాటికి సుమారు 24 కోట్లకి చేరుతుంది. ఇందులో 33% మంది వృద్ధులు దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారు. గ్రామీణ లేక బస్తీ ప్రాంతాలలో నివసిస్తున్న 73% మంది నిరక్షరాస్యులు.

[redacted]కు నిమిత్తమాత్రుడు కావడంలోనే ఉన్నది ఆస్తికత.

భర్తృవిహీనులైన వృద్ధ మహిళలు 55% మంది ఉన్నారు. వారికి సంతానం తప్ప మరే ఆధారమూ లేదు. ఢిల్లీ మహానగరంలో ఒక సర్వే చేయగా 49% మంది వృద్ధులు వారి సంతానం వారితో చెడుగా వ్యవహరిస్తున్నారనే అనే విషయం వెల్లడైనది. చాలామంది వారి సంతానం వారిని తమతో ఉంచుకొని, కొద్దో-గొప్పో ఆలనాపాలనా చూడటానికి కారణం వారి దగ్గరున్న ధనమేనని భావిస్తున్నారు. లోభత్వం కారణంగానే వారు తల్లిదండ్రులను తమ దగ్గర ఉండనిస్తున్నారు.

### ఓల్డ్ ఏజ్ హోమ్‌లు పెరుగుతున్నాయి

ఎటువంటి స్థితి వచ్చింది? పిల్లలు తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని బయటికి వెళ్ళాలని పెద్దలు చెప్తుండేవారు. ఎంత గొప్పవారైనప్పటికి తల్లిదండ్రుల మీద శ్రద్ధా-గౌరవాలు చూపిస్తువుండాలి. ఆ పరిస్థితులకి బదులుగా నేడు తల్లిదండ్రులు తమ కొడుకులు-కోడళ్ళు-కూతుళ్ళను చూసి భయపడుతున్నారు. ఎప్పుడు కొడతారో, ఎప్పుడు ఇంటినుండి గెంటేస్తారో తెలియదు. ఇటువంటి వాతావరణ కారణంగా రమారమి ప్రతీ పట్టణంలోనూ 'ఓల్డ్ ఏజ్ హోమ్' అనబడే వృద్ధాశ్రమాలు అనేకం వాడవాడలా వెలుస్తున్నాయి. ఈ మాటలను వ్రాస్తున్న రచయిత – సంపాదకుడు నేటికి 18 సంవత్సరాల క్రితం గుజరాత్‌లోని ఒక మహానగరంలో ఒక కార్యాలయమునకు వెళ్ళాడు. అక్కడ రచయితకు వైద్యుడైన తన స్నేహితుడు కలిశాడు. రచయిత చేతనే వృద్ధాశ్రమానికి శంఖుస్థాపన చేయించాలనుకున్నాడు అతను. మన సంస్కృతిలో వీటి ఆవశ్యకత ఏమున్నది? తల్లిదండ్రులను పిల్లలు బాగానే చూసుకుంటున్నారు కదా! ఇలాంటి ఆశ్రమమును స్థాపించుటవలన లాభమేమిటి? అని అడిగాను. అప్పుడు ఆ మిత్రుడు ఇలా అన్నాడు. మీకు నమ్మకం కలుగకపోవచ్చు కానీ వార్తాపత్రికలో దీని ప్రకటన వచ్చిన వెంటనే 100 పడకలున్న ఈ వృద్ధాశ్రమానికి ఒక 1000 దరఖాస్తులు వచ్చాయి. సమాజం ఇంత వికృతమైపోయిందనే విషయం మనకు తెలియలేదు అనే ఆలోచనతో తలతిరిగిపోయింది. కానీ ఇది సత్యం. ఢిల్లీలోని 'సంధ్యా, ఆరాధనా, గోధూళి, నిర్మల-హృదయం, ఘరౌందా, హరమీత్ ట్రస్ట్' వంటి సంస్థలకు వెళ్ళి పాఠకులు కుప్పలుతెప్పలుగా ఇటువంటి కథలను వినవచ్చు. లక్నోకి చెందిన గాయత్రీ పరివార సభ్యుడు 'సమర్పణ' అనే పేరుగల ఒక వృద్ధాశ్రమమును 'నగర నిగమ్' సహకారంతో గత 8 సంవత్సరాలుగా విజయవంతంగా నడుపుతున్నాడు. అక్కడ కూడా పెద్ద క్యూ ఉంది.

### ఈ బజారులో బంధుత్వాలు అమ్మకానికున్నాయి

నేడు మహానగరాలలో ఒంటరిగా జీవించే వృద్ధుల (అధికశాతం మంది పిల్లలు విదేశాలలో పెద్ద-పెద్ద ఉద్యోగాలు చేస్తూ, అక్కడి పౌరులుగా స్థిరపడిపోయారు) కి వారెప్పుడు హత్యకు గురౌతారో తెలియదు. అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ వారు తమ ఇంట్లోనే తమ సేవకోసం నియమింపబడిన సేవకుల ద్వారా మోసపూరితంగా చంపివేయబడుతున్నారు. జీవితం యొక్క ముసలితనం ఇంత దురదృష్టకరంగా ఉంటుందని ఎవ్వరూ అనుకోరు. కానీ ఇది బజారుగా మారిన ప్రపంచీకరణ యొక్క ఒక నగ్నచిత్రం. ఆ బజారులో అన్ని వస్తువులూ అమ్మకానికుంటాయి. బంధుత్వాలుకూడా! తమ పైసా-పైసా కూడబెట్టి తమ ప్రియమైన చిన్నారులను చదివించిన మాతా-పితలుకూడా! విజ్ఞానం యొక్క అత్యంత ఆధునికమైన ఆవిష్కరణలను అందించిన 21 వ శతాబ్దంలో మానవజాతి అన్నింటికంటే గొప్పదైన మానవత్వం పోగొట్టుకుంది. తోడుగా తమ వృద్ధుల పట్ల గౌరవం, శ్రద్ధ, సేవాభావనలను గౌరవమును ప్రసాదించే ఉమ్మడికుటుంబ పరంపరను కోల్పోయింది.

### జనజాగృతికి చక్కని ప్రయత్నాలు

పంజాబ్ కేసరీ – అనే దినపత్రికను నడుపుతున్న కిరణ్‌చోపడా అనే ఆమె దీనినే 'ఏక్ మిషన్ – ఏక్ సేవా' అని భావించి వృద్ధుల మనోరంజనకు ఒక క్లబ్‌ను ఏర్పాటుచేసి, వారి పోషణ నిమిత్తం ప్రజలలో జాగృతిని తీసుకొచ్చారు. భారతదేశమంతటా ఇటువంటి కార్యక్రమం నడుపుట అవసరం. పాశ్చాత్య సంస్కృతిని అనుసరిస్తున్న భారతదేశం ఏ రీతిలో వృద్ధాశ్రమాల సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నదో; దానికి దీటుగా అంతే వేగంతో వృద్ధుల జీవితం గురించి ఆలోచించాలి. **రిటైర్మెంటుతోనే జీవితం అయిపోలేదు.** తరువాత కొత్త జీవితం జీవించాలి. సమాజసేవలో తమను తాము అర్పించుకోవాలి. దాని వ్యవస్థను గృహస్థాశ్రమం-యౌవనావస్థ నుండే చేయుట ఆరంభించాలి. ఈవిధంగా ఆలోచిస్తే – ఎవ్వరూ, ఎప్పటికీ వృద్ధులు కారు, అశక్తులు కారు. పైగా సర్వదా చిర-యౌవనంతో ఉంటారు. దీనితోపాటే మనం గ్రామాలలో ఉన్న వృద్ధులు, నిరక్షరాస్యులు, నిరాశ్రయులైన వృద్ధ పురుషులు-మహిళలకు కూడా క్రొత్త క్రొత్త ప్రణాళికలు ఆలోచించాలి. ప్రభుత్వం తన స్థాయిలో ప్రయత్నం చేస్తూనే ఉంది. కానీ స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థలు ఈ విషయంలో ముందుకొచ్చి పనిచేసితీరాలి.

[redacted]డ్డంకులు నీ తెలివితేటలకు పదును పెడ్తాయి.

## యాభై దాటినవారితో కలిసి నడుద్దాం

పరమపూజ్య గురుదేవులు వృద్ధాప్యంపై మూడు పుస్తకాలను రచించారు. వీటన్నింటిలో గురుదేవులు నొక్కి వక్కాణించిన విషయాలు–మీ సక్రియతను నిలుపుకోండి, వృద్ధాప్యమునకు సిద్ధం కావడం మానసికంగా ముందునుండే ఆరంభించండి, ఆశ్రమ వ్యవస్థకు అంతర్గతంగా వానప్రస్థాశ్రమం యొక్క చక్కని శిక్షణను తీసుకోండి. మిమ్ములను మీరు ఆధ్యాత్మిక కార్యక్రమాలలోనూ, సేవా కార్యక్రమాలలోనూ జోడించుకొనండి, మనవళ్ళు–మనవరాళ్ళ పొత్తిగుడ్డలు ఉతికే మానసికస్థితి నుండి బయటపడండి, కోరికలలో చిక్కుకోకండి, బాధ్యతలు పూర్తైన పిదప నూతన పాత్ర పోషించుటకు సిద్ధపడండి. వారు ఇంకా ఇలా వ్రాశారు. "పూర్వార్ధంలో సమాజం నుండి మనం పొందిన ఉపకారాలకు ఉత్తరార్ధంలో ఋణం తీర్చుకొనుటకే మనకు జీవితం లభించింది" ఇదేకాక గురుదేవులు మరో గొప్ప విషయమును కూడా చెప్పారు, జనసమాజం యొక్క సద్భావన–సత్ప్రవృత్తులను జాగృతం చేయుటకు ఎటువంటి ఉజ్జ్వలమైన నేతృత్వం లేక నాయకత్వం అవసరమో, అది వానప్రస్థాశ్రమం నుండే లభిస్తుంది. అవకాశం, అనుభవం, సద్భావనలు మరియు సత్ప్రయోజనాల మేలుకలయికతో వానప్రస్థులు ప్రజలను జాగృతపరచడమనే ఒక గొప్పపనిని పూర్తిచేయగలరు. ప్రాచీనకాలంలో చాలా విద్యాలయాలను వానప్రస్థులే నిర్వహించేవారు. కథాప్రవచనముల ద్వారా లోకమానసమును చక్కని స్థాయిలో ఉంచేవారు. ఈ సాధు–బ్రాహ్మణ పరంపరను గాయత్రీ పరివారము పునరుజ్జీవింపజేసి, సమయదానమిచ్చే వందలమంది వానప్రస్థులను సమాజమునకు అందించింది.

## వృద్ధులకు కొన్ని కార్యక్రమాలు

ఈనాటి వృద్ధావ్యస్థితిని చూస్తే వివిధస్థాయిలలో కార్యక్రమాలను చేపట్టాల్సివుంది. మొదటి కార్యక్రమమును – నగరములలో, చిన్న పట్టణాలలో చేపట్టవచ్చును. అదేమనగా – ఉపేక్షించబడిన వృద్ధులను వెదికి, వారి మనస్సులోని భయాన్ని పారద్రోలి, వారికి వారి అనుభవాలకు అనుగుణ్యంగా పనులను కేటాయించి, వారి బాధలను పోగొట్టాలి. వారి శారీరక, మానసిక ఆరోగ్యం యొక్క బాగోగులు కూడా చూడాల్సివుంటుంది. ఎముకలు చాలా తొందరగా బలహీనపడతాయి. జ్ఞాపకశక్తిని కోల్పోవుట, అల్జీమర్ వ్యాధి లాంటివి తొందరగా ప్రకోపిస్తాయి. వాటిని నివారించే ప్రణాళికను చేపట్టాలి. రెండవ కార్యక్రమంలో–గ్రామాలలోనూ, చిన్న పట్టణములలోనూ వయోజనవిద్య, స్వయం సేవ(తమ పనులను తామే చేసుకొనుట), ఆర్థిక, చట్టపరమైన విషయాల గురించిన సమాచారం వారికి తెలియజేయాలి. వారినికూడా దేశం యొక్క నిర్మాణాత్మక కార్య ప్రణాళికతో జోడించాలి.

## వానప్రస్థ పరంపరను పునరుజ్జీవింపచేయాల్సి ఉంది

మూడవ కార్యక్రమం – కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళలో కూడా మార్పును తీసుకురావాలి. ఒకనాడు వారి స్థితి కూడా ఇలాగే ఉంటుంది అనే విషయాన్ని వారికి తెలియజెప్పాలి. ఇప్పుడు వారేమి చేస్తున్నారో– దాని స్థానంలో వారుకూడా ఇప్పటినుండే వృద్ధాప్యమునకు సన్నద్ధులవ్వాలి. నాల్గవ కార్యక్రమం – వృద్ధులను దత్తత తీసుకొనుట, పిల్లలను దత్తత తీసుకున్నట్లుగా దంపతులు ఒంటరిగా ఉంటున్న ఒక వృద్ధుడిని లేక కుటుంబాన్ని దత్తత తీసుకుని వారి ఆలనాపాలన చేపట్టాలి. ఐదవ కార్యక్రమం – వానప్రస్థ ప్రణాళికను క్రియాన్వితం చేయాలి. దేశమంతటా వానప్రస్థ ప్రణాళికను విస్తరింపజేసి, అనుభవజ్ఞులైన వృద్ధుల సమయదానం యొక్క లాభమును సమాజమునకు ఇచ్చే ప్రయత్నాన్ని చేయాలి. మనం ప్రణాళికాబద్ధంగా ఈ కార్యక్రమాన్ని ఆచరణలోకి తేగలిగితే ఈ దేశానికి ఏ లోటు ఉండదు. యువ భారతం తిరిగి వృద్ధుల గురించి ఆలోచిస్తుంది. మరల మన సంస్కృతి యొక్క పురాతన వైభవ స్వరూపం మనకు తప్పక లభిస్తుంది. ఉమ్మడి కుటుంబ పరంపర పునర్జీవితమౌతుంది. సత్యయుగపునరాగమనం అప్పుడే సంభవమౌతుంది.

*– అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

### "గాయత్రీ మంత్ర సాధన-నా అనుభవం" రచనలకు ఆహ్వానం

*గాయత్రీమంత్రలేఖనం, యజ్ఞాలను నిర్వహించడం లేదా నిత్యగాయత్రి జపం చేయడం ద్వారా పొందిన అనుభూతులను, అనుభవాలను పాఠకులు, పరివార్ సభ్యులు పంపితే వాటిని స్థలాన్నిబట్టి ప్రచురించగలము. భాష, అనుభవాలు, అనుభూతుల విషయంలో స్పష్టత కలిగిన వాటినే ప్రచురించగలము. ఎంపిక విషయంలో సంపాదకమండలితే తుది నిర్ణయం. ఎలాంటి వాదోపవాదములకు తావు లేదు. ప్రతి నెల 10వ తేదిలోపు రచనలు పంపగలరు.*

[redacted]సదాలోచన బలం సైన్య బలాన్ని మించినది.



## బాలల భవితకు బంగారు బాట-11

# మంచివారి సంఖ్యను పెంచు

అదొక పెద్ద దేవాలయం. ఆలయ ప్రాంగణంలో ఒకానొక స్వామీజీ ఉపన్యాసం చెపుతున్నారు . "మంచివాళ్లు, చెడ్డవాళ్లు అంటూ మనుషుల్లో రెండు రకాలుగా ఉంటారు. ప్రతి మనిషిలో మంచీ చెడూ రెండూ ఉంటాయి. పూర్తిగా మంచి అయితే దేవుడు అంటారు. పూర్తిగా చెడు అయితే రాక్షసుడు అంటారు. రెండింటికి మధ్యలోని వాడు మనిషి. లోకంలో ఇంకా మంచి వారు మిగిలి ఉన్నారు కాబట్టే ప్రపంచం ఇంకా మునిగిపోవడం లేదు" ఇలా సాగిపోతోంది ఆయన ఉపన్యాసం.

వింటూ ఉన్న శిష్యులలో ఒకనికి ఒక సందేహం కలిగింది. అందరూ వెళ్లిపోయాక స్వామీజీని సమీపించాడు. "స్వామీజీ! అసలు మంచివాళ్లు ఎలా ఉంటారు? వాళ్లు చేసే పని ఏమిటి? వారిని గుర్తించడం ఎలా?" అని ప్రశ్నించాడు. "నాయనా! మంచి వాళ్లు కూడా మామూలు మనుషుల్లాగా ఉంటారు. ప్రవర్తనలోనే తేడా ఉంటుంది. వరదలు వచ్చినప్పుడు ఊళ్లన్నీ పూర్తిగా కొట్టుకుని పోకుండా అడ్డుపడతారు. ఆకాశం విరిగి భూమిమీద పడకుండా అరచేతులు అడ్డం పెడతారు. అంటే వారి మంచితనమే ప్రకృతి విలయాలను అదుపులో పెడుతుంది అని అర్థం. ఇదే వారు చేసే పని. వారిని గుర్తుపట్టాలంటే చాలా చిట్కాలు ఉన్నాయి. అందులో నీకు ఒక్కటి చెపుతాను. పరీక్షించి చూసుకో" అన్నాడు. ప్రక్కకు తీసుకుని వెళ్లి చెవులో ఏదో చెప్పాడు.

దేనినైనా అనుభవపూర్వకంగా తెలుసుకోవాలని శిష్యునికి అర్థమైంది. కాషాయబట్టలు ధరించాడు. భిక్షాపాత్రను చేతిలోనికి తీసుకున్నాడు. మెల్లగా ప్రక్క ఊరికి చేరుకున్నాడు.

ప్రొద్దున్నే లేచి ఇంటింటికీ వెళ్లేవాడు. భిక్షం వేయమని అర్థించేవాడు. ఎవరన్నా భిక్షం వేయ్యకున్నా, ఆలస్యం చేసినా వారిపై విరుచుకు పడేవాడు. నోటికి వచ్చినట్టు తిట్టిపోసేవాడు. ఇలా కొన్ని రోజులు గడిచేసరికి గ్రామస్థులు సహించలేకపోయారు. "నీ గురువు నీకు బిచ్చమెత్తుకోవడం కూడా సరిగా నేర్పలేదా?" అంటూ పట్టుకుని కట్టేశారు. చూట్టూ చేరి కొట్టడానికి సిద్ధం అయ్యారు. తప్పు ఒప్పుకుని వారి కాళ్ళా వేళ్ళా పడి ఎలాగో తప్పించుకున్నాడు. మర్నాడు మరో గ్రామాన్ని చేరుకున్నాడు. అక్కడా అదే పద్ధతి మొదలుపెట్టాడు. ఒకనాడు ఒక ఇంటిముందర నిలబడి భిక్షం అడిగాడు. భిక్షం వెయ్యడం కొంచెం ఆలస్యమయింది. ఇక తిట్లపంచాగం విప్పాడు. కొద్దిసేపటికి ఆ గృహిణి బయటకు వచ్చి బిచ్చం వేసింది. అంతే కాదు ఆలస్యం చేసినందుకు క్షమాపణ కోరింది. ఈ వింత ప్రవర్తనకు శిష్యుడు బిత్తరపోయాడు. "అమ్మా! నేను ఇన్ని తిట్లు తిడుతుంటే నీకు కోపం రాలేదా?" అని అడిగాడు.

"అయ్యా! తప్పు చేసింది నేను. నాకెందుకు కోపం వస్తుంది? నన్ను తిట్టింది నువ్వు కాదు. నీ ఆకలి ఆ విధంగా తిట్టించింది. ఆకలి బాధ ఉచ్చనీచాలు తెలుసుకోలేదు. నీవంటి సాధుపురుషుడు ఇలాంటి మాటలు మాట్లాడాడంటే నీ ఆకలి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోగలను. నేను పెట్టిన అన్నం నీ ఆకలిని మాత్రమే తీరుస్తుంది. ఆకలిమంట వల్ల వచ్చిన ఆగ్రహం చల్లారదు. అందుకే ఆలస్యం చేసినందుకు క్షమాపణ కోరాను. నన్ను క్షమించడం ద్వారా నీ ఆగ్రహం కూడా చల్లారుతుందని ఆశపడుతున్నాను" అంటూ సౌమ్యంగా వివరించింది.

శిష్యునికి సత్యం బోధపడింది. జ్ఞాననేత్రం విప్పుకుంది. గురువుగారి చెప్పిన చిట్కా రహస్యం తెలిసి వచ్చింది. ఆనాటి నుండి తన మీద ఎవరైనా కోపం చేస్తే తిరిగి కోపం తెచ్చుకోవడం మానేశాడు. వారి కోపానికి గల కారణాన్ని వెదకడం మొదలుపెట్టాడు. దానిని ఉపశమింపచేసేవాడు. ఇలా చేయగా చేయగా కోపాన్ని జయించే స్థాయికి ఎదిగాడు. కోపానికి లోబడకుండా తప్పించుకోవటం అలవాటు చేసుకున్నాడు. ఎప్పుడైనా అత్యవసర పరిస్థితుల్లో కోపం ప్రదర్శించాల్సివస్తే "బుసకొట్టు, కాటుమాత్రం వేయకు" అన్న సిద్ధాంతాన్ని పాటిస్తూ కార్యాన్ని చక్కపెట్టుకునేవాడు. తన కోపం వల్ల ఎదుటివారి కన్నా తనకే ఎక్కువ నష్టం అని అర్థం చేసుకున్నాడు. అతనికి తెలియకుండానే ప్రపంచానికి మేలు జరిగింది. ప్రపంచంలోని మూర్ఖుల సంఖ్యలో ఒకటి తగ్గింది. మంచివారి సంఖ్య పెరిగింది.

బాలలూ! విన్నారుగా! ఏ సంఘటనకైనా వెనుక ఏదో ఒక కారణం ఉంటుంది. దాన్ని తెలుసుకుని మసులుకోవడం నేర్చుకోండి. మీరు సుఖపడండి, ప్రపంచాన్ని రక్షించండి.

**కం॥కోపపడగ వలదు తెలియు**
**మా పరుల తపనల వెనుక గోప్యంబేదో**
**నీ పరువు నిలుపు కొంచును**
**కోపము సదలించుకొనుము కూరిమి బాలా!**

★★★

[redacted]మతో, న్యాయంతో కలిసి నడుస్తుంది సత్యం.

### ప్రజ్ఞోపనిషద్ : ప్రథమ మండలం-తృతీయ అధ్యాయం

# మనిషికి తన భాగ్యానికి తానే నిర్మాత

శ్వేతకేతో! మానవోయం మహాన్ పూర్ణాద్యతోధ్రువమ్
ఉత్పన్నస్తథ్యతస్తేన సోపిపూర్ణాస్తి మాన్యతామ్ (63)

కషాయ కల్మషావృత్తోం దరిద్రో దీన ఏవ చ
శిథిలీకరోతి యావచ్చ మాలిన్యం భవబన్ధనమ్ (64)

సామీప్య సరళం తస్య తావదీశస్య సంభవేత్
ఈశ్వరస్య సమీపేయః సామర్థ్యమధితిష్ఠతి (65)

**టీకా :–** హే శ్వేతకేతూ! మనిషి నిశ్చయంగా గొప్పవాడే. అతను ఈశ్వరుడి నుండి ఉత్పన్నం కావడం వల్ల పరిపూర్ణుడే. కషాయ కల్మషాల వల్ల వాడు దీనుడు, దరిద్రుడు అవుతాడు. మాలిన్యాల భవబంధనాలను ఎంతగా వదిలించుకుంటే ఈశ్వరుని సామీప్యం అంతగా లభిస్తుంది. ఎవరు ఈశ్వరునికి దగ్గరగా ఉంటారో వానిని సామర్థ్యం యొక్క అధిష్ఠాతగా భావిస్తారు.

అరణ్యసాధనాయాం హే బ్రహ్మవిద్యాభిసాధనాః
బ్రహ్మవేత్తార! ఆత్మీయం సామర్థ్య జ్ఞాయతాం భృశమ్ (66)

విశ్వాసస్తత్ర కర్తవ్యం తచ్చ వర్ధయతానిశమ్
బలిష్ఠతాయే సాహయ్యం యద్యపేక్షేత భిక్షతత్ (67)

సహైవాత్ర చ విజ్ఞేయస్త్వైశ్వరోనుగ్రహః సదా
అనురూపః పాత్రతాయా లభ్యతే నాత్ర సంశయః (68)

**టీకా :–** ఆరణ్యకసాధనలో, బ్రహ్మవిద్య సాధనలో ఉన్నటువంటి బ్రహ్మవేత్తలారా, ఆత్మ సామర్థ్యాన్ని అర్థం చేసుకోండి. దానిపై విశ్వాసం పెంచుకోవాలి. సహాయం అవసరం అయితే ఈశ్వరుడిని అడగండి. దీనితో పాటే గుర్తించుకోవలసినది ఏమిటంటే పాత్రత అనుగుణంగానే దైవీ అనుగ్రహం లభిస్తుంది. దీనిలో సందేహం ఏమీ లేదు.

విదమ్బనాథ దారిద్ర్యం వైపన్యాంచ విభీషికాః
దృశ్యన్తే సకంటాదీని సంసారేయాని తాని తు (69)

నికృష్టతోదితానీహ చిన్తనస్యాథ మన్యతామ్
దుశ్చారిణ్యోది తాన్యేవ భ్రష్టతామూలకాని చ (70)

**టీకా :–** ప్రపంచంలో దరిద్రత, ప్రమాదాలు, కష్టాలు, బాధలు మొదలైన అనేకానేక సంకటములు దృష్టిగోచరం అవుతాయి. ఇవి ఆలోచనలలో నికృష్టతల వల్ల, ఆచరణలో భ్రష్టత పెరిగిపోవడం వల్ల జరుగుతాయి.

యద్యాత్మశోధనేనాథ చాత్మ నిర్మాణకేన చ
వ్యక్తిత్వం వికసేత్తర్హి పాలయన్త ఇమాన్యపి (71)

యథా సూర్యోదయే జాతే న జ్ఞాయన్తే నిశాచరా ః
కథం బ్రహ్మోదయే జాతే భ్రష్టా మాయా విమోహయేత్ (72)

**టీకా :–** ఏ విధంగా సూర్యోదయం అయినపుడు నిశాచరులు కనుపించరో, ఆ విధంగానే ఆత్మశోధన, ఆత్మ నిర్మాణం ద్వారా వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకున్నట్లయితే సమస్త బాధలు మటుమాయమవుతాయి. బ్రహ్మజ్ఞానం లభ్యమైనపుడు భ్రష్టాచారానికి తావెక్కడుటుంది?

ఋషిభిర్మానవానాం తు దుఃఖదారిద్ర్య కారణమ్
పతనస్య పరాభూతేర్భిన్నత్వ మాలోకితం ద్వయోః (73)

న్యూనతాం తామపాకర్తుం స్వస్మాదన్యేభ్య ఏవచ
వ్యచారయన్ విభిన్నాంస్తాను పాయాన్ విశ్వమంగళాన్ (74)

**టీకా :–** మనుష్యుల దుఃఖ దారిద్ర్యాలకు, పతన పరాభవాలకు ఆత్మ పరమాత్మలను వేరు వేరుగా చూడటమేనని ఋషులు తెలుసుకుని, ఆ లోటును తమలో నుంచి, ఇతరుల నుంచి తీసివేయడానికి విభిన్న ఉపాయాల గురించి ఆలోచించడం మొదలుపెట్టారు.

దూరీభూతస్తు సన్దేహోయం సమేషాంచ విపత్తయః
అన్యోత్పాదితాః సన్తి యతః పాతోత్థితీ తథా (75)

మనుష్య భూమికాజన్యే తన్మనుష్యస్య స్వాం దిశామ్
శోధయిత్వానుకూల్యే చ ప్రాతికూల్యం వివర్తితుమ్ (76)

కఠినం నేతి తథ్యం స పిప్పలాదో మహామతిః
సగామ్భిర్యాం యథావోచత్తతస్తేషాం స్వమాన్యతా (77)

పుష్టా స్వాత్మని సంయుక్తే పరమాత్మని నిశ్చితః
సంకటానాం సమాధానే విశ్వాసః సర్వదా తతః (78)

ద్వితీయాహ్నికచర్చాయాం సర్వే జిజ్ఞాసవశ్చతే
యథార్థ సంయుతం పూర్ణం సమాధానం చ లేభిరే (79)

తృప్తా తథాపి జిజ్ఞాసా తేషాం నైవ తథా చతే
సందర్భేస్మిన్ననే కాశ్చ పృచ్ఛన్తి హృది విభ్రతః (80)

సాధకాః సత్రపూర్తై తే నిత్యనైమిత్తికాం తతః
సాధనాం కర్తు కామస్తే గతాః సంగతి పూర్వకమ్ (81)

*(మిగిలినది 14వ పేజీలో...)*

[redacted]ానం బాహ్య ప్రగతి, జ్ఞానం ఆంతరిక అనుభూతి.

**యుగగీత - 2**

# విషాదానికి పరాకాష్ఠ - శిష్యత్వ జాగృతి

క్రిందటి సంచికలో శ్రీమద్భగవద్గీత భూమిక ఇవ్వబడింది. అందులో మనం తెలుసుకున్న రెండు విషయాలు 'గీత'ను 'సుగీత' అని ఎందుకు అంటారు. ఈ శాస్త్రాన్ని తెలుసుకుంటే మరే ఇతర శాస్త్రం అధ్యయనం చేయవలసిన అవసరం లేదు. శ్రీ కృష్ణుడు, అర్జునుని పాత్రల అనేక కోణాలను ఈ మహాగ్రంథంలో దర్శించాం. మొదటి అధ్యాయమైన అర్జున విషాద యోగాన్ని ఈ సంచికలో చదువుతాం. మనలో ప్రతి ఒక్కరి జీవితాలలో ఎదురయ్యే ఒక ప్రత్యేకమైన పరిస్థితిని పరిచయం చేస్తుంది. ఈ అధ్యాయంలోని 47 శ్లోకాలు భావనల ప్రవాహాన్ని, యుద్ధభూమిని వర్ణిస్తాయి. ఈ అధ్యాయాన్ని అర్థం చేసుకుంటేనే గీత యొక్క గొప్పతనాన్ని అర్థం చేసుకోగలము.

గురుసత్తా భావనలతో గీత మొదటి అధ్యాయాన్ని అధ్యయనం చేస్తే అడుగడుగునా పరోక్ష మార్గదర్శనం లభిస్తుంది. అన్నింటిలోకి ఈ మొదటి అధ్యాయం విలక్షణమైంది. 'శ్రీ భగవానువాచ' అంటూ శ్రీకృష్ణుడు ఉపదేశించిన శ్లోకాలు ఈ అధ్యాయంలో ఎక్కడా ఉండవు. సంజయుడి ద్వారా 25వ శ్లోకంలోని ఉత్తరార్థంలో ఇలా అంటాడు. **"ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి"** "పార్థా! యుద్ధానికి సన్నద్ధులైన కౌరవులను చూడు" మిగిలిన పదిహేడు అధ్యాయాలలోనూ అర్జునుడి జిజ్ఞాసను కృష్ణుడు తృప్తిపరిచాడు. మొదటి అధ్యాయంలో మాత్రం సంజయుడు యుద్ధ క్షేత్రాన్ని వర్ణిస్తే, మరికొన్ని శ్లోకాలు అర్జునుడి శోకాన్ని, విషాదాన్ని వర్ణిస్తాయి. ఈ అధ్యాయంలో మూడు పాత్రలు – ధృతరాష్ట్రుడు, సంజయుడు, అర్జునుడు కనిపిస్తాయి. అర్జునుడిని గీతలో అనేక నామాలతో సంబోధించారు. పార్థ, ధనుంజయ, గుడాకేశ, కౌంతేయ మొదలైనవి. ఈ పాత్రలను తెలుసుకుందాం.

గీత శుభారంభం ధృతరాష్ట్రునితో అయింది. అతడు అంధుడు, మోహాంధుడు. ఒక గుడ్డివాని పలుకులతో మొదలైన గీత, కృష్ణార్జునులు ఉన్న చోట నీతి తప్పక గెలుస్తుంది అనే ఆశ్వాసనతో 18వ అధ్యాయంలో ముగుస్తుంది. మొహంధుడైన ధృతరాష్ట్రుడు మొదటి శ్లోకంలో అడిగే ప్రశ్న–

**ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమావేతా యుయుత్సవః ।**
**మామకాః పాండవాశ్చైవ కిమ కుర్వత సంజయ ॥**

"హే సంజయ! ధర్మభూమి అయిన కురుక్షేత్రంలో యుద్ధేచ్ఛతో ఏకత్రితమైన నా పుత్రులు, పాండుపుత్రులు ఏమి చేస్తున్నారు?" ధృతరాష్ట్రునికి యుద్ధంలో తన కొడుకులే కనిపిస్తున్నారు. ఈ పాత్ర ముందుగా "మామకాః" తన కొడుకుల గురించే ఆలోచిస్తుంది. వారి పరిస్థితి ఏంటి అనే బాధ ఎక్కువ. అంతేగాని తన కొడుకుల చేతిలో నిరంతరం అణిచివేయబడ్డ, దివంగతుడైన తన తమ్ముడి పిల్లలు, అజ్ఞాతవాసం అనుభవించిన పాండవుల గురించి చింత లేదు. "పాండవాశ్చైవ అని పాండవుల గురించి తరువాత విచారిస్తాడు. ఇక్కడ ప్రశ్నించేది అంధుడైన ధృతరాష్ట్రుడు. నేటి సమాజంలో సగటు మనిషి మనఃస్థితి కూడా ఇదే. పుత్రేషణ వల్ల పరహితం కన్నా ముందు తన సంతానం యొక్క క్షేమ సమాచారం తెలుసుకొనే ప్రయత్నం చేస్తాడు అంటే అతను కూడా గుడ్డివాడే. మహాభారతంలోని ఒక పాత్ర అయిన ధృతరాష్ట్రుడు తన ప్రశ్నతో 'గీత'ను మొదలుపెడతాడు. కాని నేటి సమాజంలో ఎందరో ధృతరాష్ట్రులున్నారు. మన సమాజంలో, రాజకీయాలలో, మన చుట్టూ ఎంతో మంది ఇటువంటి తండ్రులు పుత్రవ్యామోహంతో గుడ్డిగా అవినీతికి తలవగ్గి వారి చెప్పుచేతల్లో ఉంటున్నారు. తమ జ్ఞానచక్షువులను జాగృతపరుచుకోలేక పోతున్నారు. సమాజంలోని అతి పెద్ద సమస్యకు కారణం ఇదే.

ఇక రెండవ పాత్ర సంజయుడు. తన దివ్యదృష్టితో ధృతరాష్ట్రుని ప్రశ్నకు జవాబిస్తూ మొత్తం గీతను వినిపిస్తాడు. గుడ్డివాడైన ధృతరాష్ట్రుడికి సంజయుడు సారథి. మహాత్ముడైన విదురుని శిష్యుడు కావడం సంజయుడి అదృష్టం. విదురుడి వంటి జ్ఞాని, నీతిజ్ఞుడు, పరమభక్తుడు, భారతంలోనే కనిపిస్తాడు. అందుకే భగవంతుడు దుర్యోధనుడి ఇంటి విందును కాదని విదురుని ఇంటి సామాన్యమైన సాత్విక ఆహారాన్ని ఇష్టపడ్డాడు. సాదా జీవనం గడిపే విదురుడు తపశ్చర్య సిద్ధితో సంజయుడికి దివ్యదృష్టి ప్రసాదిస్తాడు. ధృతరాష్ట్రుడు పుట్టుగుడ్డివాడే కాక ప్రజ్ఞాచక్షువులు కూడా మూసుకునే ఉన్నాయి కాబట్టే ఈ విధమైన ప్రశ్నలు వేస్తున్నాడు. సంజయుడికి సిద్ధించిన దివ్యదృష్టివల్ల ఎక్కడో దూరంగా ఉన్న కురుక్షేత్రంలోని ప్రతీ సంఘటననీ, మానసిక స్థితుల ఒడుదుడుకులను ధృతరాష్ట్రుడికి వర్ణించగలిగాడు. సంజయుడికి దివ్యదృష్టితో పాటు బాహ్య ప్రజ్ఞా చక్షువులు కూడా ఉన్నాయి. అతడు నీతిమంతుడు, దివ్యదృష్టి సంపన్నుడే కాక, ఒక గుడ్డిరాజుకి వినమ్ర సేవకుడు కూడా.

[redacted] ప్రసన్నమైన మనస్సు స్వర్గంతో సమానం.

మనోమయకోశ జాగృతి సిద్ధించిన సంజయుడు, మహా భారత యుద్ధ దృశ్యాలను ధృతరాష్ట్రుడికే కాదు, యుగయుగాలనుండి స్వాధ్యాయం చేస్తున్న మనవంటి జిజ్ఞాసువులందరికీ చూపిస్తూనే ఉన్నాడు. ఆజ్ఞాచక్ర స్థానంలో విదురుని స్పర్శ వల్ల సంజయుడి మనోమయకోశం జాగృతమైంది. ఆజ్ఞాచక్రం జాగృతమైతే ఏమౌతుంది? సర్కసులోని ఫ్లడ్‌లైట్ వంటి ప్రకాశపుంజం 'లైట్ బీమ్' లాగా కావలసిన స్థలం మీద పడుతుంది. మన శరీరంలోని పిట్యూటరీ, పీనియల్ గ్రంథుల మధ్య హైపోథలామస్ అనే ఒక స్థలమున్నది. అదే ద్విదళ ఆజ్ఞాచక్రం, మనస్సు నుండి ఉద్భవించిన ఈ ప్రకాశపుంజం లైట్ బీమ్ లాగా వచ్చి ఒక వృత్తంగా ఏర్పడుతుంది. ఏ స్థలాన్ని చూడదలుచుకున్నారో అది ఆ వృత్తంలో కనిపిస్తుంది. ఆజ్ఞాచక్ర జాగృతి సిద్ధించడం వల్ల మనసును ఏకాగ్రపరచి ఇలా చూడగలిగే సామర్థ్యం కలుగుతుంది. ఈ సిద్ధిని పొందిన సంజయుడు గద్గదుడై యుద్ధ దృశ్యాలన్నిటినీ తన రాజుకి వినిపించాడు. విదురుడు, భీముడు, కృపాచార్యుల సత్సంగం పొందగలిగిన సంజయుడి దివ్యదృష్టి సమగ్ర వివరణే 'గీత'. సంజయుడు కౌరవుల మధ్య ఉన్నప్పటికీ కౌరవుల మనిషి కాదు. నీతికి సంబంధించినంత వరకు ఆయన పాండవుల సదాచారం వైపే ఉండేవాడు. అదే ఆయన గొప్పతనం.

మూడవ పాత్ర అర్జునుడు. అర్జునుడు వీరుడు, యోధుడు అయినప్పటికీ అతని మనస్సులో సందేహం, భ్రమ, వ్యాకులత, చింత చోటుచేసుకున్నాయి. ఇప్పుడతడు ఒక హతాసుడైన, నిరాశాపరునిగా మన ముందుకొస్తాడు. నలువైపులా నిరాశ అలుముకున్న వ్యక్తిని ధర్మసమ్మూఢుడు అంటాడు. ఇటువంటి మూర్ఛిత స్థితి, ఆత్మ జాగరణకి మొదటిమెట్టు, ఇటువంటి మనః స్థితికి చేరుకున్నాకే శిష్యత్వం పుడుతుంది. గీతలోని మొదటి అధ్యాయంలో వర్ణించబడ్డ తారస్థాయి విషాదస్థితికి ఎవరైనా చేరుకుంటే, అతడు గురువుని చేరడానికి అనివార్యమైన ఆత్మసంతాప ప్రక్రియ గుండా పయనిస్తున్నాడని అర్థం చేసుకోవాలి. గురువు కావలనుకున్నవాడే విషాదానికి చరమస్థాయికి చేరుకుంటాడు. గురువు అవసరం తెలియనివాడు గురువుని వెతికే ప్రయత్నం చెయ్యడు, గురువు కనిపించినా అతడు గుర్తించడు. అటువంటి దౌర్భాగ్యశాలి జీవితాంతం అందరికీ ప్రవచనాలిస్తాడు, తర్కిస్తాడు, నీతి-ధర్మాల గురించి చెప్తాడు, కానీ వాటిలో దేనిని ఆచరించడు. తన సొంత తర్కంతో తన జిజ్ఞాసను తృప్తిపరచుకుని ఆత్మప్రగతికి అడ్డుపెట్టుకుంటాడు. యుధిష్ఠరుడిని ధర్మరాజు అంటారు. నీతి, ధర్మాల మీద మరెన్నో గొప్ప విషయాల మీద వ్యాఖ్యానించేవాడు కాని ఎప్పటికీ ఒక మంచి శిష్యుడు కాలేకపోయాడు, ఉపదేశించే ధర్మరాజుగానే మిగిలిపోయాడు. భీముడికి తన శారీరక సామర్థ్యం మీద ఎంతో నమ్మకం, తన బలాన్ని అభిమానించేవాడు. యుద్ధం మొత్తం తన భుజబలంతోనే గెలవవచ్చు అనుకున్నాడు, అంతకు మించి ఏమి ఆలోచించలేదు. నకుల సహదేవులు భావనాశీలురు, సరళ వ్యక్తిత్వం కలవారు. తర్కాన్ని ఉపయోగించేవారు కాదు, ఆదేశించిన దానిని చేసుకుంటూ పోయేవారు. ఈపాత్రలన్నిటినీ శ్రీమద్భగవద్గీత దృష్ట్యా మనం అర్థం చేసుకోవాలి. మనస్సులో గురుభావం ఎలా ఉదయిస్తుందో తెలుసుకోవాలి. విషాద సమయంలో, అయోమయ పరిస్థితిలో ధర్మసమ్మూఢత యొక్క చరమ పరాకాష్ఠ స్థితిలో గురువు యొక్క అవసరం కలుగుతుంది. ఈ తథ్యాన్ని అర్థం చేసుకోవడానికి మొదటి అధ్యాయం ఎంతగానో ఉపయోగపడుతుంది. శ్రీకృష్ణుడి పట్ల అర్జునుడికి మైత్రి, సఖ్యం, ఆత్మీయత భావాలున్నాయేమోకాని గురువు, దైవం అనే భావన లేదు. ఆ భావం కలగజేయటానికే, భగవంతుడా అతనిని రణభూమి నడిమధ్యలో నిలబెట్టి బంధువులను బాంధవ్యాలను చూపించి విషాదానికి పరాకాష్ఠ స్థాయికి చేరేటట్టు చేశాడు.

చాలామంది పరిజనులు గురువుగారికి, మాతాజీకీ మేము చాలా దగ్గరవాళ్ళం అంటారు. గురువుగారి కుర్తా ఒకటి మా దగ్గర ఉన్నది, ఆయన పన్ను ఒకటి ఊడితే మా దగ్గరే ఉంచేసుకున్నాం, మాతాజీ చెప్పులు మా దగ్గరున్నాయి, గురువుగారు రాసుకునే పెన్నొకటి మా దగ్గర ఉంది అంటూంటారు. వారికున్న శ్రద్ధవల్ల ఆ వస్తువులు వారి దగ్గర ఉండవచ్చు. కానీ గురువుగారి వంటి అవతారమూర్తిని, భగవత్స్వరూపాన్ని అర్థం చేసుకోలేకపోయిన వారు, తమ అంతర్జగత్తులో విషాదాన్ని ఉత్పత్తి చేసుకోలేక పోయినవారు, తమ మనస్సులో నిజమైన శిష్యత్వ భావాన్ని జాగృతపరచుకోనట్టే. అటువంటి శిష్యుడు మాటవరసకు మాత్రమే గురువుగారిని పరమపూజ్య గురుదేవులు అని పిలిచి వారి ఆశీస్సులు మాత్రమే తీసుకుంటాడు. గురువు శిష్యుని అంతఃకరణలో ఆసీనుడై ఉన్నప్పుడు విషాదాన్ని పరాకాష్ఠ స్థాయికి చేర్చి అతని మోహాన్ని నశింపచేస్తాడు. అతనిలో నిజమైన వైరాగ్యాన్ని కల్పించి అతని సూత్రాన్ని బ్రహ్మచైతన్యంతో ముడి పెడతాడు. ఈ అధ్యాయంలో చూపించిన అర్జునుడి విషాదం వల్ల మనకొక విషయం తెలుస్తుంది. గురువుని పొందాలంటే భయంకరమైన మానసిక వ్యాకులతను అనుభవించవలసి వస్తుంది. గురువు మనకి బంధువు, మిత్రుడు కావచ్చు, అవసరంలో ఆదుకునేవాడు, అన్నీ సమకూర్చిపెట్టేవాడూ కావచ్చు కాని నిజమైన శిష్యుడికి ఎప్పుడు

**[redacted]ట్టలను తినివేస్తాయి. అసూయ మనిషిని తినివేస్తుంది.**

నిజమైన గురువు అవుతాడో తెలుసుకోవాలంటే మనం మొదటి అధ్యాయాన్ని నిశితంగా తెలుసుకుని అంతరాళంలో ప్రతిష్ఠించుకోవాలి.

భగవంతునికి భక్తునికీ మధ్య ఉండేది ఉన్నత స్థాయి సంబంధం. భక్తుడు తాను ఆరాధించే దేవుడ్ని ఎంతైనా ఆడిపోసుకోవచ్చు, అలాగే భగవంతుడు తన భక్తుడి కోరికలు తీరుస్తూ, అతని మాట వింటానికి సిద్ధంగా ఉంటాడు, అది నామదేవుడైనా, కబీరైనా, మొసలినోట్లో చిక్కుకున్న గజరాజైనా, ద్రౌపతైనా సరే. నామదేవుడి కథ మీకు తెలిసే ఉంటుంది, అతడు భగవంతుడిని తిడతాడు. "నీ ముందు నిల్చుని, నీ విగ్రహం ఎదురుగా నేను కీర్తనలు పాడుకుంటూ ఉంటే ఈ బ్రాహ్మణులు, పండితులు నన్ను బైటకి పొమ్మంటున్నారు. నువ్వు వాళ్ళనేమీ అనవే?" దేవుడు ఏమీ సమాధానం ఇవ్వకపోయేసరికి అలిగి గుడి వెనక్కి వెళ్ళి అక్కడ కూడా కీర్తించడం చేశాడు. భక్తుడికి జరిగిన అవమానం అతను అనుభవించిన వ్యాకులత చూడలేక దేవుడు గుడినే నామదేవుడున్నవైపుకు తిప్పాడు. పుండరీపురంలోని గుళ్ళన్నీ తూర్పువైపుకీ ఉన్నా ఈ ఒక్క గుడి పశ్చిమోన్ముఖమై భక్తుని కీర్తిగాథను నేటికీ ప్రదర్శిస్తుంది. భగవంతునికి భక్తునికీ మధ్యనున్న సంబంధం వేరు, గురుశిష్యుల మధ్య సంబంధం వేరు. గురువు దూదేకులవాడిలాగా శిష్యుడ్ని దూదేకి సమర్థుడ్ని చేస్తాడు. మామూలు మాంసకండరాల సంబంధం భావనల బాంధవ్యం వంటిది కాదు ఈ సంబంధం. గురువు అతని శిష్యునిలో శిష్యత్వాన్ని ఏ విధంగా నింపుతాడు అన్నది శ్రీమద్భగవద్గీతలోని మొదటి, రెండు, పన్నెండు, పదిహేడు, పద్దెనిమిదవ అధ్యాయాలు తెలుపుతాయి. గీతంతా ఒక నిజమైన శిష్యుడ్ని జాగృతపరచడానికి ఉపయోగపడే ఒక సమగ్ర పాఠ్యపుస్తకం.

కృష్ణుడు అర్జునుడికి దగ్గర బంధువు, చాలా చనువుగా ఉండేవాడు. ద్రౌపతిని వరించేటప్పుడు కూడా కృష్ణుడు అర్జునుడితోనే ఉన్నాడు, శ్రీ కృష్ణుని సోదరి సుభద్ర పెళ్ళి అర్జునుడితోనే జరిగింది. కుంతి శ్రీకృష్ణుని మేనత్త అవడంలో ముందే వారు బావలైతే, సుభద్ర పెళ్ళితో బావ-బావమరుదులయ్యారు. అజ్ఞాతవాసంలో కూడా కలిసే ఉన్నారు. ఎన్నో యుద్ధాలు కలిసి పోరాడారు, కాని అదే బాంధవ్యం – మిత్రుడు, సుఖుడు, బావ. ఏ గురుభావాన్నైతే గీతాకావ్య రచయిత వ్యాసమహర్షి అర్జునుడి మనస్సులో విషాదం కలిగించి శిష్యత్వాన్ని ఉదయింపచేయాలనుకున్నారో ఆ గురుభావం ఇంకా ఉదయించలేదు. శ్రీ కృష్ణుని యోగీశ్వర రూపం అర్జునుడికి తెలిసినప్పటికీ, తన బంధువులనూ చూసి పెద్ద బాధకు గురై ధర్మసమ్మూఢ, కింకర్తవ్యవిమూఢుడయ్యాడు. ఆ పరిస్థితిలో ఆ శ్రీకృష్ణుని నుండి ఒక మహాగురువు, యోగిరాజు ఉదయిస్తాడు.

మనందరిదీ కూడా చాలా వరకు ఇదే పరిస్థితి. మన ఆరాధ్య గురుదేవులు మనకూ తెలుసుకాని వినము. మన కోరికల్ని తీర్చినవారిగా, మన శ్రేయాభిలాషులుగా, మరెన్నో ప్రేమమయ స్వరూపాల్లో గురువుగారి స్మృతులు మనోఫలకంపై లిఖించబడ్డా కూడా వారే యోగీశ్వరులు, ప్రజ్ఞావతారులు, మహాదేవులు, పరబ్రహ్మ సత్తాకి ప్రతినిధి, గోవిందునికన్నా ఉత్తముడు అని శాస్త్రాలు పేర్కొన్నాయి అన్న విషయాన్ని గ్రహించడానికి సిద్ధంగా లేము. మన పరిస్థితి, అర్జునుడి పరిస్థితి వేరే కాదు. శ్రీ కృష్ణ ద్వైపాయన వ్యాసుడు శ్రీ మద్భగవద్గీతలో అందంగా వర్ణించిన విధంగా మనము కూడా విషాద చరమావస్థకు చేరుకుంటే ఆ సద్గురువు మన గురుదేవులైన పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల ద్వారా ప్రత్యక్షమవుతారు. గురువు పట్ల శరణాగతి భావంతో పాటు వారిని పరబ్రహ్మ స్థాయిలో అర్థం చేసుకోవాలి. గురువు పట్ల ఈ భావానికి శిష్యునిలోని రసాయనశాస్త్రం నాడీ వ్యవస్థ, రోమరోమాలను కూడా మార్చగలిగే సామర్థ్యం ఉంది. అర్జునుడికి లాగా మనందరిలోనూ గురుసత్తా ఇటువంటి భావాన్ని కలగజేయాలనుకుంటే, విషాదం యొక్క పరాకాష్ట స్థాయికి చేరుకుని సర్వాన్నీ గురువుకి అప్పగించాలి. మన ఇష్టాలను తుడిపేసుకోవాలి. మొదటి అధ్యాయంలో కృష్ణుడికి మాట్లాడే అవకాశమే రాలేదు. అర్జునుడు చాలా గొప్ప తర్కాలను ప్రస్తావించాడు. ఏదైనా మంచిపని చేయాలన్న, ధర్మసమ్మతమైన ఆచరణలో ఇబ్బంది కలిగినా, మనిషి తన తర్కంతో నీతి వాక్యాలను కొట్టిపారేసే ప్రయత్నం చేస్తాడు. అర్జునుడు విద్వాంసుడు, జ్ఞాని, తన కాలంలో ఎంతో పేరు ప్రఖ్యాతలున్న గొప్ప ధనుర్ధారి, ప్రతిభాసంపన్నుడు. మిగిలిన పాండవులెవరూ అర్జునుడితో సమానులు కారు. నేటి సమాజంలో యుగనేతృత్వం వహించగలగాలంటే అర్జునుడి స్థాయి ఉండాలి. యుధిష్ఠరుడు, భీముడు, నకులుడు, సహదేవుల స్థాయిలో ఉన్నవారు ఈ భారాన్ని సహించలేరు. ప్రస్తుతం మానవజాతి రిప్రజెంటేటివ్‌గా అర్జునుడిని అనుకోవాలి. సంపూర్ణ శిష్య సముదాయానికి ప్రతినిధి, ప్రతీక అర్జునుడు. మొదటి అధ్యాయములో అర్జునుడి రోదన విన్నాక యోగీశ్వరుడైన కృష్ణుడు అప్పుడు ఏ సందేశానిచ్చాడో అది ఇప్పటికీ యుగానుకూలమైనది, శాశ్వతమైనది.

**[redacted]కున్న పాపాలే రోగాలుగా పరిణితి చెందుతాయి.**

గీత మొదట్లోనే ఒక విలక్షణ స్థితి మనకి కనిపిస్తుంది. అర్జునుడు, ధృతరాష్ట్రుడు వేరు వేరు తరాలకు చెందినవారు. ఇద్దరూ మోహగ్రస్తులు. శోకంలోనూ, మోహంలోనూ ఎవరూ ఏ నిర్ణయమూ తీసుకోలేరు. అర్జునుడు రణభూమిలో బంధువులను చూస్తున్నాడు, ధృతరాష్ట్రుడు కూడా సంజయుని దివ్యదృష్టి ద్వారా తన బంధువులను చూస్తున్నాడు. అయినప్పటికీ ఇద్దరి చూపులలో తేడా ఉంది. ధృతరాష్ట్రుడు మోహాంధుడైతే, అర్జునుడు మోహంతో బాధపడుతున్నాడు. ధృతరాష్ట్రుడు ద్వేషంతో రగిలిపోతున్నాడు కాని అర్జునుడు సమర్పణతో నిండి ఉన్నాడు. ధృతరాష్ట్రుడి వల్ల లెక్కలేనన్ని కుటుంబాలు నాశనమైయ్యాయి. కానీ అర్జునుడు అప్పటి భారతాన్ని మహాభారతంగా రూపొందించి అవినీతి అధర్మాల సామ్రాజ్యాన్ని నశింపజేయడానికి పూనుకుని ఉన్నాడు. అందుకు అతనిదే సరైన పాత్ర. భగవంతుని సఖుడు-భక్తుడైన అర్జునుడికి దైవకృపవల్ల చరమ స్థాయి విషాదం వరంలా ప్రసాదించబడింది. నేటి సమాజంలో అనేకమంది ధృతరాష్ట్రులున్నారు. లోకసేవకి అంకితమవ్వాల్సిన సమయంలో మోహంలో చిక్కుకుని బయటపడడానికి కూడా ఇష్టపడట్లేదు. ఇటువంటి ధృతరాష్ట్రులు చక్కటి అవకాశాలను జారవిడుచుకుని, తలపట్టుకుని పశ్చాత్తాప పడుతూ కనిపిస్తారు.

గీతలో మొదటి నుండే అనేక విలక్షణమైన దృశ్యాలను చూడవచ్చు. అది కురుక్షేత్ర మైదానం. రెండో శ్లోకం నుండే సంజయుడు ఈ విధంగా చెప్పడం మొదలెడతాడు.

**దృష్ట్వాతు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా ।**
**ఆచార్యముప సంగమ్య రాజా వచనమబ్రవీత్ ॥ 1-2**
**పశ్యైతాం పాండుపుత్రాణామ్ ఆచార్య మహతీం చమూమ్ ।**
**వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥ 1-3**

**భావం :** రాజైన దుర్యోధనుడు వ్యూహరచనతో సమరమునకు మోహరించియున్న పాండవసైన్యమును చూసి ద్రోణాచార్యుని కడకేగి ఇట్లు పలికెను. "ఓ ఆచార్యా! బుద్ధిమంతుడైన మీ శిష్యుడును, ద్రుపద పుత్రుడు అయిన దృష్టద్యుమ్నునిచే వ్యూహాత్మకముగా నిల్పబడిన పాండవుల ఈ పెద్దసైన్యమును చూడండి."

ఈ రెండు శ్లోకాలలోనూ చాలా రహస్యమైన విషయాలు దాగి ఉన్నాయి. వీటిలో దుర్యోధనుడి మనోవృత్తులు బయటపడతాయి. దుర్యోధనుడు ద్రోణాచార్యుడి దగ్గరకు ఎందుకు వెళ్ళాడు, వేరెవరి దగ్గరకో ఎందుకు వెళ్ళలేదు. దృష్టద్యుమ్నుడి గురించే ఎందుకు మాట్లాడాడు. వేరెవరి గురించీ ఎందుకు మాట్లాడలేదు? ఎందుకంటే దృష్టద్యుమ్నుడు పుట్టిందే ద్రోణాచార్యుని మరణం కోసం. ఆయన దగ్గరకు వెళ్ళి ఆ పేరు చెపితే మనసులో ఆక్రోషం, విద్వేషం, పగ రగులుతాయి అని తెలుసు. దృష్టద్యుమ్నుడు పాండవుల సేనాధిపతి. ద్రుపదుని కుమారుడు. ద్రోణాచార్యునికీ ద్రుపదునికీ చిరకాల వైరం ఉంది కాబట్టే ద్రుపదపుత్రుడు అని సంబోధించాడు. ద్రోణాచార్యుని చంపాలనే దైవీ ఆదేశంతో అగ్ని నుండి ఉద్భవించాడు దృష్టద్యుమ్నుడు. మొదట్లోనే తనసేనాధిపతి అయిన ఆచార్యులను రెచ్చగొడితే ఆయన తన పూర్తి శౌర్యాన్ని ప్రదర్శిస్తారని దుర్యోధనుడికి తెలుసు. ఈ మాట చెప్పిన తర్వాతే మిగిలిన వారందరి పేర్లూ చెప్పాడు. మాటవరసకు అభిమన్యుడి గురించి ద్రౌపతి ఐదుగురి పుత్రుల గురించి కూడా చెప్తాడు. అంతటితో ఆగక 10వ శ్లోకంలో ఎవరు గెలుస్తారు అనేది కూడా నిర్ణయించేస్తాడు.

**అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।**
**పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥ 1-10**

**భావం :** భీష్మపితామహునిచే సురక్షితమై అపరిమితముగానున్న మన సైన్యము అజేయమైనది. భీమునిచే రక్షింపబడుచు పరిమితముగానున్న ఈ పాండవ సైన్యమును జయించుట సులభము.

దుర్యోధనుడి దృష్టిలో భీముడొక్కడే రక్షకుడు. గర్వోన్మత్తుడైన దుర్యోధనుడికి తన పదకొండు అక్షౌహిణీల సైన్యం అజేయంగా కనిపిస్తోంది, తన చిరప్రతిద్వంది భీముడు ఓడిపోయినట్లు కనిపిస్తున్నాడు. ఈ అతి ఆత్మవిశ్వాసం, దుర్బుద్ధి అతని పతనానికి కారణాలైయ్యాయి. ముఖ్య పాత్ర వహించిన శ్రీ కృష్ణార్జునుల కన్నా ఈ దోష భూయిష్టమైన బుద్ధే వినాశనానికి కారణమైయ్యింది. దుర్యోధనుడి మనస్సులోని ద్వేష బీజాలవల్లే అతనికి నలువైపులా భీముడే కనిపించాడు. శ్రీ కృష్ణునిలో ఒక గొల్లవానినే చూస్తున్నాడు, కృష్ణుడు అర్జునుడి రథసారథి మాత్రమే. శ్రీ కృష్ణ భగవానుని ఇదివరకు కూడా సామాన్యుడిగా పరిగణించి, అవమానించి దెబ్బలు తిన్నాడు. ఒక వేళ ఎవరిది ఏ స్థాయి అనే లెక్క సరిగ్గా చేసి ఉంటే దుర్యోధనుడు పదవ శ్లోకంలో అలాంటి మాటలనకుండా నిజాయితీగా యుద్ధం చేసేవాడేమో చేయలేదు కనుకనే చనిపోయాడు.

మన ఆలోచనా సరళిని వికసింపచేసుకునే దృష్టిని ప్రసాదించి, జీవన సంగ్రామంలో నీతి పథంపై నడిచే సమగ్ర శిక్షణిస్తుంది కాబట్టే మహాభారతంలోని ఈ గీతా ప్రకరణలను మనందరమూ చదివితీరాలి.

– అనువాదం : శ్రీమతి జయలక్ష్మి

[redacted]విత్రత సద్భావన ఆత్మబలాన్ని పెంచుతాయి.

వ్యక్తి నిర్మాణం

# ఉన్నత మానసికతకు నాలుగు వర్చస్సులు

గత సంచికలో భౌతిక జీవనానికి సంబంధించిన పంచశీలములు వివరించబడ్డాయి. ఇప్పుడు మానసిక క్షేత్రమునకు సంబంధించిన విషయాలు చెప్పబడుతున్నాయి. ఈ రెండు అంటే నడవడిక మరియు భావనాత్మకమైన విశేషతలను కలుపగలిగితే ఇహపరలోకముల రెండింటినీ సమున్నత స్థాయికి చేర్చగలము. నాలుగువేదములు, నాలుగు ధర్మములు, నాలుగు కర్మలు, నాలుగు దివ్య వరములు, అని వేటిని అంటామో ఆ నాలుగు మానసిక విశేషతలను **1. ఇంగితజ్ఞానము, 2. నిజాయితీ 3. బాధ్యత 4. సాహసము** అనే పేర్లతో పిలుస్తారు.

**ఇంగితజ్ఞానము** యొక్క అర్థము, తాత్కాలిక ఆకర్షణపై సంయమనం కలిగిఉండుట, అంకుశమును ప్రయోగించుట మరియు దూరదృష్టి, చిరస్థాయి, పరిణితుల ప్రతిక్రియల స్వరూపమును అర్థము చేసుకుని తదనుగుణంగా నిర్ణయించుట, ప్రయత్నించుట చేయాలి. రుచులయందుగల తీవ్రమైన కోరికతో తినకూడని వాటిని తింటారు. మరియు కాముకత యొక్క ఉన్మాదంలో శరీరమును మరియు మస్తిష్కమును డొల్లగా చేసుకుంటారు. దూరదృష్టిలేని ఇతర పనులు ఇటువంటి దుష్పరిణామములనే ఉత్పన్నం చేస్తాయి. వాటి యొక్క ప్రేరణ వల్లనే జనం అనాచారమును అవలంబిస్తారు, చెడుకర్మలు చేస్తారు మరియు తిట్లను సహిస్తారు. దూరదృష్టిలేని కారణంగానే జనం చేపలవలె సామాన్య ప్రలోభములపై లోభంతో అతి విలువైన జీవితమును కోల్పోతారు. ఇంగితజ్ఞానంతో ఇంద్రియసంయమం, సమయసంయమం, వాక్‌సంయమము, అర్థసంయమముల నవలంబిస్తూ జీవన సంపదను అస్తవ్యస్థం చేసివేసే ఆ దోషాలను నిరోధించాలి.

**నిజాయితీ** గా వ్యవహరించడమే తేలిక. నమ్మకద్రోహము చేయుటకు అనేక మోసములు సృష్టించి మరియు మోసపూరిత వ్యవహారములు అవలంభించవలసి ఉంటుంది. గుర్తుంచుకొనదగిన సత్యమేమిటంటే నిజాయితీ ఆధారంగానే ఏ వ్యక్తి అయినా విశ్వాసపాత్రుడు కాగలుగుతాడు. అటువంటి వారికే ప్రజల యొక్క సహకారము మరియు గౌరవము లభిస్తాయి.

శ్రేష్ఠమైన అభ్యుదయం కొరకు ఈ మాత్రం ఆధారము చాలు. తరువాత జరుగవలసినది సులభంగానే జరిగిపోతుంది. నమ్మకద్రోహులెవరంటే తమపైన నమ్మకం కోల్పోయినవారు మరియు స్నేహితులను కూడా విరోధులుగా తయారు చేసుకున్నవారు. **నమ్మకద్రోహి అయిన వ్యక్తి కూడా నమ్మకమైన నౌకరును నియమించుకోవాలనుకుంటాడు.** నిజాయితీ యొక్క సామర్థ్యంమెంతో గొప్పది. ప్రతిష్ఠ మరియు ప్రతిభ సంపూర్ణంగా పొందినవారిలో ప్రతి ఒక్కరూ నిజాయితీగల పద్ధతులనే అవలంభించారని తెలుసుకోవాలి. మోసకారుల నమ్మక ద్రోహమయితే ఒక్కసారి మాత్రమే ఉపయోగపడుతుంది.

మూడవ భావ పక్షము **బాధ్యత.** ప్రతి వ్యక్తికి శరీర రక్షణ, కుటుంబ వ్యవస్థ, సమాజనిష్ఠ, క్రమశిక్షణను కాపాడుట వంటి కర్తవ్యములు అనివార్యం. బాధ్యతలను నిర్వర్తించుట ద్వారానే శౌర్యము వికసిస్తుంది. విశ్వాసం కలుగుతుంది. విశ్వసనీయత ఆధారంపైనే వ్యక్తులకు మహత్వపూర్ణమైన బాధ్యతలు అప్పగించబడతాయి. ప్రగతి యొక్క ఉన్నతశిఖరం పైకి చేరే మంచి యోగం నెట్టుకుంటూ వస్తుంది. ప్రజలు వారిని ఆహ్వానించి నెత్తిమీద పెట్టుకుంటారు. బాధ్యతకలవారి యొక్క వ్యక్తిత్వమే పరీక్షకు నిలబడుతుంది. వారే గొప్ప పరాక్రమము చూపించగలరు.

నాలుగవ ఆధ్యాత్మిక సంపద **పరాక్రమము.** ధైర్యంతో నిండిన సాహసం, నిర్భీతితో నిండి పురుషార్థపరాయణత, నీతి–నిష్ఠతో కలిసిఉన్న ఆపదలతో నిండిన మార్గంలోనే పయనించగలుగుట, దోషములు, సంఘర్షణలు లేకుండా పోవుట, సంఘర్షణ కొరకు సాహసమును అవలంభించుట అనివార్యమౌతుంది. పిరికివాడు, పిసినిగొట్టు, భయస్థుడు, దీనుడు, హీనుడు తరచుగా తనపైన దాడిచేసే వారిని,

[redacted]లో, నష్టాన్ని భరించడంలో మనిషికి అణకువ అలవడుతుంది.

పీడించేవారిని నెత్తికెక్కించుకుంటాడు. కారణం అటువంటి వారిలో అవినీతికి ముందు తలవంచకుండా ఉండే ధైర్యం ఉండదు. అణిగిమణిగి ఉంటూ వచ్చిన కష్టమును భరించే విధానము ఎవరు అవలంభిస్తారో వారు ఎవరి ద్వారానైనా గాని, ఎక్కడైనాగాని, పీడించబడి అణిచి వేయబడతారు. ఇంత చేసినా వారు సురక్షితంగా ఉండలేరు. **సాహసవంతులను వదిలి పిరికి వాళ్ళపైనే దుర్మార్గుల దాడి వేయిరెట్లు ఎక్కువగా ఉంటుందని అందరికీ తెలుసు.** కష్టములను దాటుతూ ప్రగతి పథంలో ముందుకు సాగుటకు సాహసము ఎటువంటి తోడు అంటే దానిని తోడుగా ఉంచుకొని మనిషి ఏకాకిగానైనా దుర్గమును అనిపించే మార్గముపై ముందుకు సాగుటకు మరియు లక్ష్యము చేరుటకు సమర్థుడు కాగలడు.

గత సంచికలో వివరించబడిన **పంచశీలములు** మరియు ఇక్కడ చెప్పబడుతున్న **నాలుగు వర్చస్సులు,** మొత్తం తొమ్మిది సంఖ్యలు యుగధర్మమునకు అనుగుణ్యమైనవి. సూర్య మండలము యొక్క గ్రహములు తొమ్మిది, నవరత్నములు మరియు రిద్ధి–సిద్ధులు కూడా తొమ్మిది. ఈ తొమ్మిది గుణముల నుండి ఎవరు ఎన్నింటిని ఎంత నిష్పత్తిలో అవలంభించగలరో వారు అంతే గొప్ప భగవద్భక్తులుగా మరియు ధర్మాత్ములుగా చెప్పబడతారు. వీటిని యోగాభ్యాసం మరియు తపోసాధన అని చెప్పడము అతిశయోక్తి కాదు.

ధర్మము మరియు కర్మలను అవలంభించి ఆచరించబడే ఉత్కృష్ట ఆదర్శవాదమే స్వర్గం. సంతోషంతో నిండిన మనస్సు మరియు జీవన్ముక్తి వంటి తృప్తి, తుష్టి, శాంతిని అప్పటికప్పుడే ప్రసాదిస్తుంది. వాటి కొరకు ఎక్కువ కాలం ఎదురు చూడవలసిన పనిలేదు. వ్యవహారిక జీవనంతో ఈ తొమ్మిది సూత్రములు పాటిస్తే సజీవంగా స్వర్గీయ అనుభూతులు, ముక్తి స్థాయికి చెందిన దివ్యానుభూతులను ప్రతిఘడియ రసాస్వాదన చేస్తూ ఉండవచ్చును. ఇంతేకాక ఈ రెండూ కాక మూడవ లాభము కూడా లభిస్తుంది. సిద్ధుల చమత్కారములు కూడా చేతికందుతాయి. సఫలతలు పరుగెత్తుకుంటూ వచ్చి మనస్వుల చరణాలమీద వాలుతాయి.

– క్రాంతిధర్మి సాహిత్యం 7వ పుస్తకం నుండి

## మేధా సంపన్నులకు ఆహ్వానము

*గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌నందు 2010 అక్టోబర్ 22 నుండి 26 తేదీలలో జరుగనున్న ఆధ్యాత్మిక–వైజ్ఞానిక సదస్సునకు ఆంధ్రప్రదేశ్‌లోని మేధా సంపన్నులకు ఆహ్వానము పలుకుచున్నది.*

*నేటి వైజ్ఞానిక మరియు కళల విద్యల విద్యలకు ఆధ్యాత్మికతను జోడించి, మానవ జన్మకు పరిపూర్ణతను చేకూర్చుకొనెడి మార్గములో మేధావి వర్గము పయనించుటకు కావలసిన మార్గదర్శనమును పై సదస్సు ద్వారా గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్ అందించనున్నది. దీనిలో 300 మందికి మాత్రమే ప్రవేశము కల్పించబడును. శిక్షణా సమయములో ఉచిత వసతి, భోజన సదుపాయములు కల్పించబడును.*

*కావున పై సదస్సునకు పరిపాలనరంగములోని ఐ.ఎ.ఎస్, ఐ.పి.స్, ఐ.ఎఫ్.ఎస్ వారు, ఇంజినీర్లు, వైద్యులు, ఆడిటర్లు, ఆచార్యులు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, నటీనటులు, సేవా సంస్థల పెద్దలు ఆహ్వానితులు.*

***గమనిక:–** ఆధ్యాత్మిక విలువలపై విశ్వాసమున్న వారు మాత్రమే పై సదస్సులో పాల్గొనుటకు అర్హులు. కనీస విద్యార్హత డిగ్రీ. సదస్సు తేదీలను 21–25 నుండి 22–26 కు మార్చడమైనది.*

*వివరాలకు సంప్రదించండి*

***శ్రీ అశ్విని సుబ్బారావు గారు ఫోన్: 9949411181***

***శ్రీ ఎ.వేణుగోపాలరెడ్డి ఫోన్ : 9949111175***

*(8వ పేజి తరువాయి...)*

**టీకా :–** తమ ఉచ్ఛస్థితికి గాని, పతనానికిగాని తామే భూమికను తయారుచేసుకుంటామని తెలిసినపుడు, బాధలు ఇతరుల వల్ల కలుగుతుతాయనే అనుమానం పోయింది. అందువలన తమ దిశను, పద్ధతులను మార్చుకొని ప్రతికూలతను అనుకూలంగా మార్చుకోవడం కొంచెం కూడా కష్టం కాకూడదు. ఈ సత్యాన్ని మహాప్రజ్ఞ ఎంత గంభీరంగా అర్థం అయేటట్టు చేశారంటే వారి మీద గౌరవం ఇనుమడింపచేసింది. రెండవ రోజు కూడా ఈ చర్చ వల్ల జిజ్ఞాసువులందరికి యదార్థత యొక్క పూర్తి వివరాలు లభించాయి. అయినప్పటికి వారికి తృప్తిగా లేదు. వారికి అనేక ప్రశ్నలు అడగాలని ఉన్నది కాని ఆ రోజు కార్యక్రమం చివరి దశలో ఉన్నందున, నిత్యనైమిత్త సాధనలు కొరకు పిప్పలాదునికి అభివాదం చేసి బయలుదేరారు.

*– అనువాదం : శ్రీ మారెళ్ళ కామరాజు*

**సమయమే అత్యుత్తమ సంపద.**

సూర్య విజ్ఞానం - 1

# బ్రహ్మీచేతన ధృవకేంద్రం - మానవ అంతఃకరణ

పరమాణువు సౌరమండలం యొక్క సూక్ష్మరూపం. దాని మధ్యగల కేంద్రం మన సౌరమండలం సూర్యునికి ప్రాతినిధ్యం వహిస్తుంది. సూర్యుని చుట్టూ గ్రహాలు పరిభ్రమిస్తున్నట్లుగానే పరమాణువు కేంద్రకం చుట్టూ ఎలక్ట్రానులు తిరుగుతుంటాయి. సౌరమండలంలో పెద్ద ఆకాశం ఉన్నట్లే పరమాణు మండలం మధ్యలో ఖాళీస్థలమున్నది. విభిన్న సౌరమండలాల స్థితి ఒకేలాగా ఉండదు, వ్యత్యాసం ఉంటుంది. ఇదే విధంగా వివిధ రకాల పరమాణువుల లోపల చాలా తేడా ఉంటుంది. కాని అవి బయటకు ఒకే లాగా కన్పించవచ్చు. యురేనియం పరమాణువులో 12 ఎలక్ట్రానులు ఉంటాయి. కర్బనంలో వాటి సంఖ్య ఆరు మాత్రమే.

ప్రతి మనిషి ఒక బ్రహ్మాండమే. వాని ఆత్మ సూర్యునితో సమానము. దీని చుట్టుప్రక్కల గ్రహ-పరమాణువులు భ్రమణం చేస్తుంటాయి. మానవ శరీరంలో భ్రమణం చేసే అణు-జీవాణువులు ఒక ప్రత్యేకమైన విద్యుత్తును ఉత్పన్నం చేస్తాయి. ఈవిద్యుత్తు వలన ప్రభావితమైన మస్తిష్కం మొదలుకొని ఇతర అవయవములు తమ పని చేస్తుంటాయి. జడంలో చేతనత్వాన్ని ఉత్పన్నం చేసే మాధ్యమం ఇదే. సామాన్యంగా అణువులలో చింతన, అనుభూతులు ఉండవు. ప్రాణమనే మానవీ విద్యుత్తు జడ అణువుల సమూహంలో చేతన, విచారణ, అనుభూతి కలుగజేస్తుంది. సజీవ జీవనాన్ని ప్రారంభిస్తుంది. నిర్జీవ, అనుభూతి రహిత జీవనం రాళ్ళు రప్పలలో కూడా ఉంటుంది.

భూమి యొక్క ధృవ ప్రాంతాలలో అయస్కాంతపు తుఫానులు వస్తుంటాయి. అస్థిరమైన రంగురంగుల "అరోరా బోరియాలిస్" ను ధృవ ప్రాంతాలలో చూడవచ్చు. ఈ ధృవస్థానమే ఇతర గ్రహాల వికిరణాన్ని (వి=మంచి) ప్రకాశమును, ప్రభావమును పృథ్విగ్రహంపైకి తీసుకువస్తుంది. ఇంకా ఇక్కడి విశేషతలను ఇతర లోకాలకు తీసుకువెళ్తుంది. ఈ ధృవ కేంద్రమును బ్రహ్మాండముతో సంపర్క కేంద్రముగా చెప్పవచ్చు. ధృవాల ద్వారా జరుగుతున్న అంతరగ్రహ పర్యావర్తనం యొక్క బలంతోనే ధరిత్రిపై పరిస్థితులు ఉంటాయి. ఇంతేకాదు, ఇతర గ్రహాల పరిస్థితులలో కూడా భూ ధృవాలలో జరిగే అనవతర ప్రత్యావర్తన యొక్క గొప్ప యోగదానమున్నది. ఏ కారణం చేతైనా ఈ ఇచ్చిపుచ్చుకోవడాలు ఆగిపోతే భూమి మీద విషమ పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు ఇక్కడ ఉన్న జీవము మనుగడ సాధించగలదన్నది సందేహమే. భూమి యొక్క ధృవముల ద్వారా జరిగే ప్రత్యావర్తనలతోనే మన సౌరమండలం యొక్క వర్తమాన పరిస్థితి ఏర్పడుతుంది. ఒక చిన్న క్షేత్రంలో జరిగే పరిమితమైన క్రియాకలాపాలు పృథ్వి మండలాన్ని, సౌరమండలం మహాసూర్యుని చుట్టూ ప్రదక్షిణా క్రమంలో గొప్ప ప్రభావం చూపిస్తుంది. ఈ విషయంపై ఎంతో లోతుగా ఆలోచించగలిగితే, అంతగా ఆ మర్మమును, రహస్యమును అర్థం చేసుకోగలుగుతారు.

మనుష్యుని అంతఃకరణము కూడా అటువంటి ధృవస్థానమే. అతనిలో ఇచ్ఛాశక్తి, భావనాశక్తి, సంకల్పశక్తి, ఆకర్షణ శక్తి, వికర్షణశక్తి వంటి లెక్కలేనన్ని క్షమతలు (సామర్థ్యములు) ఉన్నాయి. వాటిని జాగృతం చేయగలిగితే, వాటిని ఉపయోగించుకోవడం నేర్చుకుంటే ఈ విశ్వ బ్రహ్మాండములోని సమస్త శక్తుల ప్రవాహం మానవశరీరం లోపల మేల్కొనడం చూడవచ్చు. మానవ అంతఃకరణ ఆకాశం వలె అపరిమితమైనది. మానవ అంతఃకరణలో ఉన్న శక్తి సామర్థ్యములు ఆకాశంలో గల శక్తుల కంటే చాల ఎక్కువని అర్థం చేసుకోవాలి. ఇటువంటి శక్తి సామర్థ్యములు మన దగ్గర ఉన్నప్పటికి వాటి గురించి మనకు ఎందుకు తెలియటం లేదు? మనం ఏదో విధంగా మన మూల ఊర్జా స్తోత్రంతో (లోపలి శక్తి కేంద్రం) సంబంధం పెట్టుకోగలిగితే అసంభవాన్ని సంభవం చేసి చూపవచ్చు. సూర్యుడు - సవిత మానవులకు ఉపాస్యదేవత. ఉపాస్యదేవతతో కలసిపోవడమే జీవాత్మ లక్ష్యం. ఇది ఎలా సంభవం చేసుకోవచ్చో సూర్య విజ్ఞానంలో చెప్తాము.

*(రాబోయే సంచికలలో)*

[redacted]స్వాధ్యాయం విద్యను పరిపూర్ణం చేస్తుంది.



## ధారావాహిక: హనుమత్ కథామృతం-30

# భక్తుని మహిమ సాటిలేనిది

ఓదార్పు, ఆత్మీయతతో కూడుకున్న అనురాగం, ప్రేమ, భక్తితో కూడిన శాంభవీమాత లీల నిలిచిపోయింది. ఎల్లప్పుడూ లోకకళ్యాణాన్ని కాంక్షించే శివుని లీల అందరికీ అనుభవంలోకి వచ్చింది. ఈ సమయంలో హనుమాన్ సూర్యభగవానునికి ప్రియతమ శిష్యుడు కావడం, సమస్త దేవతలకు సమర్థుడైన సహచరుడు లభించడం, పార్వతీ మాతకు మూడవ కుమారునిగా భాసించడం మొదలైనవన్నీ పరమశివుని లీలగానే భావిస్తున్నారు. హనుమాన్‌ను చూసినవారు సాధనఅంటే మహత్తులను కోరుకోవడం కాదు అని అర్థం చేసుకున్నారు. దానితోపాటే ఆధ్యాత్మికత యొక్క విజయం పవిత్రతమీదనే ఆధారపడి ఉన్నదన్న విషయం అర్థం అయింది.

పరమశివుని దయవల్ల భగవంతుడు ఎన్ని తప్పులనైనా సహిస్తాడుగానీ, తన భక్తునికి అపచారం జరిగితే సహించడు అని ఇంద్రుడు తెలుసుకున్నాడు. దైవభక్తులకు దూరంగా ఉండడమే శ్రేయస్కరం అని ఈ ఘటనకు మూల కారకుడైన రాహువు తెలుసుకున్నాడు. చీకటి-వెలుగులు ఏనాడు కలసి ఉండలేవు అన్న విషయాన్ని తెలుసుకున్న రాహువు ఏమూలకుపోయి దాగున్నాడో ఎవ్వరికీ తెలియదు.

దేవగణాలు తమ తమలోకాలకు వెళ్లి సృష్టికార్యంలో తమతమ బాధ్యతలను నిర్వహించాలి కదా! ఋషిముని గణాలు తమ తపస్సు ద్వారా సృష్టికార్యంలో సాత్వికతను ప్రసరింపచేయాలి కదా! బ్రహ్మదేవునికైతే సృష్టి కార్యంలో ఒక్క క్షణం కూడా తీరిక దొరకదు. త్రిలోకాధీశుడైన త్రినేత్రునకు తన తపస్సు ద్వారా ముల్లోకాలను నడిపించాల్సిన బాధ్యత ఉంది. కథ సుఖాంతం కావడంతోటే అందరు ఒకరి కొకరు వీడ్కోలు చెప్పుకుంటూ తమ తమ నెలవులకు బయలుదేరారు. బ్రహ్మర్షి వసిష్ఠునికి అయోధ్యను గురించి, అయోధ్యలో శ్రీరాముని గురించి ఆలోచన మొదలయింది. వెంటనే అయోధ్యకు చేరుకోవాలని ఆత్రంగా ఉంది. రామచంద్రునికి ఇక్కడి విషయాలన్నింటినీ వివరించాలని ఉంది. హనుమాన్‌కు ప్రాప్తించిన అలౌకిక శక్తులను గూర్చి వర్ణించి చెప్పాలని ఉంది.

కానీ వెంటనే తనలో తాను నవ్వుకోవడం మొదలుపెట్టాడు. "ఘటనాఘటన సమర్థుడైన శ్రీరామునకు తాను చెప్పడం ఏమిటి? భక్తుని హృదయానికి భగవంతుడు దూరంగా ఉండలేడు. ఒకరు చెపితే తెలుసుకోవాల్సిన అవసరం ఆయనకు ఎన్నడు రాదు" అన్న ఆలోచనలతో నవ్వుకున్నాడు. అయినా అయోధ్యకు చేరడానికి తొందరపడుతూనే ఉన్నాడు. అన్ని బంధాలకు దూరంగా ఉన్న మహర్షికి కూడా అయోధ్యతో లోతైన బంధం బిగుసుకుపోతోంది. శ్రీరామచంద్రుని పూర్వజులు ఇక్కడే జీవించారు. వారందరితోటి వశిష్ఠునకు విడదీయరాని బంధం ఉంది. ఇప్పుడు మానవీయ మర్యాదలకు ప్రాణంపోస్తూ, మర్యాదా పురుషోత్తముడైన శ్రీరాముడు అయోధ్యలో తిరుగుతూ ఉన్నాడు.

సరిగ్గా ఇదే సమయంలో శ్రీరాముడు సరయూ నదీ తీరానగల శివమందిరంలో కూర్చుని మిక్కిలి పొడవైన సూర్యగ్రహణాన్ని చూస్తూ ఉన్నాడు. అతని తమ్ముళ్లు ముగ్గురూ ప్రక్కనే ఉన్నారు. వారు అన్నగారిని ఇంత ఉదాసీనంగా ఉండడం ఎన్నడూ చూడలేదు. అయోధ్యా వాసులేకాదు, భూమి మీద ఉన్న ప్రజలంతా కూడా "ఈ సూర్యగ్రహణానికి అంతం లేదా'' అని నివ్వెరపోతున్నారు. మనుష్యులే కాదు పశుపక్ష్యాదులు, చెట్లు, చేమలు కూడా ఈ వైపరీత్యాన్ని అర్థం చేసుకోలేక తల్లడిల్లిపోతున్నాయి. దశరథ మహారాజు ప్రియమిత్రుడు, మహామంత్రి అయిన సుమంతుని వెంటబెట్టుకుని వశిష్ఠ ఆశ్రమానికి అనేకమార్లు వెళ్లాడు. వెళ్లిన ప్రతీసారీ ఆయన తన సాధనా మందిరంలోనే కూర్చుని ఉన్నాడు.

లోపల ఏం జరుగుతూ ఉందో ఎవ్వరికీ తెలియదు. లోపలివైపు నుండి గడియవేయబడి ఉంది. అరుంధతీ మాతను

[redacted]ధంలో నరకం, శాంతిలో స్వర్గం ఉన్నాయి.

అడిగితే "కంగారుపడకండి నాయనలారా! మీ గురుదేవులు లోక కల్యాణకర కార్యక్రమంలో నిమగ్నులై ఉన్నారు. సాధన ముగిశాకనే బయటకు వస్తారు" అంటూ శిష్యగణానికి నచ్చచెప్పింది. "దశరథమహారాజా! ఇది శ్రీరాముని పట్టణం. ఇక్కడ ఏది జరిగినా ఆయన లీలలుగానే భావించాలి. ఆయన ప్రమేయం లేకుండా ఇక్కడ ఏదీ జరగదు. చాలా తొందరలోనే ఈ గ్రహణం ముగిసిపోతుంది. మీరు మహామంత్రి సుమంతునితో కలిసి సరయూ నది దగ్గర కావలసిన ఏర్పాట్లను చేసుకోండి" అంటూ మార్గదర్శనం చేసింది.

అరుంధతీ మాతకు నమస్కరించి దశరథమహారాజు తిరిగి వెళ్లిపోయాడు. ఆయన మనస్సులో రాముడు శివమందిరంలో అన్యమస్కంగా కూర్చోవడం, గ్రహణకాలం అంతకంతకూ పెరిగిపోవడం ముల్లులాగా గుచ్చుతున్నాయి. శివలీలేదైనా శుభప్రదమైనదే. ఆయన చేస్తున్న అలౌకిక నాట్యంలో అందరిని భ్రమింపచేసే రాహువు కూడా పాలు పంచుకున్నాడు. ఏం జరుగుతుందో చూద్దాం" అని రాముడు అన్నాక ఆయన కొంత స్థిమితపడ్డాడు.

అయోధ్యలో అన్యమనస్కంగా కూర్చున్న శ్రీరాముడు హఠాత్తుగా పక్కున నవ్వాడు. ఆయన కన్నుల నుండి ఆనందాశ్రువులు రాలాయి. "దేవాధిదేవా! మహాదేవా! మీ లీల అత్యంత శుభకరమైనది" అంటూ కృతజ్ఞతా పూర్వకంగా నమస్కారం చేశాడు. సోదరులు ముగ్గురూ అన్నగారి ఆనందం చూసి తాము కూడా పాలుపంచుకున్నారు.

అక్కడ అందరికీ నమస్కరించి హనుమాన్ సెలవు తీసుకున్నాడు. ఆ సమయంలో వశిష్ఠమహర్షి తన చెవిలో "కుమారా! నీ ఆరాధ్యదైవం శ్రీరామచంద్రుడు మర్యాదా పురుషోత్తముడు. అతని కలయిక కోసం నీవు ఎదురుచూడక తప్పదు" అని చెప్పిన వాక్యాలు ఇంకా మారుమ్రోగుతూనే ఉన్నాయి. ఆయన ఇచ్చిన ఆశీర్వాదం మనస్సులో మెదలుతూనే ఉంది. రెట్టించిన ఉత్సాహంతో శివునికి నమస్కరించి వెళ్లిపోయాడు. పరమేశ్వరుడు తన అర్ధాంగి అయిన పార్వతిని వెంటనిడుకొని కైలాసం వైపుగా సాగిపోయాడు.

*– అఖండ జ్యోతి 2010 జనవరి*

## ద్రవించిన హృదయం

ఆ రోజులలో అమెరికాలోని తెల్లవారు ఆఫ్రికాలోని మనుష్యులను బానిసలుగా పట్టుకుని ఓడలు నింపి బజార్లో జంతువులను అమ్మినట్లు అమ్మేవారు. వారిని నాగలికి ఎడ్లను కట్టినట్టు కట్టి పొలం దున్నించేవారు. ఏదో రెండు ఎండు రొట్టెలను ఆహారంగా పడేసి రోజంతా కొడుతూ తిడుతూ కఠోరంగా పని చేయించేవారు. వీరి దయనీయ స్థితిని చూసి ఒక స్త్రీ హృదయం ద్రవించింది. ఎలాగైనా ఈ అనాచారాన్ని రూపుమాపాలని నిర్ణయించుకున్నది. ఎన్నో ప్రయత్నాలు చేసి, విఫలమై చివరకు తన యావదాస్థిని అమ్మి బానిసలతో నిండిన ఓడను కొన్నది. వారందరికి వ్రాయటం, చదవటం, సంతకం చేయటం, సభ్యసమాజంలో వారిని తమ కాళ్ళ మీద తాము నిలబడి జీవించటం నేర్పింది. వారు సంపాదించిన సొమ్ము వారి ఔన్నత్యం కొరకే ఖర్చు చేసేటట్లు ఏర్పాట్లు చేసింది. తెల్లజాతికి చెందిన ఈ మహిళ పేరు ఫిలిప్ హ్విటలే. ఆమె విద్యాలయంలో చదువుకున్నవారు, ఆమె కర్మాగారంలో పని చేసిన వారు చాలమంది బానిసత్వ నిర్మూలనకు ఆందోళనలు చేశారు. ఈ విధమైన కొత్త ఆదర్శాలను చూసేసరికి అనేకమందికి క్రొత్త రీతిలో ఆలోచించే అవకాశం లభించింది. బానిసత్వ నిర్మూలనకు తగిన వాతావరణం ఏర్పడింది. అప్పటి అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్ ఆ మహిళను పలువిధాల ప్రశంసించాడు.

– ప్రజ్ఞా పురాణం నుండి

**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి !**
**చదివించండి !!**

ధనం కన్న, కీర్తి కన్న శీలం గొప్పది.

**బోధ కథ**

# అనుభూతిలో ఉన్నది సత్యం

ఏకుదాన్ అడవిలో ఉంటున్నాడు. చెట్టు చేమలూ, కొండలూ కొండవాగులూ ఆయన మిత్రులు. ఆయన జీవితంలోని సత్యం ఒకే ఒకటి 'బుద్ధం శరణం గచ్ఛామి' ఆ మంత్రాన్ని చింతన చేస్తూ ఆయన ధ్యానంలోకి వెళ్లిపోతాడు. ఆ సూత్రాన్నే ఆయన ఉపదేశిస్తాడు. ఈ జీవన మంత్రం తప్ప ఆయనకు మరో విషయం తెలియదు. ఈ మంత్రాన్ని ఉచ్చరిస్తూన్న సమయంలో ఆయనకు సమాధి సుఖం లభించేది. ఆయన ఆ మంత్ర ఉచ్ఛారణలో తన్మయులు అయ్యేవారు. ఆ సమయంలో ఆయన ఆంతరిక చేతనలో అలౌకికమైన ఆనందం వెల్లివిరిసేది. "బుద్ధం శరణం గచ్ఛామి' అనే మాటలు తప్ప మరో మాట చెప్పేవారు కాదు ఆయన.

ఆ అడవిగుండా వెళ్లే వ్యక్తులకు ఒకే ఒక ఉపదేశం వినిపించేది. రోజూ అదే మాట వినడం ఎవరికయినా విసుగుగా ఉంటుంది కదా! కనుక ఎవరూ ఆయన దగ్గర ఆగేవారు కారు. ఏకుదాన్ ఒకే ఒక వక్త, ఒకే ఒక శ్రోత కూడా. మరో శ్రోత అసలు ఎలా ఉంటాడు. వచ్చినవాళ్లు పారిపోతూ ఉంటారు. రోజూ అదే ఉపదేశం అందులో మార్పు ఉండనే ఉండదు. ఆ మాటతప్ప ఆయనకు మరొకటి తెలియనే తెలియదేమో.

అయితే ఆయన తన జీవన సత్యాన్ని ఎప్పుడూ చెప్పినా, అడవి ఒక విలక్షణమైన శోభతో నిండిపోయేది. చెట్లూ, కొండలూ, వాగులూ ఒక అలౌకిక చైతన్యంతో ఉర్రూతలు ఊగిపోయేవి. పొంగిపొరలిపోయేవి. ఆయనకు అభినందనలు తెలిపేవి. ధన్యవాదాలు! ధన్యవాదాలు! అభినందనలు! అభినందనలు! అనే మాటలతో అడవి అంతా ప్రతిధ్వనించిపోయేది. ఒక అపురూపమైన శోభ, ఒక అలౌకిక చైతన్యం అంతటా వెల్లివిరిసేవి.

ఒక రోజున ఇద్దరు భిక్షువులు ఆ అడవిలోకి వచ్చారు. వారితోపాటు బౌద్ధమత గ్రంథాలయిన త్రిపిటకాలు ఉన్నాయి. ఒక్కొక్క భిక్షువుతోపాటు 500 మంది శిష్యులు వచ్చారు. వారి పాండిత్యం సర్వత్రా పేరు ప్రఖ్యాతులు గాంచింది. వారి రాక ఏకుదాన్‌కు ఎంతో సంతోషం కలిగించింది. ఆయన హృదయపూర్వకంగా వారికి స్వాగతం చెప్పారు. "మీరు ఇక్కడికి రావడం నా అదృష్టం. నేను పల్లెటూరివాడిని, అజ్ఞానిని, నాకు తెలిసింది ఒకే మాట. దానినే రోజూ ఉపదేశిస్తూ ఉంటాను. ఎవ్వరూ వినరు. వనదేవతలు మాత్రం ఆ ఉపదేశం వింటాయి. ధన్యవాదాలు తెలుపుతాయి. అయినా, ఆ మాట విని విని అవి విసుగుచెంది ఉంటాయి. నేను చెప్పే ఒకే ఒక మాట మళ్లీ మళ్లీ విని తమ ఆనందాన్ని వ్యక్తం చేయడం ఈ ముసలివాడి మీద దయ తలచడమే.

"మీరిద్దరూ మహా జ్ఞానులు. త్రిపిటకం మీకు కంఠస్థమైన గ్రంథం. మీ జ్ఞాన మహిమవల్ల ఆకర్షితులైన ఆయిదేసి వందలమంది మీకు శిష్యులు అయినారు. నాకు ఏమీ రాదు. కనుకనే నాకు ఒక్క శిష్యుడయినా లేడు. రోజూ ఒకే మాట ఉపదేశిస్తూ ఉంటే ఎవరు శిష్యులు అవుతారు?" అన్నాడు.

ఈ మాటలు విని, మహాపండితులైన ఆ భిక్షువులిద్దరూ ఒకరి నొకరు అర్థవంతంగా చూసుకుని నవ్వుకున్నారు. వారి కళ్లలో పాండిత్య గర్వం మెరిసిపోతోంది.

పాపం ఈ ముసలివాడు అడవిలో ఒంటరిగా ఉంటూ ఉంటూ పిచ్చివాడయిపోయాడు. ఒంటరితనంవల్ల ఇతడి మెదడు చెడిపోయింది. లేకపోతే ఎవరైనా రోజూ ఒకే ఉపదేశం ఇస్తారా? తన ఉపదేశం విని వన దేవతలు మెచ్చుకుంటున్నాయని ఈయన చెపుతున్నాడు. మతిలేనిమాట కాకపోతే మరేమిటి. లేకపోతే దేవతలు రావడం ఏమిటి! ఉపదేశం విని అభినందించడం ఏమిటి? మా వంటి జ్ఞానుల, పండితుల ఉపదేశాలు వినడానికి దేవతలు ఎప్పుడూ రాలేదే. ఈ మూర్ఖుడు చిలక పలుకులా వల్లించే ఆ ఒక్క మాట వినడానికి వారు ఎందుకు వస్తారు? అయినా మించిపోయిందేమీ లేదు ఉపదేశమంటే ఏమిటో ఇతడికి ఇవాళ తెలియచేస్తాం.

ఇలా ఆలోచించారు ఆ మహాపండితులు ఇద్దరూ. అయితే బయటికి మాత్రం ఏకుదాన్ వయస్సు దృష్టిలో ఉంచుకుని ఎంతో మర్యాదగా ఇలా అన్నారు. "మీరు చెప్పిన దానికి మేము అంగీకరిస్తునాం. మా ఉపదేశాలవల్ల మీకు కూడా విషయాలు అర్థమవుతాయి."

"మహాజ్ఞానులైన మీ ఇద్దరి కృపవల్ల ధన్యుడను అయినాను" అన్నాడు ఏకుదాన్. ఆయన హృదయం కృతజ్ఞతా భావంతో పొంగిపొరలింది. ఆయన ఎంతో ప్రేమతో, ఎంతో శ్రమతో వారి ప్రవచనాలకు తగు ఏర్పాట్లు చేశారు. విద్వత్తుతో నిండిన వారి ప్రవచనాలు వినే అదృష్టం కలిగి తాను కృతకృత్యుడను అయినానని ఆయన భావించారు.

**[redacted]ంచకుండా అత్యాసకు పోతే దుఃఖం, అవహేళన తప్పవు.**

అదే జరిగింది. ధర్మాసనాలపై కూర్చొని వీరిద్దరూ ప్రవచనాలు ఇచ్చారు. వారు మహాపండితులు, త్రిపిటకాలను మథించిన విద్వాంసులు. బుద్ధుని వచనాలన్నీ వారికి కంఠస్థమైనవే. ప్రశంసకులూ, శిష్యులూ వారిని ఎన్నడూ చుట్టుముట్టి ఉంటారు. 500 మంది శిష్యుల బృందం వారికి సేవ చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. వారు ఒకొక్కరుగా ఉపదేశాలు ఇచ్చారు. ఉపదేశాలకు ముందు శిష్యులు వారి విద్వత్తునూ, గొప్పతనాన్నీ వర్ణించారు. సమాజంలో వారి ప్రభావం ఎంత ఉన్నదో వివరించారు. ఎంతమంది ప్రజలు వారికి జయ జయ ధ్వానాలు చేస్తారో పేర్కొన్నారు. వారు ఎన్ని దేశాలలో పర్యటనలు జరిపారో, ఎన్ని సన్మానాలు పొందారో, ఎన్ని బిరుదులు అందుకున్నారో, రాజులు వారిని ఎలా సత్కరించారో సవివరంగా తెలిపారు.

ఈ పరిచయం తర్వాత శిష్యులు వాద్య సహకారంతో గీతాలు గానం చేశారు. ఇలా పూర్వరంగం పూర్తయింది. ప్రవచనాలు జరిగాయి. శాస్త్ర సమ్మతంగా, పాండిత్య ప్రకర్షతో, తర్కబద్ధంగా, శిష్యులు హర్షధ్వానాలు చేశారు. భిక్షువు ఏకుదాన్ పొందిన ఆనందానికి అవధులే లేవు. ఆయన ఆ పండితులను హృదయపూర్వకంగా అభినందించారు.

అయితే ఒక్క విషయం ఆయనను ఆశ్చర్యపరచింది. వన దేవతలు ఏమీ మాట్లాడలేదు. ఆయన ఆ పండితులతో ఆ మాటే అన్నారు. అసలు ఏం జరిగింది? వన దేవతలు ఎందుకు మౌనం వహించారు? వారికి ఏమయింది? వారు ఎక్కడికి వెళ్లారు? వారు రోజూ నా ఉపదేశం వింటారు. అడవి అంతా హర్షధ్వానాలతో మారుమ్రోగుతుంది. నేడు మీరు మహోపదేశం ఇచ్చారు. జ్ఞానంతో నిండిన ఉపదేశం ఇచ్చారు. కానీ, వీరంతా మూగనోము పట్టారు. ఇలా ఎందుకు జరిగింది?

మహా పండితులకు ఈయన మాటలు పిచ్చివాని ప్రేలాపనగా అనిపించాయి. వారిద్దరూ ఇలా అనుకున్నారు – మేము మహానగరాలలో లక్షలమంది పాల్గొన్న సభలలో ఉపదేశాలు ఇచ్చాము. ఇప్పుడు ఈయన మీద దయతలచి ఈ అడవిలో ఉపదేశం ఇవ్వడానికి ఒప్పుకున్నాము. ఈయనకు ఇంతగా మేలు చేశాము. కానీ, ఈయన మా అనుగ్రహానికి కృతజ్ఞత చెప్పడానికి బదులు – వన దేవతలు ఎందుకు పలకడం లేదని అడుగుతాడేమిటి?

అయినా, ఆయనతో పైకి ఇలా అన్నారు. "నీవో పని చెయ్యి, నీవు నీ ఉపదేశం ఇవ్వు. దాన్ని వినే అవకాశం మాకు కలుగుతుంది. దానితోపాటు వన దేవతల వాణి వినే అవకాశం కూడ మాకు కలుగుతుంది."

వారి మాటలు వ్యంగ్యంగా అన్నారు. అజ్ఞాని అయిన ఈ ముసలివాడికి ఏమీ తెలియదు కదా. ఈయన మాట ఒక్కటీ వింటే సరిపోతుంది కదా అని వారు అనుకున్నారు.

అమాయకుడైన ఏకుదాన్‌కు ఈ వ్యంగ్యం అర్థం కాలేదు. వారు నిజంగానే తనను ఉపదేశం ఇవ్వమని తనను ఒత్తిడి చేస్తున్నారని ఆయన భావించారు. ఎంతో నమ్రతతో సభలో ఉన్న ప్రజలకు ప్రణామం చేశారు. వన దేవతలందరినీ అభ్యర్థించారు. తన ఆరాధ్య దైవం అయిన బుద్ధ భగవానునికి తలవంచి ప్రణామం చేశారు. ఆ తర్వాత హృదయపు లోతులనుండి తన మనస్సును ప్రాణాలను ఏకం చేసి, "బుద్ధం శరణం గచ్ఛామి" అని తనకు వచ్చిన మంత్రాన్ని పఠించారు. ఆ పఠనంతోనే ఆయన లోతయిన భావ సమాధిలో మునిగిపోయారు. ఆయన ముఖ మండలంపై మహాజ్ఞానపు వెలుగు ప్రకాశించింది. అతడి అస్తిత్వం మొత్తం పులకించిపోయింది. సభలోని ప్రజలమీద కూడా అనుభూతి అనే ఆ అమృతకలశం నుండి కొన్ని బిందువులు జారిపడ్డాయి. అడవి అంతటినుండి "బాగుంది, బాగుంది" అనే అపూర్వ నినాదం ధ్వనించింది. చెట్టు చెట్టునుండి ఆ మాట వెలువడింది. రాయి రాయి నుండి ఆ మాట వెలువడింది. అడవిలోని వన దేవతలనుండి ఆ మాట వెలువడింది. అలౌకికమైన ఆ పూల వానతో ధర్మాసనం నిండిపోయింది, పొర్లిపోయింది.

మహాపండితులు ఇద్దరూ హైరాన పడ్డారు. వారిలా అనుకున్నారు–ఈ ముసలివాడు పిచ్చివాడు కాదు. వన దేవతలు నిజంగా ఉన్నారు. మరి ఈ దేవతలు పిచ్చివాళ్లా? ఎందుకంటే ఇలాంటిది ఎక్కడైనా విన్నామా? ఒక్క మామూలు మాట "బుద్ధం శరణం గచ్ఛామి" ఏముందో దీనిలో దీన్ని ఎవరైనా చెప్పవచ్చు. ఎప్పుడైనా చెప్పవచ్చు. ఎక్కడైనా చెప్పవచ్చు. ఈ వనదేవతలు అనాగరికమైనవి. తెలివి లేనివి. వీటికి మా ప్రవచనాలు అర్థమై ఉండవు.

వారిలా ఊహా లోకాలలో విహరిస్తూ వెళ్లిపోయారు. ఆ రోజుల్లో బౌద్ధ సంఘంలో ఈ సంఘటన బహుళ ప్రచారం పొందింది. అయితే దీని రహస్యం ఎవరికీ అంతుపట్టలేదు. బుద్ధ భగవానుని శిష్యుడు ఆనందుడు ఆయనకు ఈ సంఘటనను వివరించి దీని మర్మం ఏమిటో తెలుపవలసిందిగా ఆయనను ప్రార్థించాడు.

బుద్ధుడు చిరునవ్వుతో ఇలా అన్నారు "వత్సా! ఆనందా! ఏకుదాన్ 'బుద్ధం శరణం గచ్ఛామి'లోని రహస్యాన్ని తెలుసుకున్నాడు. అతడు క్షీణాశ్రవుడు అయిపోయాడు."

**[redacted]ను అదుపుచేసుకోలేని వాడు దీనుడు, బలహీనుడు.**

"క్షీణాశ్రవుడు అంటే ఏమిటి?" అని ఆనందుడు బుద్ధుడిని వినమ్రంగా అడిగాడు.

బుద్ధుడు ఇలా చెప్పాడు.

ఆస్రవాలు నాలుగు

మొదటిది కామాశ్రవం. అది నశించడం అంటే పొందాలనే కోరిక లేకపోవడం. కోరికలన్నీ నశించిపోయాయి. పేరు, ధనం, కీర్తి, పదవి, మరొకటి పొందాలనే తపన ఇక లేదు.

రెండవది భావాశ్రవం. స్వర్గం, మోక్షం, మంచి జన్మ ఎత్తడం అనే కోరిక. ఇది నశించడం అంటే జీవేషణ నశించడం. లౌకికమైనవే కాక, అలౌకికమైన కోరికలు కూడా నశించడం.

మూడవది దృష్టాస్రవం అనగా దృష్టి, శాస్త్రం, సిద్ధాంతములపై ఆసక్తి ఇది నశించడం అంటే అర్థం జాతి, మతం, కులం, దేశం, శాస్త్రం, సిద్ధాంతం అన్నింటి పట్ల వ్యామోహం నశించడం. సంకుచిత దృష్టి పోవడం.

నాల్గవది అవిద్యాస్రవం. నేను ఉన్నాను అనే భావన లేకపోవడం సరిహద్దులన్నీ చెరిగిపోవడం, అపరిమితం అయిపోవడం.

ఆనందుడు శ్రద్ధగా వింటున్నాడు. భగవానుని వచనాలను భగవానుడు హృదయపు లోతులను తాకే స్వరంతో ఇంకా ఇలా అన్నారు.

''భిక్షు ఏకుదాన్‌లో ఈ ఆస్రవాలు నాలుగూ నశించిపోయాయి. ఆయన ఇపుడు క్షీణాస్రవుడు"

ఇలా చెపుతూ చెపుతూ అంతర్యామి అయిన భగవానుడు ఆనందుని మనసులో ఉన్న ప్రశ్న ఏమిటో తెలుసుకున్నారు. ఆయన చిరునవ్వు నవ్వి ఇలా అన్నారు.

"బుద్ధం శరణం గచ్ఛామి" అన్నది భిక్షు ఏకుదాన్‌కు ఒక వాక్యం కాదు, ఒక అనుభూతి. ఆయన నిజంగా బుద్ధుణ్ణి అనగా బుద్ధత్వాన్ని శరణు పొందారు. ఆయన బుద్ధత్వ ధారలో నిమగ్నులు అయిపోయారు. ఆయనకు ఈ వాక్యం శాస్త్ర వాక్యం కాదు, సమాధి సత్యం. దానిని ఉచ్చరించడంతోపాటే ఆయన బుద్ధత్వంలో ఏకత్వత పొందుతారు. ఆయన అనుభూతిని పరికించి వన దేవతలు ధన్యం అవుతాయి. ఆయనను అభినందిస్తాయి."

ఈ అంశాన్ని సూత్రప్రాయంగా భగవానుడు దిగువ ధర్మ పద్యంలో వినిపించాడు.

**న తేన పండితో హోతి హోతి యావతా బహు భాసతి।**
**ఖేమీ అవేరీ అభయో పండితేతి యువుచ్చతి॥**

అనగా –

ఓ భిక్షువులారా! పెక్కు ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఎవ్వరూ పండితులు కారు. శత్రువులు లేనివాడు, నిర్భయుడు అయిన వ్యక్తియే పండితుడు.

ఆనందునితోపాటు భిక్షువులంతా ప్రశాంతంగా భగవానుని వచనాలు వింటున్నారు. భగవానుడు ఇలా అన్నారు–

"సత్యం శాస్త్రంలో లేదు. సత్యం శబ్దంలోనూ లేదు. సత్యం బుద్ధిపరమైన జ్ఞానంలోనూ లేదు. అనుభూతియే సత్యం. సత్యం శూన్యంలో వ్యక్తం అవుతుంది. మౌనంలో, అంతరిక ఏకాంతంలో వ్యక్తం అవుతుంది. వాస్తవానికి, సజీవమైన అనుభూతి యొక్క వ్యక్తీకరణపై అస్తిత్వమంతా కప్పబడి ఉంది. అలాంటి స్థితిలో వన దేవతలు ప్రసన్నమై అభినందనలు కురిపించడం సహజమే"

ఇలా చెప్పి, భగవానుడు మౌనంలో మునిగిపోయారు. ఆనందునితో సహా భిక్షువులంతా భగవానుని మాటలను మననం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

★★★

## కొలిమితిత్తి ఉపదేశం

*కుమ్మరి కొలిమికి, గాలిని కొట్టే కొలిమితిత్తికి మధ్య ఒకసారి పోట్లాటవచ్చింది. కొలిమి మండిపడుతూ "చనిపోయిన జంతువుల అసహ్యకరమైన చర్మంతో తయారయి, కురూపిగా ఉండి, చెడువాసన వేసే నీ వల్ల నాకు చాలా బాధకలుగుతుంది. నా దారి నుండి తొలగిపో" అని తిట్టసాగింది. కాని కొలిమితిత్తికి కోపం రాలేదు. శాంత స్వరంతో "నీ ముఖంలోని ఎర్రతనం నా నిరంతరం ఉచ్ఛ్వాస నిశ్వాసాల పరిణామం, నేను నా పని మానేస్తే నీవు బూడిదగా మారిపోతావు" అని అన్నది.*

*సామాజిక జీవనంలోని నీతి కూడా ఇదే. చాలమంది తామేదో గొప్పవారమని, తమవల్లే సంస్థలు, సమూహాలు నడుస్తున్నాయని అహంకారంతో, గర్వంతో ఉంటారు. కాని ప్రజలు స్నేహం కోల్పోతే వారు ఎందుకు పనికి రాకుండా పోతారు. తమ ప్రగతికి, తన గొప్పదనానికి కారణభూతమైన వ్యక్తులకు, సమాజానికి తలవంచి నమ్రతతో నమస్కరించినంత వరకే ప్రగతిపథంలో పయనం సునాయాసంగా జరుగుతుంది.*

– ప్రజ్ఞా పురాణం నుండి

గ్రంథాలయం సద్జ్ఞాన దేవాలయం.

## గాయత్రీ - 24 శక్తి ధారలు (17)

# కుండలిని

గాయత్రి యొక్క ఒక శక్తి కుండలిని. కుండలిని ఒక భౌతిక శక్తి. జీవాత్మతో అత్యంత దగ్గర సంబంధం ఉన్నది. దీనిని ప్రాణ విద్యుత్ అని, జీవనశక్తి అని, ఊర్జా అని, యోగాగ్ని అనే పేర్లతో తెలుసుకోవచ్చు. శరీర నాడులలో ఒక చైతన్య విద్యుత్ ప్రవహిస్తుంటుంది. దీనికి రెండు శిరస్సులుంటాయి. వీటిని ధృవ కేంద్రములంటారు. ఇవి పృధ్వి యొక్క ఉత్తర దక్షిణ ధృవములవంటివి. ఉత్తర ధృవం మస్తిష్కంలోని మధ్య బిందువు, బ్రహ్మరంధ్రము. ఇక్కడే సహస్రార చక్రముంటుంది. పృధ్వి యొక్క ఉత్తర ధృవ కేంద్రం యొక్క అయస్కాంతం తనకు అవసరమైన శక్తులను, పదార్థములను బ్రహ్మాండములోని అంతర్‌గ్రహ భాండాగారం నుంచి పొందుతుంది. అదే విధంగా సహస్రార చక్రం కూడా, వ్యాపించి ఉన్న బ్రహ్మచేతనత్వ భాండాగారంలో ఉన్న దివ్యశక్తులనుంచి తనకు కావలసిన సామర్థ్యములను కావలసినంతగా పొందవచ్చు.

బ్రహ్మరంధ్రంలో కుండలిని యొక్క ఒక కోస (శిరస్సు) ఉన్నది. దీనిని మహసర్పమంటారు. ఇది కుండలాకారంలో ఉంటుంది. శేషనాగు అని దీనినే అంటారు. గాయత్రి సాధన వలన మూర్ఛస్థితిలో ఉన్న మహా సర్పం జాగృతమవుతుంది. దీని ప్రచండ సామర్థ్యంతో ఆధ్యాత్మిక క్షేత్రంలో అసంఖ్యాక విభూతుల లాభం పొందవచ్చు. కుండలిని యొక్క రెండవ కోస (శిరస్సు) మూలాధార చక్రం. ఇది మల మూత్ర రంధ్రముల మధ్య ఉన్న శక్తి కేంద్రం. ఇది సుడులు తిరుగుతూ ఉంటుంది. ఇది దక్షిణ ధృవం వంటిది. మానవ శరీరంలో పదార్థశక్తి ఉత్పాదన, పంపిణి ఇక్కడి నుంచే జరుగుతుంది. సంతానోత్పత్తి చేయగల సామర్థ్యం ఇక్కడే ఉన్నది. స్ఫూర్తి, ఉల్లాసం, సాహసం వంటి విశిష్టతలు ఇక్కడ నుండే ఉద్భవిస్తాయి. స్థూల శరీరంలో మస్తిష్కం, హృదయం ప్రధానమైన అవయవాలుగా భావించబడతాయి. సూక్ష్మ శరీరం యొక్క మస్తిష్కం సహస్రార చక్ర మహాసర్పము, హృదయం మూలధార చక్రము. మూలాధారమును కుండలిని యొక్క దక్షిణ ధృవంగా భావిస్తారు. రెండు ధృవముల మధ్య ప్రవాహం నిద్రాస్థితిలో పడి ఉంటుంది. అందువల్ల ఇతర ప్రాణుల వలె తింటం, పిల్లల్ని కనడం వంటి తుచ్ఛమైన పనులు మాత్రమే చేయగలుగుతారు. కుండలిని జాగరణ వల్ల దివ్యశక్తి జాగృతమవుతుంది. మనిషి సామర్థ్యం విపరీతంగా పెరుగుతుంది. మూలాధార స్థితి సర్పిణి అంటే ప్రాణశక్తి, సహస్రార స్థితి మహాసర్పం బ్రహ్మచేతనత్వం, ఈ రెండింటి మధ్య ఇచ్చిపుచ్చుకునే ద్వారం తెరచుకొనడమే కుండలిని జాగరణ. విద్యుత్ యొక్క రెండు తీగలు కలిపితే శక్తివంతమైన ప్రవాహం ఉత్పన్నమైనట్లే, భౌతిక ఆత్మిక క్షమతల (సామర్థ్యముల) కలయిక అలాంటి చమత్కార పరిణామాలను కలిగిస్తుంది.

మస్తిష్క సామర్థ్యమును పెంచుకొనడం యోగ సాధన ద్వారా చెయ్యాలి. ప్రాణశక్తిలో ప్రచండత తీసుకువచ్చి తద్వారా భౌతిక ఆత్మిక శక్తులను బలంగా చేయడమే తంత్ర విజ్ఞానం. కుండలిని తంత్ర విద్య యొక్క అధిష్ఠాత్రి. భూలోకం యొక్క ప్రతినిధి మూలాధారం. బ్రహ్మలోకం యొక్క ప్రతినిధి సహస్రారం. ఈ రెండింటి మధ్య ఇచ్చిపుచ్చుకోవడాలు దేవయాన మార్గం ద్వారా జరుగుతాయి. మేరుదండమే (వెన్నెముక) దేవయాన మార్గం. ఈ మార్గంలో షట్‌చక్రాలున్నాయి. ఏడవ లక్ష్యం సహస్రారం. వీటినే సప్తలోకములని, సప్త సింధువులని, సప్తగిరులని, సప్త ఋషులని, సప్త తీర్థములని, సప్తధాతువులనే రూపాలలో విస్తారంగా చెప్పబడినాయి. కుండలిని జాగరణ ద్వారా దేవయాన మార్గంలోని ఈ సోపానాలన్నీ జాగృతమవుతాయి. సాధకుడికి దివ్య సామర్థ్యాలు లభిస్తాయి.

మనిషిలో ప్రాణం యొక్క ప్రచండ శక్తి మూలాధారం యొక్క కేంద్రబిందువులో ఉంటుంది. అక్కడి నుండే శరీరమంతా పరిభ్రమిస్తూ శారీరక కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఈ కేంద్రమే జననేంద్రియముల ద్వారా సక్రియమయి, క్రొత్త జీవికి జన్మనిచ్చే సామర్థ్యం ఇస్తుంది. మనిషిలో శౌర్యం, సాహసం, పరాక్రమం, ఉత్సాహం, ఉల్లాసం వంటి విశేషతలు-సామర్థ్యాలు ఇక్కడి స్ఫూర్తితోనే లభిస్తాయి. కామోత్తేజనంలో ఈ క్షమత గందరగోళ స్థితిలో పడుతుంది.

సామన్య ప్రాణమును మహాప్రాణముగా పరిణితి చేసి, బ్రహ్మరంధ్రం వరకు తీసుకువెళ్ళి, నిద్రిస్తున్న శక్తి భాండారమును మేల్కొలిపి, మనిషి దేవోపమానముగా అవడమే కుండలిని జాగరణ ఉద్దేశ్యం. సముద్ర మథనంలో 14 రత్నాలు దొరుకుతాయి. కుండలిని యొక్క శక్తి సాగర మథనం కూడా సాధకునికి దివ్య శక్తుల ద్వారం తెరుసుకుంటుంది. అధోగతికి వెళ్ళేశక్తిని ఊర్ధ్వగతిలో పరిణితి చేసే ప్రక్రియే కుండలిని జాగరణ. ఈ సాధనలో కామబీజం శక్తి బీజంగా పరివర్తన చేయబడుతుంది. కాళి మహాకాలునితో, శివ శక్తితో, ప్రాణం మహా ప్రాణంతో కలపడం వల్ల వాటి సంయుక్త శక్తితో అద్భుతమైన పరిణామాలు ఉత్పన్నమవుతాయి. దీనినే కుండలిని జాగరణ అంటారు.

గాయత్రి సాధనలో భాగంగా కుండలిని జాగరణ ప్రక్రియ చేసినపుడు అది తేలిక అవుతుంది. హఠయోగం ద్వారా, ప్రాణయోగం ద్వారా, తంత్రయోగం ద్వారా కూడా కొంతవరకు సాధించవచ్చు. కాని పరిపూర్ణ జాగరణ, దాని ఉపయోగం గాయత్రి ద్వారానే సాధ్యమవుతుంది. గాయత్రి యొక్క 24 శక్తులలో ఒకటి కుండలిని. గాయత్రి సాధన ద్వారా కుండలిని జాగరణ లాభం నిశ్చితంగా, ఎటువంటి బాధలు లేకుండా సరళంగా లభిస్తుంది.

★★★

[redacted]ం చేయడమే కాక దానికి తల ఒగ్గడమూ పాపమే.



## పూజ్య గురుదేవుల అమృతవాణి

# భగవంతుడెక్కడ ఉన్నాడు?

నేను మీకు శరీరసాధనకు రెండు అవసరమవుతాయని చెప్పాను. 1. ఆహారము 2. విహారము. అదే విధముగా మనో సాధనకి కూడా రెండు అవసరమవుతాయి. ఒకదాని పేరు వివేకము, రెండవదాని పేరు సాహసము. సాహసమును, వివేకమును ఎంత ఎక్కువగా మనము నింపుకుంటే మన జీవితము అంత ఎక్కువగా సమృద్ధితో, రిద్ధిసిద్ధులతో నిండుతూ ఉంటుంది. ఇతిహాసములో ఇందుకు సంబంధించిన ఉదాహరణలు లభిస్తాయి.

### వివేకవంతుల రీతి-నీతి

సమర్థగురురామదాసు గారికి వివాహ ప్రయత్నాలు జరుగుతున్నాయి. తప్పనిసరిగా పెళ్ళి చేసుకోవాల్సిందేనని అందరూ అయనను ఒప్పించారు. పెళ్ళికుమారుడు, పెళ్ళికుమార్తె ఊరేగింపుగా వచ్చి పెళ్ళిమండపములో కూర్చున్నారు. ఆ సమయంలో ఒక పురోహితుడు-ఇక్కడ పెళ్ళి చేసేముందు ఒక కేక పెడతారు అని అంటూ 'అమ్మాయి, అబ్బాయి 'సావధాన్' అని గట్టిగా అరిచాడు. ఇక కొద్ది సేపే కదా ఉంది మరి సావధాన్ అని ఎందుకన్నారని పెళ్ళికుమారుడు అడిగాడు. అపుడు ఆయన ఇలా అన్నాడు. 'గొప్ప జీవితము ఇక్కడితో అంతమౌతుంది. పెళ్ళి, 10మంది పిల్లలు, రోగాలు, గ్రహాలతోనే చావాలి. పిచ్చివాడా! ఇలా రెండు రకాలుగానూ చంపబడతావు కనుకనే భగవంతుడు నిన్ను సావధాన్, సావధాన్, రెండుదిక్కులా ఏం చూస్తావు ఒక పక్కకే పో... అని అంటూనే ఉన్నాడు. సమర్థగురు రామదాసు పారిపోయాడు. ఆయన వెనుకనే అందరూ పరుగులు తీశారు. అందరూ ఆయనను పిచ్చివాడని, పనికిరాడని ఎన్నో రకాలుగా తిట్టుకున్నారు. కానీ వివేకవంతుల ఆలోచనాశైలియే వేరుగా ఉంటుంది. వారు తమ మార్గాన్ని వేరుగా ఎంచుకొని అటువైపే ప్రయాణిస్తారు.

### పాత్రత యొక్క అనివార్యత

వివేకవంతులైనవారు తమ మార్గాన్ని తామే ఎంచుకొని చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోయారు, మిగిలిపోతారు. ఈ పరంపర ఇలానే కొనసాగింది, కొనసాగుతుంది. నేను మీకు మనస్సు యొక్క, మస్తిష్కము యొక్క, సూక్ష్మశరీరము యొక్క ఉపాసనతో పాటు సాధన కూడా చేసే విధానాన్ని నేర్పించాను. సాధనలో వివేకశీలత కూడా ఒక అంశమని చెప్పాను. రెండవ అంగము పాత్రత యొక్క వికాసము, వ్యక్తిత్వము యొక్క వికాసము. ఇవి లేకుండా ఉపాసన, సాధనలన్నీ నిష్ఫలమే అవుతాయి.

ఒక వ్యక్తి ఉద్విగ్నతతో "ప్రపంచంలో అన్నింటికంటే లాభదాయకమైన పని భగవంతుని ప్రేమ పొందడము. ఆయనే ఈ ప్రపంచానికి యజమాని. అన్ని సంపదలూ, సౌకర్యాలూ ఆయన కనుసన్నలలోనే నడుస్తుంటాయి. మానవునికి కావలసినవన్నీ ఆయన కృపమీద, చూపుమీద, చూపులోని ఒక కిరణము మీద ఆధారపడి ఉంటాయి. ఆయన మన మీద అలిగితే మనకు రోగాలు వస్తాయి. చదువులు, ఆస్తులు, ఉద్యోగాలు పోతాయి. ఆయన నియమాలకు విరుద్ధంగా మనము నడిస్తే అన్నీ నాశనమైపోతాయి" అని ఎవరో చెప్తుండగా వింటున్నాడు.

### భగవంతుని ప్రేమ ఎలా లభిస్తుంది

ఇవన్నీ విన్న ఆ వ్యక్తి భగవంతుని ప్రేమను ఎలా పొందాలా అని ఆలోచించి సుకరాతుడనే ఒక గొప్ప భగవద్భక్తుని వద్దకు వెళ్ళాడు. వెళ్ళి 'స్వామీ మీరే ఈనాడు అందరికంటే గొప్ప సాధువు. భగవంతుని ప్రేమను పొందగలిగే ఉపాయమేదైనా ఉంటే చెప్పండి' అన్నాడు. సుకరాతుడు మౌనంగా ఉన్నాడు. కొన్ని రోజుల తరువాత మళ్ళీ వచ్చి 'స్వామీ! మీరు భగవంతుని చూశారు, ఆయన ప్రేమను పొందారు. నేనూ ఆ ప్రేమ పొందేలా చేయండి, నాకు ఆయన అనుగ్రహం లభించదా?' అన్నాడు. 'నీవు రేపు వచ్చి నాకు ఒక సేవ చేసిపెడితే నేను నీకు మార్గదర్శనం చేస్తాను' అని చెప్పాడు సుకరాతుడు. రెండవ రోజు ఆ వ్యక్తి రాగానే సుకరాతుడు ఒక పచ్చి కుండను అతని చేతికిచ్చి దాని నిండా నీరు నింపి తీసుకుని రమ్మని ఆ నీటితోనే స్నానం చేయాలి, అదే నీరు నేను త్రాగాలి అన్నాడు.

### కుండ గట్టిగా ఉండాలి

ఆ పచ్చికుండను తీసుకుని ఆ వ్యక్తి బావి వద్దకు వెళ్ళి తాడు కట్టి నీటిలోకి వేశాడు. నీరు పైకి లాగుతుండగానే ఆ కుండంతా విచ్చిపోయి చివరికి కొంత నీరు మాత్రమే మిగిలింది. ఆ నీటితో సుకరాతుని వద్దకు వెళ్ళి స్వామీ మీరిచ్చిన కుండ మధ్యలోనే

[redacted] చేయవచ్చు. కాని సృష్టికర్త నియమావళిని మోసం చేయలేవు.

విచ్చిపోయింది అన్నాడు. 'నాయనా సరిగ్గా ఇదే ఫిలాసఫీ భగవానుని అనుగ్రహానికి కూడా వర్తిస్తుంది. పచ్చికుండ నీటిధారణ చేయలేదు. ధారణ చేయాలంటే కుండ గట్టిగా ఉండాలి' అని సుకరాతుడు చెప్పాడు.

### భ్రాంతులు

భగవానుని ప్రేమ పొందాలనే కోరుకునేవాడు వ్యక్తి సచ్చరిత్రుడు, త్యాగి, నిష్ఠావంతుడు, మంచి వ్యక్తిత్వ సంపన్నుడై ఉండాలి. భగవంతుని పూజించడానికి ఇదే మంచి పద్ధతి. కానీ గడచిన రోజులలో తప్పుడు నియమాలు కొన్ని ఏర్పరచబడ్డాయి. కర్మకాండ అనేది పూజ ఉపాసనల ఆట అని, భగవానుని ప్రేమ పొందుటకు అది మంచి సాధనమని, ఎవరూ తమ జీవితమును దిద్దుకోనవసరము కానీ, అంత గొప్పగా మలచుకోవలసిన అవసరం కానీ లేదని, ఏదో కొంత శాంతిని పూజ ద్వారా పొందగలిగితే చాలనే ఒక అజ్ఞానము, భ్రమ ఆవరించింది. దానితో కొంతవరకైనా లక్ష్యమునకు చేరగలిగే మనము తప్పు మార్గము ఎంచుకొని మోసపోయాము.

### తీర్థస్థానముల వల్ల మనశ్శాంతి లభిస్తుందా?

ఒక పడవనడిపే వానికి ఒకసారి మనశ్శాంతి కరువైంది. భగవంతుని వైపు వెళితే దుఃఖము నశించి శాంతి పొందగలను అని అనుకున్నాడు. ఏం చేయాలి అని ఆలోచించి తీర్థయాత్రలు చేస్తూ భగవంతుని దర్శించాలని నిర్ణయించుకున్నాడు. కేశిక అనబడే అతని భార్య ఇలా చెప్పింది, 'శాంతి అనేది మన లోపల ఉంటుంది. ఆ లోపల కవాటాలు తెరువకుండా, శాంతి ద్వారాలు తెరువకుండా శాంతి ఎలా లభిస్తుంది, బయట శాంతి ఎక్కడ ఉందని వెతకడానికి వెళుతున్నారు?' అయినా సరే అతను ఆమె మాట వినలేదు. గంగాస్నానముచేసి జగన్నాథుని దర్శించి శాంతిని తెచ్చుకుంటాను అన్నాడు. అతని దుఃఖము చూడలేక ఆమె కూడా బయలుదేరింది.

### పత్ని శిక్షణ ఇచ్చింది

ఆమె తనతో పాటు నాలుగు వంకాయలను రుమాలులో మూటకట్టి ఎక్కడెక్కడ తన భర్త తీర్థయాత్రా స్నానము చేశాడో అక్కడక్కడ ఆమె వాటికి కూడా స్నానము చేయించి భగవద్దర్శనానికి తీసుకువెళ్ళింది. ఇంటికి చేరుకోగానే వాటితో కూరచేసి అతనికి వడ్డించింది. అవి కుళ్ళిన కంపు కొడుతున్నాయి. భర్త ఆమెతో ఏంటి ఇలా చేశావు, నాకు కడుపుతిప్పుతోంది, దుర్గంధము కొడుతోంది అన్నాడు. అదేమిటి ఇవి మీతో పాటే నాలుగు ధామాలలో భగవద్దర్శనము చేసుకున్న వంకాయలు, మరి వంకాయకు ఎటువంటి రుచి ప్రాప్తించనప్పుడు మీకు శాంతి ఎలా వస్తుంది? అన్నది భార్య. అప్పుడు పడవవాని హృదయకవాటాలు తెరుచుకున్నాయి. అతను తనలోపల ఉన్న భగవంతుడిని వెతుకుట ప్రారంభించాడు, దానితో అతనికి శాంతి లభించింది.

### లోతుల్లోకి ప్రవేశించాలి

ఎవరిని ఆధారముగా చేసుకొని ఈ విశ్వము, మానవుని సర్వోన్నతి అంతా ఆధారపడిఉందో ఆ భగవంతుడిని వెతికి ఆయనను పొందే ప్రయత్నము చేయాలి. నా జీవితమంతా ఈ పని చేయుటలోనే గడిచిపోయింది. భగవంతుడెక్కడ ఉంటాడు. ఆయనను ఎలా పొందాలి అనే విషయముపై లోతుగా ఆలోచించాలి. ఇందుకొరకు మా గురుదేవులు నన్ను ఎలా లోతుల్లోకి తోసేందుకు ప్రయత్నించారో నేను కూడా మిమ్మల్ని అలానే తోస్తాను. అప్పుడే మీరు వాస్తవాలను గ్రహిస్తారు.

ఒకసారి భగవంతుడికి తను ఎన్నో ఆశలతో, కోరికలతో తను సృష్టించిన తనకు ప్రియాతిప్రియమైన మానవులను చూడాలని, వారి సంగతులు తెలుసుకోవాలని, వారిని కర్తవ్యోన్ముఖులను చేయాలని, మానవజీవితము యొక్క గొప్పతనం వివరించాలని ఇలా చాలా కోరికలతో భూలోకం బయలుదేరాడు. భగవంతుడు చేయగలిగే ఏ కార్యమునైనా మానవుడు కూడా చేయగలడు అనే శిక్షణ ఇవ్వాలనుకున్నాడు.

### భగవంతుడు పృథ్వి మీదకు వచ్చాడు

పృథ్వి మీదకు వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. లక్ష్మీదేవి ఇలా అంది 'ఎందుకు అనవసరంగా కష్టపడతారు, మానవులకు మీ అవసరమే లేదు. మానవులు ఇప్పుడు తెలివిమీరిపోయారు. చాలా చెడుగా ఆలోచిస్తున్నారు. మిమ్మల్ని పట్టించుకోరు' అంది. 'లేదు లేదు మానవులు మన పిల్లలు. నేను వెళ్ళి వాళ్ళకి మంచి మార్గము, కర్తవ్యము ఉపదేశించాలి' అన్నాడు భగవానుడు. మానవులకు శిక్షణ ఇవ్వడం మొదలెట్టాడు. అందు జ్ఞాన సంబంధ ప్రవచనాలు, ఆత్మకళ్యాణ పరోపకార, సేవా ప్రయోజనాలు ఉన్నాయి. అవి వినేందుకు ఎవరూ ఇష్టపడుటలేదు.

### కోరికల జాబితా

మానవులు ఇవన్నీ మాకవసరం లేదు అన్నారు. మరి ఏంటి

**[redacted]వకాశము వస్తుందని ఎదురుగా ఉన్న అవకాశాన్ని వదలవద్దు.**

అవసరం అన్నాడు భగవంతుడు. ఒకడేమో నాకు జ్వరం తగ్గించండి స్వామీ అని, మరొకడు నాపై ఆక్రమణలు జరుగుతున్నాయి అవి తగ్గించమని, ఇంకోడు నాకు వయసైపోతోంది, పెళ్ళి కావడము లేదు, మంచి అమ్మాయి కావాలి అని.... ఇలా అందరూ మాకు ఇది చేయండి అది చేయండి అని అడుగుతూనే ఉన్నారు.

భగవంతునికి చాలా కోపం వచ్చింది. వీళ్ళకి నేను జ్ఞానాన్నందించేందుకు, మానవజీవితోద్దేశ్యమును చెప్పేందుకు, శాంతి ప్రసాదించేందుకు వస్తే ఈ పనికిమాలిన, బుద్ధితక్కువ మానవులు వారి తెలివితేటలతోనే తీర్చుకోగల సమస్యల గురించి, చిన్న-పెద్ద అవసరాల గురించి కోరుకుంటారా! ఈ మానవుడు నీచుడైపోయాడు అని కోపగించుకొని వెళ్ళిపోయాడు.

**భగవానుడు కొండపైకి చేరాడు- అక్కడికీ చేరారు మానవులు**

మానవులు రాలేని చోటికి వెళ్ళాలని అనుకొని కైలాస పర్వతంపై నివసించుట మొదలుపెట్టాడు. మార్గాలు వెతుక్కుంటూ ఏదో విధంగా అక్కడికీ చేరారు మానవులు. నాయనా! మీ లోపల నేను అన్ని శక్తులను, అన్ని సౌకర్యాలను నింపి పెట్టాను. మీ అంతరంగంలో వెతుకుట ప్రారంభించి మంచి జీవితం గడిపితే మీకు అన్ని రకాల రిద్ధులు-సిద్ధులు, అన్ని సుఖసౌకర్యాలు అనాయాసంగానే వస్తాయి అని భగవంతుడు చెప్పాడు. మేము ఇవన్నీ చేయలేము మా వల్ల కాదు అన్నారు మానవులు. మరేమి చేస్తారు అన్నాడు భగవంతుడు. మీ ఆశీర్వాదాలతో మాక్కావల్సినవి పొందుతాము అన్నారు.

## నీచులం, పరమ నీచులం మనం

భగవంతునికి మరల కోపం వచ్చింది. ఇందుకే నేను పారిపోయాను. నేను మీకు విద్యలను, బలాన్ని, తెలివిని ఇచ్చి శారీరక అవసరాలు తీర్చుకోమంటే అవి కూడా చేసుకోలేక నా దగ్గరకి వస్తారా! ఆత్మోన్నతి మాత్రమే నేను చేస్తాను అన్నాడు. మాకు ఆత్మోన్నతి వద్దు, శారీరిక అవసరాలే కావాలి అన్నారు మానవులు. మళ్ళీ విసుగెత్తిన భగవానుడు పారిపోయాడు.

## భగవానుడు సముద్రంలోకి వెళ్ళాడు

మనుష్యులు ఎక్కడికైనా వచ్చేస్తున్నారు. ద్వారక దగ్గర బెట్‌ద్వారక అనే ప్రదేశముంది. చుట్టూ సముద్రం, మధ్యలో చిన్న ద్వీపం అది. అక్కడ కూర్చున్నాడు భగవానుడు. ఇక్కడైతే వాళ్ళెవరూ నన్ను విసిగించరు, ఎవరూ ఇక్కడిదాకా చేరుకోలేరనే నమ్మకంతో అక్కడ ఉండసాగాడు. ఒక్కసారి ఇంటికి వెళ్ళి లక్ష్మీ దేవిని చూసిరావాలనిపించింది. ఆమె వారించినా వినకుండా మానవుల దగ్గరకి వచ్చాను, వీరేమో ఎన్నో విషయాలలో ఇరుక్కుపోయి లక్ష్యాన్ని మరిచిపోయారు. మాట కూడా వినేస్థితిలో లేరు. ఇప్పుడు ఇంటికి వెళ్తే పలుచనైపోతాను అనుకుని అక్కడే ఉన్నాడు.

## సందిగ్ధంలో భగవానుడు

ఆయనక్కడ ఉన్నాడని తెలుసుకున్న మానవులు పడవలు వేసుకుని వచ్చేశారు. భగవానుడు వారితో ఇలా అన్నాడు - నన్ను భూమిమీదా వదలరు, కొండమీదా వదలరు, నీళ్ళల్లోనూ వదలరు, ఇప్పుడేం చేయాలి. భగవానునికి చాలా దుఃఖం వచ్చింది. ఇంటికీ వెళ్ళేందుకు లేదు, వీళ్ళ దగ్గర ఉండేందుకు లేదు. ఇప్పుడేం చేయాలి? పృథ్వి మీదనే ఉంటూ మమ్ము పొందాలనుకునే మంచి మానవులకు సులభంగా లభించాలి. కాని అందరికి కనుపించని ప్రదేశం కూడా ఎంచుకోవాలి. అటువంటి ప్రదేశం ఎక్కడ ఉన్నది?

(ముగింపు వచ్చే సంచికలో)

*అఖండ జ్యోతి ఆగస్టు 2010*

*- అనువాదం : శ్రీమతి వల్లీ శ్రీనివాస్*

## ఆత్మ విశ్వాసం అడుగంటితే

*ఆఫీసులో అతి పెద్ద పదవిలో ఉన్న బాబు దయనీయమైన స్థితిలో ఇంటికి రావడం చూచి భార్య ఆందోళనగా అలా ఉన్నారేమని ప్రశ్నించింది. దారిలో ఒక దొంగ, నా కోటు, చెప్పులు, కళ్ళద్దాలు, పెన్ను, పర్సు అన్ని దోచుకున్నాడని చెప్పాడు. భార్య ఆశ్చర్యంతో మీ దగ్గర పిస్తోలు కూడా ఉన్నది కదా ఇలాంటి పరిస్థితి ఎందుకు సంభవించిందని అంటుంది. దానికి బాబు అదృష్టం బాగుంది. వాడి దృష్టి తుపాకి మీద పడలేదు. లేకుంటే అది వదిలేవాడు కాదని అన్నాడు.*

*మానవుని అంతఃకరణలో మహాశక్తి ఉన్నది. దానిపేరే ఆత్మ విశ్వాసం. సమర్థుడైన వ్యక్తి నుండి ఒక దొంగ తన ఆత్మవిశ్వాసంలో సర్వం దోచుకోగలిగినట్లే, వ్యక్తి తన ఆత్మవిశ్వాసంతో కోరుకున్నవన్నీ సాధించగలడు.*

*- ప్రజ్ఞా పురాణం నుండి*

[redacted] కుటిలత్వం, నీచత్వం, పిసినారి తనం, స్వార్థం ఉండవు.

వైజ్ఞానిక ఆధ్యాత్మికత

# పతంజలి యోగ సూత్రాలు

ఆధ్యాత్మిక ఋషుల వైజ్ఞానిక యోగ విజ్ఞాన అధ్యయనం, అనుసంధానం (రిసర్చి), అన్వేషనలో మహర్షి తమని తాము మరచిపోయారు. పతంజలి మహర్షి చేస్తున్న విశిష్ఠమైన, మహత్వపూర్ణమైన యోగవిజ్ఞాన ప్రయోగాల గురించి విశ్వ విద్యాలయంలోనే గాక భారతదేశమంతటా చర్చ జరుగుతున్నది. ఆయన ప్రచండ తపస్సు, విలక్షణమైన మేధస్సు, అసాధ్యాన్ని సాధ్యం చేసే ఆయన యోగసాధన, అంతకుమించి ఆయన ధృఢ సంకల్పం గురించి అందరికి తెలుసు. మహర్షి ఏమంటే అది జరిగితీరుతుందని సర్వవిదితమే. ఆయన అమోఘ సంకల్పం ఎప్పటికి విఫలమవదు. గత సంవత్సరం ఆయన పాణిని వ్యాకరణ సూత్రాలపై మహాభాష్యం వ్రాస్తున్నారు. పాణిని సూత్రం 3/1/26 భాష్యంలో ఉదాహరణ ఇచ్చారు. **పుణ్యమిత్రో యజతే, పుణ్యమిత్రో యాజయాతే** ఇంకో సూత్రం 3/2/123 భాష్యంలో ఇంకో ఉదాహరణ ఇచ్చారు. **ఇహ పుణ్యమిత్రం యజయామః**

ఈ వర్తమాన కాల క్రియప్రయోగములు, ఉత్తమ పురుష బహువచనములలో ఇచ్చిన ఈ ప్రయోగములపై ఆ రోజులలో చాల చర్చ జరిగింది. ఎందుకంటే అప్పుడే పుణ్యమిత్రుడు గురుకులంలో విద్యాధ్యయనం పూర్తిచేసుకొని మౌర్యసామ్రాట్టు బృహద్రధుని సేనలో చిన్న ఉద్యోగిగా నియమితుడయ్యాడు. ఆరోజులలో సామ్రాట్టు బృహద్రధుని పిరికితనం వల్ల యవనులు భరతభూమిని పాదాక్రాంతం చేసుకున్నారు. ఇలాంటి పరిస్థితులలో పుణ్యమిత్రుడు ఏం చేస్తాడు? మహర్షి అతనిని ఏ యజ్ఞమునకు యజమానినిగా చేస్తారు? ఈ ప్రశ్నలు అతని శిష్యుడు కృతయశుడు అడిగినప్పుడు మహర్షి ఇలా అన్నారు "అశ్వమేధ యజ్ఞం చేస్తాడు. పుణ్యమిత్రుడు త్వరలోనే భరతభూమి నుంచి యవనులను తరిమికొట్టి అశ్వమేధ యజ్ఞం చేస్తాడు" "ఇది ఏ విధంగా సాధ్యమవుతుంది గురుదేవా?" పతంజలి మహర్షి ఇలా జవాబిచ్చాడు ''దేశములోని శాసించే శక్తులు కర్తవ్యవిముఖమైనపుడు, నిస్తేజమైనపుడు, కూడని పనులు చేసినపుడు ఆధ్యాత్మిక శక్తులు జాగృతమయి తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తాయి."

దీని తరువాత పతంజలి మహర్షి ఏమి అనలేదు. సుమారు 3200 సంవత్సరాల నాటి కళలతో పాటు పరిస్థితులు మారిపోయాయి. బృహద్రధుని పతనంతో పాటు యవనుల పలాయనం జరిగింది. ఇదంతా మహర్షి ప్రియ శిష్యుడు పుణ్యమిత్రుడు చేశాడు. ఆయన భారతదేశ సామ్రాట్టు అయిన వెంటనే అశ్వమేధ యజ్ఞం నిర్వహించాడు. ఈ యజ్ఞములో పతంజలి మహర్షి ఆచార్యునిగా వ్యవహరించారు. వీరే ఆచార్య అగ్నివేశ్ ద్వారా తమ గురుదేవుల ఆత్రేయ పునర్వసు పేరుతో రచించిన "ఆత్రేయ సంహిత"ను శోధించి మార్పులు చేసి "చరక సంహిత" అనే పేరు ఇచ్చారు. వారి శిష్యులు వారిని అడిగారు "గురుదేవా! ఈ గ్రంధమునకు చరకసంహిత అనే పేరు ఎందుకు ఇవ్వబడింది?" వారు నవ్వి ఇలా అన్నారు.

"ఈ పేరులో వేదములలో మహర్షుల జ్ఞానోపదేశములు చరైవేతి! చరైవేతి! శబ్దస్పందనలు ఉన్నాయి. అది గతిశీలమై ఉంటే (సవ్యంగా పనిచేస్తే) వాడికి రోగములు రావు, జ్ఞాన వంతుడవుతాడు, సమృద్ధి లభిస్తుంది.

పతంజలి మహర్షి తమ జీవనంలోని అధికకాలం యోగవిజ్ఞాన పరిశోధనలో మునిగి ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న గవిష్ఠరుడు, విశ్వశాముడు, కృతయశౌ, పౌలోమి వీరందరు మహర్షి శిష్యులే. వీరిలో గవిష్ఠరుడు, విశ్వశాముడు గురుకులాన్ని స్థాపించినప్పటి నుండి మహర్షితో పాటు ఉన్నారు. కృతయశౌ, పౌలోమి రాజకన్యలు. వీరివురు విశ్వవిద్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత స్నాతకోత్సవ సమయంలో తమ సంపూర్ణ జీవితాన్ని యోగ సాధనకు సమర్పించాలని సంకల్పం తీసుకున్నారు. మహర్షి కంటే శ్రేష్ఠమైన మార్గదర్శకులు వారికి ఎక్కడ లభిస్తారు? ఈ శిష్యగణముతోపాటు మహర్షి విశ్వవిద్యాలయ కేంద్రంలో కులపతి కుటీరంలో తమ అన్వేషణ కార్యంలో నిమగ్నులయ్యారు. విశాలమైన స్థలములో నిర్మించిన ఈ ఆశ్రమంలో అనేక ప్రయోగశాలలు, గ్రంధాలయాలు ఉన్నాయి.

వ్యాకరణ శాస్త్రం-ధ్వని శాస్త్రముల విశేష జ్ఞానంతో పాటు మహర్షి శరీర శాస్త్రములో, చికిత్సా శాస్త్రంలో (వైద్యం)

**[redacted]లు చెప్పేవారు వాటిని పాటించేవారై ఉండాలి.**

ప్రావిణ్యతగలవారు. దైనందిన వ్యవహారాలలోను, ఆలోచనల సూక్ష్మత్వంపై ఇంత బాగా నేర్పు ఉన్నవారు ఎవరున్నారు? వీరి ఈ విశేష జ్ఞానం, వీరి అధ్యయనం వారి రీసర్చి పనులలో ఉపయోగించేవి. ఋగ్వేదకాలం నుంచి, బుద్ధ భగవానుని, తీర్థంకరుల యోగ సంబంధమైన కార్యముల సూక్ష్మతల గురించి తెలుసు. వీటిని గురించి తెలుసుకోవడమే గాక వారు తమ శిష్యులతో జటిలమైన కఠినమైన ప్రయోగాలు నిర్వహించేవారు. శరీర ఆరోగ్యంపై, ప్రాణ ప్రక్రియలపై, మనస్సు యొక్క సూక్ష్మ సంవేదలనపై, సంస్కారములపై ప్రయోగాలు చేశారు. యోగవిద్య వల్ల ఆలోచనలు, సంస్కారాలు శుద్ధి చెంది కైవల్య పథం ప్రాప్తిస్తుంది. ప్రతిష్ఠను ఇనుమడింప చేస్తుంది.

యోగ గ్రంథములలో వర్ణించబడిన, సిద్ధ పురుషుల ద్వారా, సాధకుల ద్వారా చెప్పబడిన సంపూర్ణ సత్యములను, తత్వములను పతంజలి మహర్షి సూత్రములుగా చెప్పడం ప్రారంభించారు. ఒక అసలుసిసలు విజ్ఞానవేత్త వలె ఈ పనిని నిర్వహిస్తున్నారు. ఈ పనిలో మనుష్యుల విశ్వాసాలకు స్థానం లేదు. ప్రయోగాలలో ప్రామాణికమైనవే ఇవ్వబడ్డాయి. సమాధి పాదం, సాధనా పాదం, విభూతి పాదం, కైవల్య పాదములలో విభజింపబడిన ఈ గ్రంథములో 51, 55, 55, 34 అంటే మొత్తం 195 సూత్రాలున్నాయి. ఈ యోగ విజ్ఞాన విధానం ఆస్తికులకు ఈశ్వర పరాయణులకు ఉపయోగపడుతుంది. నాస్తికులకు, నిరాశావాదులకు కూడా ప్రయోజనకారియే. ఈ సూత్రములను జాతి, వర్గ, క్షేత్ర, స్త్రీ-పురుష వ్యత్యాసం లేకుండా అందరికి అన్వయించుకోవచ్చు.

పతంజలి మహర్షి యొక్క ఈ గ్రంథం పూర్తి అయింది. సంధ్యాసమయం కులపతి కుటీరంలో పచార్లు చేస్తున్నారు. అస్తమిస్తున్న సూర్యుని కిరణములు వికశించి ఉన్న కమలములకు వీడ్కోలు చెప్తున్నాయి. ఉద్యానవనంలో ఉన్న అందమైన పుష్పములు తమ సుగంధాన్ని వెదజల్లుతున్నాయి. మహర్షి మౌనంగా అటూ ఇటూ తిరుగుతున్నారు. ఆయన ముఖంలో అంతులేని సంతోషం కనిపిస్తున్నది. కుటీరం యొక్క ద్వారం నుండి ఆయన శిష్యులు, సహయోగులు ఆయనకు ప్రణామం చేశారు. ఆయన ఆశీర్వాద ముద్రలో చెయ్యి ఎత్తారు. పౌలోమీ సందేహిస్తూ అడిగింది "గురుదేవా! మీరు వ్రాసిన 195 సూత్రములలో ముఖ్యమైన, ప్రధానమైన సూత్రం ఏమిటి?" "పుత్రీ! **ప్రథమ సూత్రం-అథ యోగానుశాసనం,** యోగ విజ్ఞానం యొక్క వైజ్ఞానిక ప్రయోగముల అనుశాసనమును స్వీకరించాలి. దీనిలో ఎనిమిది ప్రయోగాలు ముఖ్యమైనవి. దీనిలో అష్టాంగములు ఉన్నాయి. 1. వ్యావహారిక పరిష్కారముల కొరకు **యమములు**. దీనిలో సదాచార సూత్రములున్నాయి. 2. ఆలోచనలలో మార్పు కొరకు **నియమాలు**. 3. శరీరం రోగరహితంగా ధృడంగా ఉండటానికి **ఆసనములు**. 4. ప్రాణ పరిమార్జన (పెంపుదల) కొరకు **ప్రాణయామం**. 5. చింతన చేతనతో (ఆలోచనలతో) పాటు ప్రాణ ప్రవాహమును అంతర్లీనం చెయ్యడానికి **ప్రత్యాహారం**. 6. తత్వములను, సత్యమును, సత్యమును ధారణ చేసే శక్తిని ప్రాప్తించుకునేందుకు **ధారణ**. 7. ధారణ నిలుపుకోవడానికి **ధ్యానం**. 8. ధ్యానం యొక్క ద్వారం గుండా ప్రవేశించి సత్యమును తన స్వరూపంలో ప్రతిష్ఠించుకోవడానికి **సమాధి**. "మేమందరం మీ సాన్నిధ్యములో ఉండి ధన్యులమయ్యాము. శిష్యులందరు ఒకే స్వరంతో అలా అనేసరికి మహర్షి ఇలా అన్నారు "నా పిల్లల్లారా! మీరందించిన ప్రేమ సహయోగమునకు కృతజ్ఞుడను. అప్పుడు వారందరు మహర్షిని ఆశ్చర్యపరస్తూ ఇలా అన్నాడు.

**"యోగేన చిత్తస్య పదేన వాచా**
**మలం శరీరస్య చ వైద్యకేన ।**
**యోయాకరోతం ప్రవరం మునీనాం**
**పతంజలిం ప్రాజంలిరానతోస్మి ॥**

**పాతంజలి మహాభాష్య చరక ప్రతి సంస్కృతై ।**
**మనో వాక్యాయదోషాణం హన్రై హివతయే నమః ॥**

యోగముతో చిత్తంలోని సూత్రముల భాష్యంతో వాణిలోని, వైద్య శాస్త్రంతో శరీరంలోని మాలిన్యములను దూరం చేసే విజ్ఞానం అందించిన వారికి, ముని శ్రేష్ఠుడు పతంజలికి మేమందరం చేతులు జోడించి నమస్కరిస్తున్నాము. పతంజలి సూత్రములు, మహాభాష్యం, చరక సంహితను శోధించి మనస్సులోని, వాణిలోని శరీరములోని దోషముల నివారణ పద్ధతిని అందించారో ఆ శేషావతార మహర్షి పతంజలికి నమస్కరిస్తున్నాము.

ఈ పంక్తులు విని మహర్షి అన్నారు "ఇప్పుడు తంత్రం యొక్క వైజ్ఞానిక రహస్యములను ఉద్ఘాటించాలి"

*– అఖండ జ్యోతి జూలై 2009*
*– అనువాదం : శ్రీమతి కృష్ణకుమారి*

**[redacted]త్మ విశ్వాసం కలిగిన వ్యక్తి ఎన్నడు ఓడిపోడు.**

## ఆదిశక్తి యొక్క లీలాకథలు - 4

# సఫలతకు మూలాధారం పారాయణ

ఆదిశక్తి యొక్క లీలలనే కథల (గాథలు)ను తన యొక్క ప్రతి అక్షరములోనూ కూర్చబడియున్నటువంటి శ్రీదుర్గాసప్తశతి ప్రయోగము అమోఘమైనది. తమ యొక్క అస్తిత్వంలో దీనిగురించి అనుభూతిచెందిన వారికి, దీనిని పారాయణ చేయవలసిన విధివిధానమును గురించి సహజంగానే కుతూహలం ఉంటుంది. భగవతి యొక్క లీలాగాథలకు సంబంధించిన పారాయణ క్రమాల గురించి గత సంచికలో వివరణ ఇవ్వబడినది. అయితే దైనందిన జీవన విధానంలో దీనిని ఏ విధంగా స్వీకరించాలి అన్న ప్రశ్న ఇంకా మిగిలిఉన్నది. సామాన్యమైన సాధకుడు దీనిని ఏ విధంగా ప్రయోగించాలి? సర్వసాధారణమైన ప్రజలకు దీనిని పఠించవల్సిన విధివిధానం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, ఆదిశక్తియొక్క లీలాగాథకు సంబంధించిన విభిన్న అంగములు, పలురకములైన మంత్రములకు చెందిన వేదాంతపరమైన, ఆధ్యాత్మిక రహస్యాలను వెల్లడి చేయడం మంచిది కాదు. ఈ ప్రశ్నలకు సరళమైన, సరసమైన సమాధానం ఇవ్వడంలో మరియొక లాభం కూడా ఉంది. ఏ సాధకుడైనా దీనిని సాధన చేస్తూ ఈ పవిత్రమైన లీలాగాథను పఠించవలెనని కోరుకున్నట్లయితే, అతడి మార్గం సహజంగానే శ్రేష్ఠమౌతుంది.

శ్రీ దుర్గాసప్తశతిని పారాయణ చేయవల్సిన విధివిధానమును తెలుసుకొనుటకు ఉత్సాహపడే సాధకులు ముందుగా శ్రీ దుర్గాసప్తశతి పుస్తకమును సంపాదించాలి. మార్కెట్టులో ప్రస్తుతం పలు ముద్రణాసంస్థలు వెలువరించిన పలు పుస్తకములు ఉన్నవికానీ గమనించి చూస్తే చాలావాటిలో ముద్రణా లోపాలు కొన్ని ఉన్నాయి. గీతాప్రెస్ ద్వారా ముద్రించబడిన పుస్తకం మాత్రం అన్నివిధాలా బాగున్నది. ప్రారంభంలో ఈ పుస్తకం యొక్క రెండు ప్రతులను తీసుకొనడం మంచిది. మొదటిది పారాయణానికి, రెండవ పుస్తకాన్ని లీలాగాథలోని వివిధమంత్రాలను నిత్యమూ స్వాధ్యాయము చేస్తూ, మననం చేసుకొనటానికి వాడవచ్చు. పారాయణానికి ఎన్నుకొనిన పుస్తకమును పూజాస్థలంలో మాత్రమే ఉంచాలి. దానితోపాటు ఈ పుస్తకానికి జగదంబ యొక్క సాకారమూర్తికి ఇచ్చే గౌరవాన్ని ఇవ్వాలి. స్వాధ్యాయము కొరకు ఎన్నుకొనిన పుస్తకమును జాగ్రత్తగా చదివి అందులోని విషయాలను బాగా అర్థం చేసుకొనుటలో ఎటువంటి ఇబ్బందీ రాకుండా ఉంటుంది. ఇప్పుడు పారాయణను ప్రారంభించబోతున్న సాధకులందరికీ ఒక విన్నపం. అది ఏమిటంటే, దీనిని పారాయణ చేయుటకు విధివిధానము ఎంత అవసరమో, సాధకుని యొక్క ఆహారవిహారములు, ఆలోచనాక్రమం ఎంతో సరళంగానూ, సాత్త్వికంగానూ ఉండే విధంగా జాగ్రత్త తీసుకొనుటకూడా అంతకన్నా ఎక్కువ అవసరం. ఇందుకొరకు సాధకులు గాయత్రీ అనుష్ఠానమునకు అవసరమయ్యే అన్నిరకాలైన నియమాలు-ఉప నియమాలను పాటించవలెను. దీని ప్రయోగంలో నిష్ణాతులైన వారందరూ ముక్తకంఠంతో చెప్పేదేమంటే 'ఇందులో బ్రహ్మచర్యమునకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. సాధకుడు బ్రహ్మచర్యాన్ని ఎంత జాగ్రత్తగా పాటించగలడో, సాధన అంతే ఫలితాన్నిస్తూ ముందుకు సాగగలదు. త్రికరణశుద్ధితో బ్రహ్మచర్య వ్రతాన్ని నిష్ఠగా పాటించే సాధకుడు ఇతర నియమాలేవైనా పాటించకపోయినప్పటికీ, ఆహార-పానీయాలు తీసుకునే విషయంలో కొంత వ్యత్యాసం జరిగిననూ, అతని సాధన ఎంతో మంచి ఫలితాలనివ్వగలదు.

ఈ విషయమై **'కఠినమైన కష్టాలలో, శత్రుబాధలో, కుట్రదారుల మధ్య చిక్కుకున్నప్పుడు, గ్రహబాధలు, దారుణంగా ఉన్న విషమ పరిస్థితులు లేదా ఏదో విధంగా భయానకమైన, వికృతమైన, భీషణమైన పరిస్థితులు ఎదురైనప్పుడు, బ్రహ్మచర్యాన్ని నిష్ఠగా పాటించే వ్యక్తి ఎవరైనా ఈ ప్రయోగాన్ని చేసినట్లయితే, సమస్తమైన దారుణ, భీషణ పరిస్థితులన్నీ చెల్లాచెదరైపోతాయి'** అని అనుభవజ్ఞులు తెలియజేస్తున్నారు. సరిగ్గా చెప్పాలంటే ఒకటి రెండు గంటలలోనే ఈ ప్రయోగం ఫలితాన్నిస్తుంది. ఇంద్రునితో సమానమైన పరాక్రమవంతుడైన రాజుకూడా ఈ ప్రయోగాన్ని చేసే సాధకుని ముందు నిలబడలేడు. కుట్రలు పన్నేవారందరూ, వారు చేసే కుట్రలు ఈ ప్రయోగకర్త ముందు విఫలమైపోతాయి. వారి తేజస్సు నాశనమౌతుంది. వారి ఆత్మబలం క్షీణించిపోతుంది. వారు అన్నివిధాల విఫలురై దెబ్బతింటారు.

ఇప్పుడిక పారాయణక్రమమును ప్రారంభించటానికి ప్రథమంగా మంచిరోజులను చూడాలి. కాని ఆపద వచ్చినప్పుడు

**[redacted]మార్గంలో నడిస్తే ఆత్మబలం అధికమవుతుంది.**

ఈ ఆలోచనను వదిలివేయాలి. కానీ గాయత్రీ మహామంత్రం అన్ని మంత్రముల ప్రయోగాలకూ ఆధారం కాబట్టి సాధకుడు ఈ **దుర్గాసప్తశతి పారాయణ కాలంలో నిత్యమూ ఒక సహస్ర గాయత్రీని జపించాలి.** ఒక వేళ ప్రయోగం దీర్ఘకాలికమైనది లేదా అతి విశిష్టమైన ప్రయోజనాన్ని ఆశించినది అయినట్లయితే, దానికనుగుణంగా గాయత్రీ మంత్రజపం 24 వేలు, ఒక లక్షా పాతిక వేలు లేదా 24 లక్షల జపం, అనుష్ఠానపూర్వకంగా చేయవలెను. మంచి అనుభవజ్ఞులైన పండితులు, 'గాయత్రీ మహా మంత్ర మహా పురశ్చరణ చేసిన తరువాత ఎవరైన సాధకుడు ఈ విశిష్టమైన ప్రయోగం చేసినట్లయితే విధివ్రాతను మార్చుకొనుటలోకూడా సమర్థుడు కాగలడు' అని తెలియజేస్తున్నారు. ఈ సత్యం అనేకమంది ద్వారా పలుమార్లు నిరూపించబడినది. ఈనాడు కూడా ఎవరైనాసరే, ఎప్పుడైనాసరే ఈ సత్యాన్ని పరీక్షించి సఫలమని నిరూపించుకొనవచ్చు.

పారాయణా విధానంలో ముందుకువస్తే సాధకుడు స్నానమాచరించి, శుద్ధవస్త్రములు ధరించి, తన పూజాస్థలంలో ఆసీనమై, భగవతి ధ్యానించి, తత్త్వశుద్ధి కొరకు ఆచమనం చేసిన తరువాత చేతిలోనికి పుష్పాలు, అక్షతలు తీసుకొని జలమును తాకి సంకల్పమును పఠించవలెను. సంకల్పం తరువాత శాపోద్ధారణ క్రమాన్ని, పుస్తకంలో చెప్పబడిన విధి ననుసరించి చదువవలెను. ఈ శాపోద్ధారణ మంత్రాలకు ముందు పుస్తకమును పూజించాలి. పుస్తకపూజ, శాపోద్ధారణ మంత్రాల తరువాత సాధకుడు ఉత్కీలనమంత్రాన్ని 21 మార్లు, మృతసంజీవనీ విద్యను ఏడుమారులు పఠించవలయును. దీని తరువాత ఆదిశక్తికి నమస్కరించి కవచం, అర్గళం, కీలకం చదవవలెను. తమ యొక్క అభిరుచిననుసరించి ఈ క్రమంలో రాత్రిసూక్తం, అధర్వశీర్షం కూడా చదువవచ్చును. దీని తరువాత వినియోగం, న్యాస సహిత నవార్ణమంత్రాన్ని జపించవలెను. ఆ తరువాత అవసరమైనంత మేరకు వినియోగం, న్యాసం చేసి శ్రీ దుర్గాసప్తశతి యొక్క మూడు రహస్యాలను, అనగా ప్రాధానిక, వైకృతిక, మూర్తిరహస్యాలను తదుపరి చెయ్యవలెను. ఐతే సాధకుడు కోరుకుంటే, నవార్ణమంత్రం తదుపరి దేవీసూక్తాన్ని పఠించవచ్చును. రహస్యముల పారాయణ తరువాత, శాపోద్ధారణ విధి మరల సంపూర్ణంగా చదవువలెను. ఆఖరుగా క్షమాప్రార్థన, ఆరతి.... మొదలైనవాటితో ఈ పారాయణాక్రమం సంపూర్ణం గావించబడుతుంది.

అశక్తత వల్లనో, పని ఒత్తిడి చేతనో సాధకులెవరైనా ప్రతిదినమూ మూడు చరిత్రలను పారాయణ చేయలేక పోయినట్లయితే, వారు తమ పారాయణను వారం రోజులలో పూర్తిచేయవచ్చును. ఇందుకొరకు వారు మొదటిరోజు ప్రథమ అధ్యాయాన్ని, రెండవ రోజు రెండు, మూడు అధ్యాయాలను మూడవరోజు, నాల్గవ అధ్యాయాన్ని నాలుగవరోజు ఐదు, ఆరు, ఏడు, ఎనిమిదవ అధ్యాయాలను చదువవలెను. అయిదవరోజు– తొమ్మిది, పది అధ్యాయాలను, ఆరవరోజు పదకొండవ అధ్యాయాన్ని, ఏడవరోజు పన్నెండు, పదమూడు అధ్యాయాలను చదివి పారాయణను పూర్తిగావించవలెను. ఈ విధంగా ఏడురోజులలో శ్రీ దుర్గాసప్తశతిని సంపూర్ణంగా పారాయణ చేయగలం. అయితే గుర్తుంచుకొనవల్సిన విషయమేమిటంటే, ఈ విధమైన సర్దుబాటు కేవలం అధ్యాయములకు మాత్రమే వర్తిస్తుంది. శ్రీ దుర్గాసప్తశతి అధ్యాయముల పారాయణకు ముందు చదువవల్సిన కవచం, అర్గళం, కీలకం మొదలైనవాటి పారాయణ, నవార్ణజపం మొదలైనవన్నీ యథాప్రకారం నిర్దేశింపబడిన రీతిలో ప్రతిరోజూ చదువాల్సిందే!

ఈ విధమైన పారాయణ క్రమంలో సంపుటీకరణం కూడా జోడింపబడినది. సంపుటీకరణలో శ్రీ దుర్గాసప్తశతి యొక్క వివిధ మంత్రాలను ప్రయోగించడం జరుగుతుంది. ఐతే సాధకుడు విశిష్టవ్యక్తి గనుక అయితే గాయత్రీమంత్రాన్ని ప్రయోగించవలెను. ఈ విధంగా చేయడం వలన శ్రీ దుర్గాసప్తశతిలోని 700 మంత్రాలతోపాటు, 1400 గాయత్రీమంత్ర పఠనం కూడా పూర్తవుతుంది. దీని యొక్క సత్ఫలితాన్ని గురించి వివరిస్తూ **"ప్రతిశ్లోకం వ్యాహృతిత్రయసంయుక్తాం గాయత్రీం జపేత్ తదా మహాఫలమ్"** అని చెప్పబడినది. అనగా మూడు వ్యాహృతులతో కూడిన గాయత్రీమంత్రాన్ని ఆదిలోనూ, అంతంలోనూ చదువుటవలన, జపించబడిన ఆయా శ్లోకాలు మహాఫలములు ఇస్తాయి అని అర్థం. శ్రీ దుర్గాసప్తశతి పారాయణ చేసిన తరువాత, శ్రీ సిద్ధకుంజికా స్తోత్రాన్ని పఠించుట శుభప్రదం అని చెప్పబడినది. ఈ క్రమంలో రహస్యమైన అంశాలు అనేకం కలవు. గాయత్రీమంత్రం యొక్క అర్థాన్ని, తత్త్వదర్శనాన్ని అవి విస్తృతరూపంలో తెలియజేయగలవు. మున్ముందు వాటినన్నింటి గురించి చర్చించుకొనగలం.

*– అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

[redacted]ల్లప్పుడు జ్ఞాపకముంచుకో, సాఫల్యానికి కీలకం ఇదే.

యజ్ఞ విద్య

# గాయత్రీ యజ్ఞం-ఉపయోగం, ఆవశ్యకత

గాయత్రీ మరియు యజ్ఞము అనేవి ఒక జంట. గాయత్రీ భారతీయసంస్కృతికి తల్లి అయితే యజ్ఞమనేది భారతీయధర్మానికి తండ్రి అని చెప్పబడింది. ఈ రెండూ అన్యోన్యాశ్రితాలు. గాయత్రీజప అనుష్ఠానం యజ్ఞముతో సమన్వయము చేయబడకపోతే అది సంపూర్ణమవదు. జపమునందలి ఒక అంశమును హవనము చేయాలి. పూర్వకాలములో జపమునందలి దశాంశమును హవనము చేసేవారు. కానీ ఈనాడు సమయానుకూలముగా శతాంశమును మాత్రమే ఆహుతులుగా సమర్పించడము జరుగుతున్నది. అలా చేయకపోతే అనుష్ఠానం పూర్తికాదు. ఎవరివద్ద యజ్ఞసాధనములు లేవో వారి కొరకు ఒక విశేష మార్గము సూచించబడినది. అదేమనగా యజ్ఞము చేయలేని లోటును పూరించడానికి సాధకులు తాము చేసిన జపసంఖ్యలోని దశాంశభాగమును లెక్కించి ఆ సంఖ్యను వేరుగా జపించాలి. అనివార్యపరిస్థితుల వలన యజ్ఞమును సవ్యముగా చేయలేకపోతే జపరూపములో దానిని ఎందుకు పూర్తిచేయకూడదనే ప్రతిపాదన చేయబడినది.

యజ్ఞసామాగ్రి లభించని సందర్భము గురించి జనక యజ్ఞవల్క్యుని మధ్య సంవాదము ఇలా జరిగింది. జనకుడు యజ్ఞ నిర్వహణయందలి సమస్యల గురించి చెప్తూ ఉంటే, యజ్ఞవల్క్యుడు అందుకు జవాబుగా పరిష్కారాలు సూచిస్తూ అనివార్యకతలపైన దృష్టి సారించాడు. 'హవనమునకు హవన సామాగ్రి దొరకనిచో ఏమి చేయాలని జనకులవారడిగినప్పుడు నిత్యము తినే ఆహారాన్నే ఉపయోగించుకోవచ్చునని యజ్ఞవల్క్యుడు చెప్పారు. అన్నము కూడా లభించని సమయాలలో వనస్పతులతోనైనా పని జరుపుకోవచ్చునని, అవి కూడా దొరకనప్పుడు సమిధలతోనే హవనము చేయవచ్చునని, అగ్ని కూడా లభించనిచో శ్రద్ధనే అగ్నిగా ధ్యానించి భావనతో మానసికముగా హవనం చేయమన్నారు. పైన చెప్పబడిన విషయమంతయూ విస్తార సంవాదము యొక్క సారాంశము మాత్రమే.

గాయత్రీ జపముతో పాటు యజ్ఞము అనివార్యము. అనుష్ఠానము చేసేటప్పుడు ఈ రెండింటికి పరస్పర సంబంధముంటుంది. నిత్యమూ గాయత్రీజపము, పంచ యజ్ఞములు చేయుట తప్పనిసరి. ఉపాసనాకర్మకాండలో బలివైశ్వము విధిగా కలిసివుంటుందనే విషయము అందరికీ తెలిసిందే. ఇబ్బందికర పరిస్థితులలో బలివైశ్వ కూడా మండే పొయ్యిలో నుండి నిప్పులను తీసి వండిన ఆహారాన్ని కొంచెము తీసుకొని దానిని ఐదు చిన్న చిన్న భాగాలుగా చేసి గాయత్రీమంత్రము చదువుతూ నిప్పులమీద ఆహుతి వేసినచో హవనము పూర్తియగును. నైష్ఠిక ఉపాసకులు భోజన సమయమందు వడ్డించిన ఆహారము నుండి ఐదు చిన్న చిన్న ముద్దలు చేసి అగ్నిలో వేసి హవనము చేస్తుంటారు. ఈనాటికీ ఈ పరంపర అక్కడక్కడా జీవించేఉంది. యుగనిర్మాణ మిషను దీనిని పునర్జీవింపచేసే ప్రక్రియ చేస్తున్నది.

భారతీయ ఋషిపరంపరలో తత్వదర్శులైనవారు బుద్ధిని, సూక్ష్మదృష్టిని, ఉపయోగములను, అడుగడుగునా ధ్యానములో ఉంచుకొని ముందుకుసాగారు. వారు ధార్మిక కార్యక్రమాలయందు యజ్ఞమునకు ప్రాధాన్యతతనిచ్చుటతో పాటు అనేక తథ్యాలను కూడా దృష్టిలో ఉంచుకున్నారు. ఉపయోగపడని దానిని దేనినీ వారు ప్రచారములోని తీసుకురాలేదు ప్రతి కర్మకాండ యొక్క ఉపయోగములను కూడా దృష్టిలో ఉంచుకునేవారు. ధార్మిక కార్యక్రమాలలో యజ్ఞమునకు ప్రాధాన్యతనిచ్చుటలో కూడా దాని భౌతిక, ఆధ్యాత్మిక లాభాలను గుణించేవారు.

శాస్త్రాలలో భగవానునికి 'యజ్ఞపురుషుడు' అనే పేరుఉంది. శతపథబ్రహ్మాణమునందు 'యజ్ఞోవైవిష్ణుః' అని ఉంది. వేదమునందు యజ్ఞమును విష్ణుభగవానునిగా అంగీకరించారు. ఋగ్వేదప్రారంభమునందు యజ్ఞము మార్గదర్శకునిగా, పురోహితునిగా, సద్గురువుగా కీర్తించబడింది. భజన చేసేవారిని 'దేవ' అని సంబోధిస్తూ ఆ కర్మకాండ ఫలితము రత్నరాశితో పోల్చబడింది. వేదవాఙ్మయమునందు యజ్ఞవిద్యకిచ్చినంత గొప్పతనము మరి దేనికీ ఇవ్వబడలేదు. **అగ్నేనయసుపథారయే....** ఈ ఋక్కునందు సర్వసమర్థశక్తి ద్వారా సన్మార్గము వైపు నడిపించమనే అభ్యర్థన ఉంది. గాయత్రీ మంత్రమునందలి **ధియోయోనః ప్రచోదయాత్** భాగము యొక్క అర్థము కూడా ఇదే.

సామాన్య జీవిత పరంపరలో ధార్మిక కార్యక్రమాలయందు యజ్ఞము అవిచ్ఛిన్నముగా కలిసిఉంది. జన్మించినది మొదలుకొని మరణించేటంతవరకు షోడశసంస్కారముల విధివిధానమున్నది. ఇవన్నీ యజ్ఞములోని భాగములే. యజ్ఞము లేకుండా ఏ సంస్కారము జరగదు. యజ్ఞోపవీతము అనే పేరులోనే యజ్ఞ ప్రాధాన్యత బోధపడుతున్నది. గాయత్రిని గురించిన భావన మరియు యజ్ఞక్రియల సమన్విత రూపమే యజ్ఞోపవీతము.

[redacted] జ్ఞాన సంపదను మించిన సంపద లేదు.

వివాహసంస్కార సమయములో వధూవరులు యజ్ఞకుండమునకు ప్రదక్షిణ చేయడమనేది ప్రధానకర్మకాండ. అంతిమసంస్కారములో అంత్యేష్ఠికి ఏర్పరిచిన చితిని విశాల ఆకృతిగల యజ్ఞముగా భావించవచ్చు. యజ్ఞనికి సంబంధించిన అనేక విధి విధానాలందులో ఉన్నాయి.

దేవీ దేవతల పూజలలో కూడా హవనము ఏదో ఒక రూపంలో జరుగుతూనే ఉంటుంది. సామాన్యంగా నిత్యపూజ చేసేటప్పుడు దీపాన్ని, అగరువత్తులను వెలిగించడమనేది యజ్ఞమునకు చిహ్నముగా చెప్తారు. అగరువత్తులు హవన సామాగ్రిగాను, దీపాన్ని నేతి ఆహుతులుగానూ అంగీకరిస్తారు. శుభకార్యములయందు కొవ్వుత్తుల రూపంలోనో, ఆగరువత్తుల రూపంలోనో తప్పనిసరిగా యజ్ఞమనేది జరుగుతుంది.

మన సంస్కృతి పరంపరలో యజ్ఞకర్మకు ఇంత ప్రాముఖ్యతను ఎందుకు ఇచ్చారనేది మనము లోతుగా ఆలోచించవలసిన విషయము. దీనికి జవాబు కావాలంటే లోతుల్లోకి వెళ్ళి పరిశోధించాలి. అప్పుడు ఆ రహస్యమయ పొరలు తొలగిపోయి ఈ విజ్ఞానము పూర్తిగా బోధపడుతోంది. ఆత్మిక ప్రగతికి, భౌతిక ప్రగతికి సంబంధించిన అన్ని సత్యములు ఇందులోనే బీజరూపంలో ఉన్నాయి. వ్యక్తి మరియు సమాజము సుఖంగా, శాంతిగా ఉండటానికి కావలసిన మహత్వపూర్ణ సిద్ధాంతాల శిక్షణ ఈ పుణ్యప్రక్రియ ద్వారా మాత్రమే చక్కగా అందించబడుతుంది.

సంస్కృతమునందున్న 'యజ్' అనే ధాతువునుండి యజ్ఞమనే శబ్దము పుట్టింది. దానికి మూడు అర్థాలున్నాయి. 1. దేవత్వము 2. సంఘటన 3. దానము. ఈ మూడు ప్రవృత్తులు వ్యక్తి మరియు సమాజమును ఉన్నతదిశ వైపుకు నడిపించే ప్రవాహాలు.

**దేవత్వమునకు అర్థము–పరిష్కృత వ్యక్తిత్వము, దైవీ సద్గుణములు**

**సంఘటనకు అర్థము–ఐక్యమత్యము, సహకారాన్నందిచుకొనుట, కలసిమెలసి పని చేయుట**

**దానమునకు అర్థము–సమాజపరాయణత, విశ్వకుటుంబ భావన, ఉదారమైన సహృదయత.**

ఈ మూడు ప్రవృత్తులకు యజ్ఞము ప్రాతినిథ్యము వహిస్తుంది. యజ్ఞము ఈ ప్రతిపాదనల యొక్క జ్వలించే ధవళధ్వజ రూపముగా చెప్పబడింది. జ్ఞాన యజ్ఞము యొక్క ఎర్రకాగడాను ఈ యజ్ఞాగ్నికి ప్రతినిథిగా భావించాలి. విచారక్రాంతి ఋతుంభరా ప్రజ్ఞగానూ, గాయత్రి యొక్క ప్రాణప్రతిష్టగానూ చెప్పబడింది. యజ్ఞ అభియానములో సద్భావనలు, సత్కర్మల రూపంలో పరిణితి చెందించే ప్రేరణలున్నాయి. జ్ఞానము, సత్కర్మ సమన్వయమే ప్రగతికి ఆధారము. సత్కర్మలను తపస్సని, సద్జ్ఞానాన్ని యోగమని చెప్తారు. ఈ రెండూ ఆత్మిక ప్రగతికి ఆధారాలు. భౌతిక ప్రగతికి కూడా శ్రమ, శిక్షణనే ప్రధానముగా అంగీకరించారు. వీని యందు గాయత్రి యజ్ఞము యొక్క సిద్ధాంతాల రూపురేఖలు కనిపిస్తాయి.

జీవితమును యజ్ఞమయముగా భావించేవారే మహాత్ములు. విరాట్ బ్రహ్మకల్పనతో పాటు యజ్ఞావశిష్టాన్ని భుజించవలసినదిగా ఆదేశించారు. ఎవరికీ ఏదీ పెట్టకుండా తినేవాడు దొంగ. దేవతలు యజ్ఞము ద్వారానే దైవత్వమును పొందినట్లుగా కొన్ని సూక్తములు ఉన్నాయి. ఈ ప్రతిపాదనలలో సమాజపరాయణత కొరకు అవసరమైన ప్రేరణ కూడా ఉంది. సంక్షిప్తంగా చెప్పాలంటే యజ్ఞదర్శనము వ్యక్తిగత జీవితములో నిష్ఠాపూర్వక నడవడికను, లోకవ్యవహారమునందు ఆదర్శములను పాటించాలనే ప్రేరణనిస్తుంది. వ్యక్తి మరియు సమాజముల సర్వతోముఖాభివృద్ధికి, సుఖశాంతులకు ఇదే ఏకైక మార్గము.

యజ్ఞమునందున్న సూక్ష్మచేతన, వ్యక్తిని పవిత్రునిగానూ సమాజాన్ని సమర్థవంతముగానూ చేస్తుంది. ఇటువంటి శిక్షణ ఏ ధార్మిక కార్యక్రమములో కూడా సంభవము కాదు. **యజ్ఞాగ్ని నుంచి నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి.**

1. **ఎల్లప్పుడూ తలెత్తుకునే ఉండండి. ఎలాంటి ఒత్తిడికైనా తల వంచవద్దు.**
2. **ఏది సంపర్కములోకి వచ్చానా దానిని తనతో సమానముగా తయారుచేయాలి.**
3. **ఏది లభించినా దానిని కూడబెట్టుకోకుండా విశ్వమంతటికీ పంచిపెట్టాలి.**
4. **తన అస్తిత్వములో వేడిని, వెలుగునూ తగ్గకుండా ఉంచుకోవాలి.**
5. **తన సామర్థ్యాన్ని లోకహితమునకు వినియోగించాలి.**

ఋగ్వేదముననుసరించి యజ్ఞాగ్ని ఈశ్వరునిచే ప్రేరేపించబడిన పురోహితుడు. ఆయన తన వాణి మూగబోయినా తన విధుల ద్వారా అందరికీ సమగ్రమగు ప్రగతిని, సుఖశాంతులను ఇస్తాడు. ఈ ఐదు విభూతుల గొప్పతనాన్ని అర్థము చేసుకొని ఆ ప్రేరణలను నిత్యజీవితములో ఆచరించడమనే లోకశిక్షణ సరిగ్గా ఇవ్వగలిగే మానవునిలో దైవత్వము ఉదయించి పృథ్వీమీద స్వర్గావతరణ జరిగి ప్రాచీనకాలమందున్న సత్యయుగవాతావరణము, అటువంటి పరిస్థితులు తిరిగి ఉత్పన్నమౌతాయి.

*గురుదేవుల వాఙ్మయం నుండి*

*– అనువాదం : శ్రీమతి వల్లీ శ్రీనివాస్*

తప్పును ఒప్పుకోవడం గొప్ప సాహసమే.

# యోగసాధనయే ఉజ్జ్వల భవిష్యత్తు తీసుకువస్తుంది

21వ శతాబ్ది ప్రారంభం ఒక నవయుగానికి కూడా ఆరంభం. ఈ నవయుగం సంభావనల (కల్పనల) యుగం. అనేక సుఖ ప్రదములైన కల్పనలు ఆకారాన్ని సంతరించుకుంటాయి. ఆ విధంగా అవి ప్రత్యక్షమైనప్పుడు మానవజాతికి ఉజ్జ్వల భవిష్యత్తు కలుగుతుందనటంలో సందేహం లేదు. కాని అది ఎప్పుడు జరుగుతుంది అంటే అవకాశాలను చక్కగా సద్వినియోగం చేసుకున్నప్పుడు. ప్రస్తుతం మన ముందున్న ప్రశ్న మనం ఏమి చేయాలి? ఎలా చేయాలి? ఈ ప్రశ్నలకు అర్థవంతమైన సమాధానాలు మన గత అనుభవాలనుండి లభిస్తాయి.

20వ శతాబ్దం మనం పొందిన ప్రయోజనాల దృష్టిలో ఎంత మాత్రం తక్కువ కాదు. విజ్ఞానం ఈ శతాబ్దంలో బాల్యావస్థను గడిపి తరుణావస్థను పొందింది. అంతరిక్షయాత్రలు ఈ శతాబ్దంలోనే జరిగాయి. దాంతో పాటు రెండు ప్రపంచయుద్ధాలు, కొన్ని వందల చిన్న చిన్న యుద్ధాలు ఈ శతాబ్దంలోనే జరిగినాయి. ఇది మన వారసత్వసంపద. దీన్ని చేతబట్టుకుని మనం 21 శతాబ్దంలో అడుగు పెడుతున్నాం. దీనిలో హిరోషిమా, నాగసాకీల ఆక్రందనాలు కూడా కలగలసి ఉన్నాయి. భవిష్య నిర్మాణం కొరకు మనం గతాన్ని మరిచపోకూడదు. గతంలో మనం చేసిన తప్పులను సరిదిద్దుకుంటేనే సార్థకమైన భవిష్య నిర్మాణం జరుగుతుంది.

గతంలో మనం చేసిన అన్నింటికన్న పెద్ద తప్పు. మనిషి తనను తాను కోల్పోవటం. జడపదార్థాల మధ్య నలిగి మానవ చేతన కూడా జడమైపోయింది. ఈ జడత్వం కారణంగా ఒకరిద్దరు కాదు, మానవజాతి సామూహికంగా జడపదార్థంగా మారిపోయింది. ప్రణాళికలు మారిపోతున్నాయి. పద్ధతులు మారిపోతున్నాయి. ప్రభుత్వాలు మారిపోతున్నాయి. కాని సమస్యలు మాత్రం మారటం లేదు. అవి మారనంతవరకూ పరిష్కారం అనేది జరగదు. మానవుడు తాను మారనంత వరకూ, అతడు తన నిజ స్వరూపాన్ని అన్వేషించలేడు. 21వ శతాబ్దంలో మనం ఏ సాధన సంపత్తితో అడుగు పెట్టామో, వాటిని సదుపయోగం చేసుకోవటానికి సాధన చేయాలి. యోగ సాధన ప్రతి ఒక్కరికి 21వ శతాబ్దిలో తప్పనిసరి, సమస్త వ్యాధులను నివారించే ఔషధమది.

యోగసాధనతోనే ఎవరిని వారు సరియైన రీతిలో అర్థం చేసుకోగలరు. ఎప్పుడైతే మన గురించి మనం తెలుసుకుంటామో అప్పుడు మాత్రమే మనకు ఏది ఉపయోగిస్తుంది, ఏది ఉపయోగించదు అనేది అనుభవంలోనికి వస్తుంది. ప్రతి యుగంలోనూ, సంత్‌లు, భక్తులు, మహాపురుషులు ఆకాలంలో మానవునికి హెచ్చరికలు చేసేవారు. విన్నవారు విన్నారు. లేనివారు లేదు. ఇప్పుడున్న స్థితి మిడాస్ రాజు మాదిరిగా, బంగారం పిచ్చిలోపడి మన పిల్ల పావలను, చుట్టు ప్రక్కలను బంధుమిత్రులను కూడా బంగారంగా (జడ పదార్థాలుగా) మార్చివేస్తున్నాం. మనని మనం కూడా! యోగసాధన మొదలుపెడితేనే మరలా మానవునిలో మానవ చేతన నిద్రలేస్తుంది.

యోగసాధన యొక్క తత్వదర్శనాన్ని తెలుసుకుంటేనే మనుష్యుడు తనను తాను పొందగలుగుతాడు. అందువలన తాను కోల్పోయిన శాంతి లభిస్తుంది. యోగసాధనను నిత్య నియమితంగా అభ్యాసం చేస్తుంటే మనుష్యునికి ఆరోగ్యం, సౌందర్యం, ప్రతిభ, విద్య, ఆనందం, సంతోషాల, వరదానం లభిస్తుంది. శాస్త్రవచనాలను బట్టి యోగికి అసంభవమైనదేదీ ఉండదు. అందువల్ల తరలిరండి కదలిరండి, 21వ శతాబ్ది ఉజ్జ్వల భవిష్యత్తును సాకారం చేసుకోటానికి యోగసాధన యొక్క తత్వదర్శనాన్ని హృదయంగమం చేసుకుందాం.

– అనువాదం : శ్రీడి.వి.యన్.బి. విశ్వనాథ్

## శ్రీ గాయత్రీ శతకం

35. భవదు కరుణకు యెవ్వాడు పాత్రుడగునో
వాడు సర్వుల కృపకును పాత్రుడగును
అట్టి ఘనతను చేకూర్చు నందరకును
విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత

*తా:– "ఓ వేదమాతా! నీ కరుణకు ఎవరు పాత్రుడవుతాడో అతడు అందరి దయకునూ పాత్రుడవుతాడు" అటువంటి గొప్పతనాన్ని సాధకులందరికి చేకూరుస్తుంది గాయత్రీ మాత.*

*36.* ఉపనిషత్తులు, వేదాలు, యోగవిద్య
శృతులు, ఇతిహాస సారముల్, హితవులెన్నొ
యున్న మంత్రమున్ పఠియింప ఓర్మినిచ్చు
విశ్వజనయిత్రి గాయత్రి వేదమాత

*తా:– ఉపనిషత్తుల సారం, వేదాల మర్మం, యోగవిద్య విషయములు, శృతుల ధర్మములు, రామాయణ భారత భాగవతాది ఇతిహాసల సారం, మరెన్నో హితోపదేశములు... ఇవన్నీ కలిగియున్న గాయత్రీ మంత్రమును జపిస్తుంటే సహన గుణాన్ని అలవరచి సాధకుని సజ్జనునిగా తీర్చుదిద్దుతుంది వేతమాత.*

రచన : సహజ కవి, సాహిత్య రత్న,
శతక చతురానన, పద్య కవితాసుధానిధి
శ్రీ అయినాల మల్లేశ్వర రావు

**జ్ఞానాన్ని మించిన పెట్టుబడి లేదు.**

# సర్వ పాపాలను నశింపజేసే వృక్షరాజము-రావిచెట్టు

**'అశ్వత్థః సర్వవృక్షాణాం** – అనగా సమస్త వృక్షజాతిలో నేను అశ్వత్థవృక్ష రూపంలో ఉన్నాను' అని గీతాకారుడైన శ్రీకృష్ణ భగవానుడు వచించినదానినిబట్టి అశ్వత్థవృక్షం యొక్క ప్రాముఖ్యత, మహత్యం ఎంతటివో మనకు వెల్లడి అవుతుంది. వృక్షజగత్తులో అశ్వత్థవృక్షం సర్వశ్రేష్ఠమైనది. అందుచేత శ్రీకృష్ణ భగవానుడు స్వయంగా తనను ఆ వృక్షంతో సమానమని చెప్పటమేగాక, ఆ వృక్షం యొక్క దైవత్వాన్ని, దివ్యత్వాన్ని వెల్లడించాడు. దీనియొక్క స్పర్శ ఎంతో సాత్త్వికంగా ఉండి, మానవుని అంత:చేతనత్వాన్ని పులకింప చేస్తుంది. అందుచేత ఏ కాలములోనైనా భారతీయ జనజీవనంలో విశేషంగా పూజనీయమైన ఈ అశ్వత్థవృక్షం నిస్సందేహంగా దేవవృక్షమే!

శాస్త్రాలలో అశ్వత్థవృక్షం అనగా రావిచెట్టుకు 'ప్రత్యక్షదైవ' మనే పేరు పెట్టబడివుంది. అంతేకాదు, ఈ వృక్షం యొక్క మాహాత్మ్యము గురించి ఎంతో ప్రస్తుతించబడినది. స్కందపురాణంలో అశ్వత్థవృక్షంయొక్క మొదలులో–విష్ణువు, కాండంలో – కేశవుడు, కొమ్మలలో–నారాయణుడు, ఆకులలో – శ్రీహరి, ఫలాలలో సకలదేవతా సహితంగా అచ్యుతుడు ఎల్లవేళలా నివసిస్తూవుంటారని వర్ణించబడినది. నిజానికి ఈ వృక్షం శ్రీమహావిష్ణువు యొక్క సంపూర్ణమైన, జీవంతమైన ప్రతిరూపం. దీని నీడలో నివసించుటవలన మానవుని సమస్త మనోరథాలు ఈడేరగలవు. అందుచేతనే ధార్మికగ్రంథాలలో

**అశ్వత్థః పూజితో యత్ర పూజితాః సర్వదేవతాః** అని చెప్పబడింది.

*(బృహస్తోత్రరత్నాకరము–అశ్వత్థస్తోత్రం–30).*

రావిచెట్టును విధిపూర్వకంగా పూజించుటచే సమస్త దేవతలనూ కూడా పూజించినట్లు అవుతుంది. అశ్వత్థ స్తోత్రంలో రావిచెట్టును ప్రార్థించటానికి ఈ క్రింది మంత్రం ఇవ్వబడింది.

**అశ్వత్థ సుమహాభాగ సుభగ ప్రియదర్శన్ ।**
**ఇష్టకామాంశ్చ మే దేహి శత్రుభ్యస్తు పరాభవమ్ ।**

**ఆయుః ప్రజాం ధనం ధాన్యం సౌభాగ్యం సర్వసంపదం ।**
**దేహి దేవ మహావృక్ష త్వామహం శరణం గతః ॥**

*(బృహస్తోత్రరత్నాకరము–అశ్వత్థస్తోత్రం–18, 19)*

పై మంత్రాన్ని విధిపూర్వకంగా చదివినా, జపించినా శత్రువులు నశిస్తారు. ధనసంపదలు, సౌభాగ్యం కలిగి జనులు సౌఖ్యంగా ఉండగలరు.

భారతీయ జ్యోతిష సిద్ధాంతం ప్రకారం బృహస్పతి ప్రతికూలంగా ఉండటంవల్ల కలిగే అశుభ ఫలితాలు రావిచెట్టు యొక్క సమిధలతో హవనం చేయడం వల్ల తొలగిపోతాయి. అందుచేత యజ్ఞప్రక్రియలో రావిచెట్టు యొక్క సమిధ ఎంతో ఉపయోగకరమైనదిగా, మహత్త్వపూర్ణమైనదిగా భావించ బడుతున్నది. అథర్వణవేదానికి ఉపవేదమైన ఆయుర్వేదంలో రావిచెట్టుకున్న ఔషధీయగుణాలను గురించి ఎంతో వివరంగా వర్ణించబడివుంది. కొన్నిరకాల వ్యాధులకు చేసే చికిత్సలో రావిచెట్టుయొక్క విభిన్న భాగాలను ఉపయోగిస్తారు. ఈ వృక్ష భాగాలను ఉపయోగించి అసాధ్యమైన కొన్ని రోగాలకు చికిత్స చేయుట సాధ్యమే! జాతకరీత్యా ప్రబలమైన వైధవ్యయోగమున్న కన్య 'అశ్వత్థవ్రత' అనుష్ఠానం చేసినట్లయితే ఈ దోషం తొలగి అఖండ సౌభాగ్యవతిగా మనగలదని తెలియజేయబడినది.

సుప్రసిద్ధ గ్రంథమైన వ్రతరాజమనే పుస్తకంలో అశ్వత్థోపాసన అనే ప్రకరణంలో ఈ వృక్షం యొక్క మహిమను వర్ణిస్తూ అథర్వ ఋషి పిప్పలాదమునితో, 'ప్రాచీనకాలలో రాక్షసుల అత్యాచారాలతో పీడింపబడిన దేవతలందరూ కలసి విష్ణుభగవానుడిని శరణుజొచ్చి తమకు కష్టములనుండి విముక్తి లభించే ఉపాయాన్ని చెప్పమని వేడుకొనగా, శ్రీమహావిష్ణువు 'నేను అశ్వత్థవృక్షరూపంలో ఈ భూమిపైన ప్రత్యక్షంగా వెలసియున్నాను. మీరందరూ అన్నివిధాలుగా ఈ వృక్షాన్ని పూజించి అర్చించవలసింది' అని వివరించినట్లుగా చెప్పారు. శౌనకమహర్షి 'అశ్వత్థోపనయనము' అనే వ్రతవిధానాన్ని గురించి చెబుతూ 'పురుషుడు ఏదైనా ఒక శుభముహూర్తంలో అశ్వత్థవృక్షాన్ని నాటి, దానిని 8 సంవత్సరములపాటు పుత్రుని వలె పోషించి పెంచాలి. తర్వాత దానికి ఉపనయన సంస్కారం గావించి, నిత్యమూ యథావిధిగా పూజించితే, లక్ష్మి అక్షయంగా సిద్ధిస్తుందని, రావిచెట్టును నాటేవారి వంశపరంపర ఎన్నడూ నశించదని, ఈ రావిచెట్టుకు సేవ చేసే వ్యక్తి పితృగతమైన ఋణం వలన కలిగే నరకాన్నుండి విముక్తి లభించి సద్గతిని పొందగలడని శౌనకమహర్షి చెప్పారు. రావిచెట్టును నాటుటచే అక్షయమైన పుణ్యం లభిస్తుంది అని శాస్త్రములు ఘోషిస్తున్నాయి. రావిచెట్టును నాటి పోషించిన వ్యక్తికి ఇహలోకంలో సుఖసౌఖ్యాలు, మరణానంతరం శ్రీహరి సాన్నిధ్యం లభిస్తుంది. రావిచెట్టును పూజించడంవలన యమలోకంలో వేసే దారుణమైన శిక్షల

**[redacted]ంటే ఎన్ని అడ్డంకులు ఉన్నా లక్ష్యాన్ని సాధించడమే.**

ననుభవించడం తప్పుతుంది. ఏరకమైన అవసరమూ లేనప్పుడూ ఈ వృక్షాన్ని నరకటం పితృదేవతలను నరకటంతో సమానమని శాస్త్రాలు ఉద్ఘాటిస్తున్నాయి. ఇలా చేయటం వల్ల వంశహాని జరుగుతుంది. ప్రతిరోజూ రావిచెట్టుకు ముమ్మారు ప్రదక్షిణ చేసి దానికి నీరుపోయడం వల్ల దుఖం, దారిద్ర్యం, దౌర్భాగ్యం నివారింపబడతాయి, నియమంగా పూజించే వ్యక్తికి సమృద్ధి, దీర్ఘాయుర్దాయం లభిస్తాయి.

శనివారంనాడు రావిచెట్టును స్పృశించి, పూజచేసి, ఏడు ప్రదక్షిణలు చేసిన తరువాత ఆవనూనె దీపం దానమివ్వడం వలన శనిపీడ పోతుంది. **'పిప్పలాశ్రయ సంస్థితాయనమః'** అనే మంత్రంతో శనిని స్తుతించి జపం చేయాలి. పైన చెప్పిన మంత్రం ద్వారా శని రావిచెట్టును ఆశ్రయించి ఉంటాడనే వాస్తవం నిరూపించబడుతున్నది. శనివారంనాడు వచ్చే అమావాస్యనాడు శనిని పూజించడం సర్వశ్రేష్ఠం. ఈరోజు విశేష యోగ సమయంలో రావిచెట్టుకు పూజచేసి ఏడు ప్రదక్షిణలు చేసి పడమరముఖంగా నిలబడి నల్ల నువ్వులతో కూడిన ఆవనూనెతో దీపాన్ని వెలిగించి దానమియ్యడం వలన శని వలన కలిగే బాధలు ఉపశమించగలవు. అమావాస్య శనివారం, అనూరాధా నక్షత్రంతో కూడి వచ్చినప్పుడు రావిచెట్టును యథావిధిగా పూజించడం వలన శని ప్రకోపం తొలగుతుంది. ఈ దినం శ్రాద్ధ కర్మ జరపడం వలన పితృదోషాలు శాంతిస్తాయి. అమావాస్యతో ముగిసే శ్రావణమాసంలో శనివారంనాడు రావిచెట్టు క్రింద హనుమంతుని ప్రతిమను ఉంచి అర్చించడం వలన ఎంతో పెద్దపెద్ద కష్టాలు కూడా తొలగిపోతాయి. రావిచెట్టును బ్రహ్మయొక్క స్థానంగా కూడా భావించవలెను.

రావిచెట్టు వాతావరణంలోని మలినాలను తొలగించి శుభ్రపరచడంలో కూడా ముఖ్యమైన పాత్ర వహిస్తున్నది. ఈ వృక్షం ఇతర వృక్షాలకన్నా ఎంతో అధిక మొత్తంలో ఆక్సిజన్‌వాయువును వాతావరణంలోకి విడుదల చేస్తుంది. తద్వారా కలుషితమైన గాలిని పరిశుభ్రం చేస్తుంది. ఇంతేకాక, ఈ వృక్షం తన చుట్టుప్రక్కల వాతావరణంలో సాత్త్వికతను వృద్ధిచేస్తుంది. దీని సంపర్కంలోనికి, సాన్నిధ్యంలోనికి రాగానే మన మనస్సులు హర్షపులకాంకితమౌతాయి. అందువల్లనే ఈ వృక్షం క్రింద చేసే ధ్యానానికి, జపానికి అధికమైన ప్రాముఖ్యత ఇవ్వబడింది. ఈ వాస్తవం శ్రీమద్భాగవత మహాపురాణంలో(3/4/8)లో చాలా స్పష్టంగా తెలియజేయబడినది. ద్వాపరయుగంలో శ్రీకృష్ణభగవానుడు పరమధామాన్ని చేరుకునేముందు ఈ దివ్యమైన పవిత్రమైన వృక్షం క్రింద కూర్చుని ధ్యానస్థులయ్యారు. కలియుగంలో బుద్ధభగవానుడు కూడా బుద్ధగయలో రావిచెట్టు క్రింద కూర్చుని బుద్ధత్వాన్ని పొందినట్లుగా చెప్పబడింది. అందువల్లనే ఈ చెట్టును 'బోధి వృక్షం' అంటారు.

రావిచెట్టుకున్న ధార్మిక, ఆయుర్వేదిక ప్రాముఖ్యత అందరికీ పరిచయమే. దీనికున్నా ఆధ్యాత్మిక రహస్యం కూడా చాలా లోతైనదీ, విస్తృతమైనదీకూడా. ఈ చెట్టుయొక్క ప్రభావం మన మనస్సు, శరీరం మీదనే కాదు, మన భావజగత్తునుకూడా కుదిపివేస్తుంది. ఈ విషయం పైన విజ్ఞానపరమైన అన్వేషణలు, పరిశోధనలు చాలా స్వల్పంగానే జరిగాయి. కానీ వాటిద్వారా ఈ వృక్షం మానవ చేతనత్వాన్ని ఏవిధంగా ప్రభావితం చేస్తుందీ అనే అంశం తెలుసుకునే ప్రయత్నం జరిగింది. ఈ ప్రయత్నంలో ఈ వృక్షం చుట్టూ పరిసర ప్రాంతాలలో ఋణాత్మక ఆయానులు (Negative Ions) ఎక్కువగా ఉన్నవనే విషయం మాత్రం తెలుసుకోబడినది. ఈ ఋణాత్మక ఆయానాలు మన మనస్సుకు, భావాలకు శాంతిని ప్రసాదిస్తాయి. ఈ సత్యం మన పూర్వులకు బాగా తెలుసు.

రావిచెట్టుకున్న ఈ సమస్త ప్రత్యేకతలను దృష్టిలో ఉంచుకునే మన ఋషులు, మునులు దీనియొక్క బహుముఖమైన ఉపయోగాలకు ప్రాధాన్యత నిచ్చారు. సర్వపాపనాశకరమైన ఈ వృక్షరాజు తనను ఆరాధించిన వ్యక్తి యొక్క మనోరథాలను తప్పకుండా నెరవేరుస్తాడు. ఈ చెట్టుకున్న దివ్యగుణాలు ఈ వృక్షాన్ని భూమిపై కల్పవృక్షం స్థాయిలో నిలబెట్టింది. అందుచేత ఈ వృక్షాన్ని నాటి సంరక్షించడమనేది తప్పనిసరిగా చెయ్యాలి. ఈ వృక్షాన్ని నాటి మనం కూడా ఆ పుణ్యంలో పాలు పంచుకుందాం, తద్వారా పచ్చదనాన్ని అభివృద్ధిచెం దించటానికి మన వంతు సహకారాన్ని అందిద్దాం.

*– అఖండజ్యోతి మార్చి 2005*

*– అనువాదం : శ్రీమతి కృష్ణకుమారి*

## పాఠకులకు ఆహ్వానం

- *"యుగశక్తి గాయత్రి" పత్రికలోని శీర్షికలు, అంశాలను గూర్చి పాఠకుల నుండి అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాం.*
- *పాఠకులు పోస్టు కార్డు పై పది వాక్యాలకు మించకుండా వ్రాసి ప్రతినెలా 10వ తేదీలోగా పంపించాలి.*
- *ఎంపికైన లేఖలు, స్థలాన్ని బట్టి ప్రచురించగలం.*
- *ఎంపిక విషయంలో సంపాదకమండలిదే తుది నిర్ణయం.*

**ఆత్మ నిర్మాణమే అదృష్ట నిర్మాణము.**

## నావారితో నామాట : 2011 - 2012 జన్మ శతాబ్ది సంవత్సరం

# ఇంకా 131 రోజులు మాత్రమే ఉన్నాయి

### యుగము పిలుస్తోంది, యుగసేనానులారా లేవండి మహాపర్వమునకు మనమందరమూ కలిసి ఆహ్వానం పలుకుదాము

శతాబ్ది సంవత్సరములో ఏమి జరగబోతోంది, ఈ విషయమును గురించి రెండు ప్రాంతీయ కార్యక్రమాల గురించి గత సంచికలో మీరు చదివారు. శరన్నవరాత్రుల పుణ్యసమయాన ఈ శరదృతువులో చేయవలసిన కార్యక్రమము గురించి తెలుసుకుందాము. శతాబ్ది సమారోహము ఎలా చేయాలి. ఎవరు ఏ పాత్ర తీసుకుంటున్నారు? కార్యక్రమ వివరాలు వివరంగా తెలుసుకోండి.

### శుభారంభము

వసంతపంచమి పూజ్యగురుదేవుల జన్మదినము (ఆధ్యాత్మిక) నకు సంబంధించి అన్ని విషయాలు తెలుసుకొని ఉంటారు. ఈ కార్యక్రమాలు 2011 ఫిబ్రవరి 6 నుండి 8 తేదీలలో సంపూర్ణ భారతదేశములోనేకాక, విశ్వమంతటా జరుగుతాయి. ఆ రోజున ఆయనకు ఆయన గురువు సాక్షాత్కరించి గత జన్మల జ్ఞానమును తెలిపిన రోజు. ఆ రోజున మనమందరమూ ఆయనకు సమర్పితులమై ఆయన నిర్దేశాలను అనుసరించి నడవాలనే సంకల్పం మరల తీసుకోవాలి. 1990 తరువాత ఒక వైజ్ఞానికుల పెద్ద సమూహము ఒకటి మనతో కలిసింది. ఆదివారము, సోమవారము, మంగళవారము (6,7,8 ఫిబ్రవరి 2011)లలో జరిగే ఈ కార్యక్రమాలకు మనమంతా అందరిని పాలుపంచుకోవాలని ఆహ్వానించాలి.

### ఢిల్లీలో జరిగే కార్యక్రమ స్వరూపము

ఫిబ్రవరి 20న కేంద్రము ద్వారా జరిగే ఈ కార్యక్రమము ఢిల్లీ మరియు నేషనల్ క్యాపిటల్ రీజియన్ సహకారంతో జరుగుతుంది. స్థల నిర్ణయము జరిగిన తరువాత అందరికీ ఆహ్వాన పత్రికలు పంపటం జరుగుతుంది. దేశరాజధానిలో జరుగుతున్న ఈ ఉద్ఘోష 2011 నుండి 2020 వరకు జరిగే మిషన్ కార్యక్రమాన్నింటినీ హైలైట్ చేస్తుంది. కార్యక్రమం జరిగే స్థలమునందు పెద్ద ఎల్.సి.డి. స్క్రీన్ల ద్వారా చూడవచ్చు. అన్ని ఛానెల్స్ ద్వారా కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. కామన్‌వెల్త్ క్రీడలు పూర్తికాగానే స్థల నిర్ణయము జరుగుతుంది. దానికి ముందుగా పరిజనులు కొన్ని పనులు చేయాలి. అవి ఏమిటంటే

1. పరిజనులంతా కలిసి తమతమ ప్రాంతాలలో సంవత్సరానికి లక్ష్యములను నిర్ధారించుకోవాలి. లక్ష్యములను ఫిబ్రవరి కార్యక్రమములో సభాముఖంగా ప్రకటించాలి.

2. గ్రామీణ క్షేత్రములయందు పర్యటిస్తున్న మన పరిజనులు మద్యపాన నిషేధము, వృక్షారోపణ కార్యక్రమాలలో అత్యధిక భాగస్వామ్యం తీసుకోవాలి. తమతమ క్షేత్రాలలో ఈ కార్యక్రమాలు చేసి ఎంత ప్రగతిని సాధించారో తెలియపరిచే కరపత్రాలు అచ్చువేయించి వాటిని పంచుకుంటూ జ్ఞానరథయాత్ర చేసుకుంటూ రోడ్డు మార్గము ద్వారా నిర్ధారిత ప్రాంతానికి చేరుకోవాలి.

3. ఇప్పుడు కేవలము ఢిల్లీ ప్రాంతం వారిని మాత్రమే ఆహ్వానించడము జరుగుతున్నది. ఎందుచేతనంటే మిగిలిన వారికి వారి వారి కార్యక్రమాలు వారికి అప్పగించబడ్డాయి. అంతేకాక స్థలసామర్థ్యము, దానితోపాటే చేయవలసిన వ్యవస్థల కారణంగా దేశం మొత్తాన్ని ఢిల్లీకి ఆహ్వానించమనేది సాధ్యం కాదు.

4. ఢిల్లీని జాగృతపరచడమో లేక ఢిల్లీ నుండి ర్యాలీలను నడిపి హడావిడి చేయడమో మన లక్ష్యము కాదు. ఢిల్లీలో ఎక్కువగా రైతుల సదస్సులు, రాజకీయపార్టీల ర్యాలీలు జరుగుతుంటాయి. ఢిల్లీలో నిద్రపోయే శ్రీమంతులపైన కానీ, చదువుకున్న వర్గముగా చెప్పబడే వారి మీద కానీ ఈ ప్రభావము ఉండదు. మన లక్ష్యము వేరు. మన జ్ఞానరథాలలో జాగృతియాత్ర చేసే పరిజనులందరూ ఫిబ్రవరి 6,7,8 తేదీలలో ఇక్కడ ఢిల్లిలో జరిగే కార్యక్రమం అవగానే వెళ్ళి మళ్ళీ వారి వారి స్వస్థానం చేరుకుంటారు.

5. ఢిల్లీ మరియు ఎన్.సి.ఆర్ వారు ఇక్కడ జరిగే కార్యక్రమాలలో ప్రధానభూమిక నిర్వహిస్తారు. ఈ నెల నుండే విశేషప్రచార కార్యక్రమం ప్రారంభమౌతుంది. ఇది అక్టోబరు 2010 నుండి ఫిబ్రవరి 2011 వరకు జరుగుతోంది. ఢిల్లీలోని ఎన్.సి.ఆర్ కి చెంది విద్యాలయాలు, మందిరాలు, సమితులు, మన ఆలోచనాధారతో కలిసిన సంఘటలన్నింటితో మనము సంపర్కము స్థాపించుకొని ఢిల్లీలో జనజాగరణ కార్యక్రమము విస్తృతంగా చేస్తాము. మీరట్ నుండి గురుగావ్ వరకు స్థాపించిన విద్యాలయ క్షేత్రాలు, ఫరీదాబాద్ నుండి సోనీపత్ వరకు గల క్షేత్రాలన్నింటి లోనూ, ఢిల్లీలోని వాడవాడలయందు తీవ్రమైన ప్రచారము చేయబడుతుంది.

[redacted] నీవు పొగిడే వ్యక్తి గుణాలను అలవర్చుకో.

6. యుగప్రవక్తలుగా, సంస్కృతిని ప్రధానంగా ప్రచారం చేసేవారంతా శాంతికుజ్ కేంద్రములోని జన్మశతాబ్ది కార్యక్రమాలకు వచ్చి సంపర్కము ఏర్పరుచుకొని తాము చేయగల కార్యముల గురించి తెలియపరిస్తే వారిని ఆ కార్యముల కొరకు ఉపయోగించుకునేందుకు అవకాశముంటుంది. వీధివీధి యందు చిన్న చిన్న సభలు ఏర్పాటు చేసి జనచేతనను జాగృతము చేయాలి. ఢిల్లీ కార్యక్రమము కొరకు నియమిత సమావేశములు నిర్వహించేందుకు ఒక సమితి ఏర్పాటుచేయబడింది.

### పునాది రాళ్ళకు అభినందన

ఈ సంవత్సరము ఒక విశేష అభియానము చేయాలని సంకల్పించాము. మిషన్‌కి పునాదిరాళ్ళ వలె కృషి చేసిన వారిని, మౌనంగా సాధన చేసే వారిని ఢిల్లీలో కానీ, క్షేత్రియ కార్యక్రమంలో కానీ, హరిద్వార్‌లో జరిగే పెద్ద కార్యక్రమంలో కానీ అభినందించడం జరుగుతుంది. వారు గురుసత్తాతో కలిసి నడుస్తూ మన యాత్రను విరాట్ యాత్రగా మార్చారు. వారిని శతాబ్ది సంవత్సరంలో సన్మానించాలి. సమాజములోని విభిన్న క్షేత్రాలలో విశేష కృషి చేసి పరివర్తన తీసుకురావడములో సఫలీకృతులైనారో వారిని క్షేత్రస్థాయిలో సన్మానించి గౌరవించాలి. జూలై 26, 2010 ఇండియా టుడే ఇంగ్లీషు (28 జూలై హిందీ) పత్రికలో 'కర్మవీర్ కీ కహానీ' ప్రశంసనీయ కార్యములు చేసి విజయము సాధించిన 36 మంది వ్యక్తుల కథలు ప్రచురించారు. అని, 'ఏదైనా సాధించగలిగే సామర్థ్యమున్న వారి కాంతులీనే ముఖాలు' అని వాటికి శీర్షికనిచ్చారు. మేము అటువంటి కర్మవీరుల కొరకు వెతుకుతున్నాము, వారిని శతాబ్ది సంవత్సరములో యుగనిర్మాణ ఆలోచనా ధారతో కలుపుకోవాలి.

### మీడియా ఏర్పాట్లు

మీడియా కొరకు ఒక పూర్తి ప్రాజెక్ట్ చేతిలోకి తీసుకున్నాము. ప్రముఖ ఛానెల్స్‌ని, న్యూస్ ఛానెల్స్‌కు అద్దె చెల్లించి ప్రతిరోజూ ఒకటి నుండి రెండు గంటల పాటు ప్రతిరోజూ ప్రసారము చేసే విధముగా మాట్లాడాము. అందులో పరమపూజ్య గురుదేవుల ఆలోచనా పరివర్తన యోజన, ఆయన జీవనదర్శనము, ఆయన విజన్ (దూరదృష్టి) మొదలైన వాటి గురించి చెప్పటం జరుగుతుంది. ఈ కార్యక్రమము డిసెంబరు 2010 నుండి లేదా 2011 ప్రారంభము నుండి కానీ మొదలౌతుంది. మన పరిజనులు తమ తమ ప్రాంతాలలో ఇదే విధమైన కార్యక్రమాలను కేబుల్ టి.విలో ప్రసారం చేసే ఏర్పాటు చేసుకోవాలి. గురుదేవుల జ్ఞాన శరీరమును గురించి అందరికీ స్పష్టంగా, అధికాధికంగా చూపించడమే (హైలెట్) మన లక్ష్యము. మీడియాలో ఇవన్నీ సంవత్సరం అంతా ప్రసారమౌతాయి.

### ఘనంగా సాధనాత్మక మంత్రలేఖనము

మంత్రలేఖన కార్యక్రమమును గొప్పగా చేయాలని సమితి నిర్ణయించింది. దీనిని సమితి నిర్ణయించిన సమయము లోపలే పూర్తిచేయాలి. దీనితోపాటు విశిష్టమైన తపస్సు కూడా జోడింపబడుతుంది. మొత్తము 40 రోజులలో మంత్రలేఖనము పూర్తిచేసి నిర్ధారిత అంశదానమును కూడా ఈ పుస్తకాలతో పాటు పంపాలి. ఇది విశేష పుణ్యమునిచ్చే ఆధ్యాత్మిక కార్యక్రమము. ఈ గాయత్రీమంత్రలేఖన కార్యక్రమం మార్చి 2, 2011 నుండి ప్రారంభమై ఏప్రిల్ 12 శ్రీరామనవమి వరకు జరుగుతుంది. ఈ విశిష్ట మంత్రలేఖనాలను నవంబరు 2011లో హరిద్వార్‌లో జరిగే కార్యక్రమములో ఒక ప్రత్యేక స్థానములో ఉంచుతారు. దీనికి ప్రతిరోజూ ప్రదక్షిణ చేసి హారతి ఇచ్చే కార్యక్రమము జరుగుతుంది. గాయత్రీజయంతి మరియు గురుపూర్ణిమ రోజులలో పరిజనులు ఈ సాధనాత్మక పురుషార్థమును దర్శించుకోవచ్చు. తరువాత శాంతికుంజ్‌లోని ఒక విశేషమైన స్థానంలో ఒక శక్తి పుంజము రూపంలో దీనిని స్థాపిస్తారు. ఇందులో ఎవరైనా భాగస్వామ్యము తీసుకోవచ్చు. దీనిని గురించి మరిన్ని వివరాలు ప్రజ్ఞాఅభియాన్ పక్షపత్రికలో చూడవచ్చు.

### ముఖ్య కార్యక్రమము గంగ ఒడిలోనే

హరిద్వార్ జరుపబడే జన్మశతాబ్ది ముఖ్య కార్యక్రమము గంగ యొక్క హృదయస్థానములో పూర్తి చేయబడుతుంది. హరిద్వార్ పట్టణములోనూ, అక్కడి నుండి ఋషికేశ్ మార్గములోనూ, ఢిల్లీ–నజీబాబాద్ మార్గములోనూ నగరనిర్మాణము జరుగుతుంది. 2011 నవంబరు 8వ తేదీ నుండి నవంబరు 11వ తేదీ వరకు ఈ కార్యక్రమము జరుగుతుంది. నవంబరు 8వ తేదీన కలశయాత్ర జరుగుతుంది. తరువాత నవంబరు 10 రాత్రికి 24 లక్షల విరాట్‌దీపమహాయజ్ఞము నిర్వహించబడుతుంది. ఆ రోజు గురునానక్ జయంతి కూడా. నవంబరు 11వ తేదీ ఉదయము నుండి మధ్యాహ్నము వరకు పూర్ణాహుతి కార్యక్రమము పూర్తి చేయబడుతుంది. ఆ తరువాత అందరూ వారివారి స్థానాలకు వెళ్ళిపోవచ్చు.

### అన్ని ప్రాంతాలనుండి విశేషమైన ఊరే గింపు బయలుదేరుతాయి

మహాకుంభము యొక్క మహాపర్వదినము సందర్భంగా జనవరి 2010 నుండి ఫిబ్రవరి చివరి వరకు విభిన్న ప్రాంతాల ఊరేగింపులు జరిగాయి. నగరవాసులంతా వీటిని చూశారు, మీడియా దీనిని గురించిన ప్రసారాలను హైలెట్ చేసి చూపించింది. మన మిషన్ ఎంత విశాలమైనది, దీని విరాట్‌శక్తిని గురించి తెలియడము వల్ల ఇక ఎవరికీ సందేహాలుండవు. ఈ

[redacted]జీవన దేవత పరిష్కృత రూపమే కల్పవృక్షం.

ఉద్దేశ్యముతోనే 2011 నంబరు 1 నుండి 6 వరకు విభిన్న ప్రాంతాలలో పొందిన ఫలితాలను ఆ ప్రాంతము యొక్క సాంస్కృతిక విలక్షణతలను అందరికీ చూపించాలని నిర్ణయించడమైనది. 3,4 ప్రాంతాల వారు కలిసి ప్రతిరోజూ ఈ పని నిర్వహిస్తారు. అలా తమ యాత్రను వారు ఏ నగరంలో ఉంటే అక్కడే చేస్తారు. దీనివల్ల అందరూ అన్ని వివరాలను దృశ్య రూపంలో చూడగలుగుతారు. అంతేకాక భారతదేశములో మూలమూలలా ఏం జరుగుతోందో తెలుసుకుంటారు. విదేశాలలో ఉన్న ముఖ్య పరిజనులు, ప్రవాస భారతీయుల చేస్తున్న కార్యక్రమాలు కూడా తెలుసుకుంటారు. భారతీయ సంస్కృతి యొక్క విశ్వరూపము – గాయత్రీమహాశక్తి యొక్క విశ్వరూపము గురించి అందరికీ తెలియపరచబడుతుంది. ఈ ఉద్దేశ్యముతోనే ఒక సూచనా పత్రము తయారుచేయబడుతున్నది. దాని ఆధారముగా అందరూ తమతమ పనులను నిర్ణయించుకొని ప్రారంభించాలి.

### జరిగిన శిబిరములో తీసుకున్న సంకల్పాలు

ఆగష్టు 29,30,31 తేదీలలో ఆహ్వానించబడిన అన్ని ఉపజోనల్ ప్రాంతాల కార్యకర్తలతో ఒక విశేష శిబిరము జరిగింది. ఈ మూడు రోజులూ అందరూ గురుదేవుల అంగ అవయవములుగా వికసించగలిగే శిక్షణ ఇవ్వబడింది. అందరూ శతాబ్దిసమారోహము యొక్క స్వరూపమును అర్థము చేసుకున్నారు, తమతమ బాధ్యతలను కూడా నిర్ధారించుకున్నారు. ఇందులో సమయదానం, అంశదానం, ప్రతిభాదానం మొదలు కొత్త పరిజనులను తయారుచేయుట మరియు అఖండజ్యోతి పత్రికతో పాటు మిగిలిన అన్ని ప్రతికలకు ఎక్కువమంది చందాదారులను చేర్పించుట వంటి సంకల్పాలు తీసుకోవడం జరిగింది. ప్రాణవంతులందరూ ఈ శిబిరానికి వచ్చారు. రానివారికి ఒక ప్రముఖ జోన్ నుండి తీసుకున్న సంకల్పాల వివరాలు పంపించబడతాయి. ఈ కార్యక్రమ సి.డిలు, డి.వి.డిలు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. కార్యక్రమానికి రానివారు తమతమ ప్రాంతాలలోనే తమ తోటివారితో కలిసి ఈ సి.డి.లు విని కూడా సంకల్పములు తీసుకోవచ్చు.

### క్షేత్రీయ మంథన ప్రారంభమైంది

అక్టోబరు మొదటివారములో శాంతికుంజ్‌నుండి 8 టోలీలు బయలుదేరుతున్నాయి. ఇందులో శతాబ్దిపురుషుడు పూజ్య గురుదేవులు, యుగనిర్మాణసత్సంకల్పాలే నవయుగానికి ఆధారశిలలు, సత్యయుగపునరాగమనము అనే విషయాల గురించి రెండురోజుల కార్యక్రమము మరియు వేదీయ దీపమహాయజ్ఞము జరుగుతుంది. ఈ కార్యక్రమాలలో ముఖ్యముగా ధ్యానము వల్ల వచ్చే ఆధ్యాత్మిక, చికిత్సాపరమైన లాభముల మీద, యోగము–ఆయుర్వేదము మీద ఒక విశేషమైన ప్రదర్శన జరుగుతుంది. ఇవి కాకుండా సీనియర్ కేంద్రీయ ప్రతినిధులతో కూడిన 3 టోలీల ఫ్లయింగ్ స్క్వాడ్ క్షేత్రాలలో ప్రచారనిమిత్తం 2010 నవంబరు మూడవ వారములో 45 నుండి 50 రోజుల కార్యక్రమము కొరకై బయలుదేరుతున్నాయి. వీరు క్షేత్రమంతా దాదాపు 60 రోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించి తిరిగి వస్తారు. ప్రజలందరితో మంచి సంబంధము ఏర్పరుచుకొని కార్యక్రమాల గురించి అందరికీ తెలియపరడం అనేది మన లక్ష్యము. తెలివిగలవారు, శ్రీమంతులు, బుద్ధిమంతులతోను, కార్యకర్తల వర్గముతోనూ కలిసి మాట్లాడుతూ సమయసాధన కొరకు సంకల్పితులయ్యేందుకు ప్రయత్నం చేయాలి.

ఇప్పటికి ఇంతవరకే తెలియపరచడమైనది. చదువుకున్నవారు, పరిజనులు అందరూ కలిసి కూర్చొని ఈ విషయముల గురించి చర్చించుకోవాలి. ఈ కార్యక్రమము గురించిన ప్రణాళికను గురించి రాబోయే సంచికలో చదువుతారు.

– *అనువాదం : శ్రీమతి వల్లి శ్రీనివాస్*

## పంచుకుని తిను

*ఏ పశు పక్ష్యాదులైన సరే తాము సంపాదించుకున్న ఆహారాన్ని దొంగలాగా గుట్టుగా తినాలని అనుకోవు. ఆహారం కనుపించగానే అవి వాటి భాషలో సహచరులను పిలుస్తాయి. "కలసి పంచుకు తిందాం" రమ్మని పిలిచే ఆ పిలుపులో ఎంతటి సహకారం దాగి ఉంటుందో మనిషికి అర్థం కాదేమో.*

*మనం ఎక్కడైన ఆహార ధ్యానాలు చల్లితే మొదట చూసిన పక్షి మిగిలిన పక్షులను పిలుస్తుంది. గంతులు వేసే కోతులు కూడా సెనగలు కాని ఏమైనా పెడితే అవి వెంటనే తినటానికి ఉపక్రమించవు. తమ మిత్ర బృందాన్ని పిలుస్తాయి. ఆ పిలుపునందుకుని కోతి మూకలు వచ్చేస్తాయి. మానవుల కంటే హీనమైనవిగా, భావించబడే జీవ జంతువులలో ఉన్న సహకారం మానవులలో బొత్తిగా లేదని సిగ్గుపడకుండా ఒప్పుకోక తప్పదు. కనీసం ఒప్పుకుంటే త్వరలో సరిదిద్దుకుంటాడు. మొసళ్ళు, ఒక రకమైన పక్షులు నదీ తీరాల్లో గుడ్లు పెడుతుంటాయి. అవి కలసిమెలసి గుడ్లను పొదుగుతుంటాయి. తన గుడ్లు, పరాయిగుడ్లు అనే భావం చూపవు. ఒక తల్లి మొసలి మరణిస్తే, మరో తల్లి ఆ పని పూర్తి చేస్తుంది. ఇలా కలిసిమెలసి గుడ్లను పెంచి పోషించడంలో అవి ఎంతో ఆనందాన్ని, సౌకర్యం పొందుతాయి.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**కార్యశీలత లేని జీవితం ఒక గుదిబండ.**

# సద్గురువు మహిమ అనంతమైనది

**పీఛే లాగా జాఈథా, లోక్‌వేద్ కె సాథి ।**
**ఆగే థైం సత గురు మిల్యా, దీపక్ దియా హాథి ॥**
**దీపక్ దియా తేల్ భరి, బాతీ దయీ అఘట్ట ।**
**పూరా కియా బిసాహుణా, బహురిన ఆవాంహట్ట ॥**

తనదైన విశిష్టశైలి మరియు వ్యతిరేకభావనలకు ప్రఖ్యాతి చెందిన సాధువు కబీరు మహాశయుడు, సద్గురువును కలిసినప్పుడు కలిగే అద్భుతమైన సత్ఫలితాలతో కూడిన మార్పును గురించి చర్చిస్తూ "అక్షయమైన వత్తిని వేసి, ఆయుష్షు అనే చమురును నింపి, ఈ శరీరమనే దీపాన్ని గురువే మనకు ప్రసాదించాడు" అని చెప్పారు. కబీరు మహాశయుని సాహిత్యమంతా సద్గురువు యొక్క మహిమలతో నిండి ఉంటుంది. ఎక్కడ చూసినా సమర్పణాభావం కనుపిస్తూ ఉంటుంది.

**సద్గురు కే సరతాప తే మిటిగయా సబ్ దుఃఖ్‌ద్వంద్ ।**
**కహ కబీర్ దువిధా మిటీ, గురు మిలియా రామనంద ॥**

బాధలతో నిండిన ఈ ప్రపంచం నుండి, ద్వంద్వస్థితినుండి, సంశయము, ఆలోచనలనుండి అతనికి విముక్తి కలిగించగల్గిన వ్యక్తి గురువైన రామానందులు ఒక్కరేనని, సద్గురువును పొందిన తాను ఎంతో అదృష్టవంతుడివని భావించాడు కబీరుదాసు. తనను తాను స్వయంగా ఒక ఆదర్శవంతుడైన శిష్యునిగా తీర్చిదిద్దుకుని జీవితాంతమూ శ్రమించి ఈనాటికి మనగలిగినటువంటి ఒక మంచి ఆధ్యాత్మికతత్త్వమును ప్రతిపాదించాడు.

సాధన సఫలీకృతం కావటానికి సద్గురువు యొక్క ప్రాముఖ్యత అన్నింటికన్నా ప్రథమమైనదిగా చెప్పబడినది. అంతరంగం యొక్క ప్రకృతి, చక్రములు-ఉపత్యికలు, ఇడ-పింగళ-సుషుమ్న మొదలైన నాడులు వాటిని తీర్చిదిద్దుకొనగల్గిన జ్ఞానం మొదలైనవన్నీ కూడా గురువుయొక్క దయవల్లనే సిద్ధిస్తాయి. వస్తుతః సచ్చిదానంద రూపుడైన ఆ పరమాత్మయొక్క దర్శనం చేయించగలిగినటువంటి మానవ రూపంలో ఉన్న శక్తి ఆ గురువు ఒక్కడే. ఆయన ద్వారానే ఈ అనంతమైన విశ్వాన్ని మనం చూడగలుగుతాం. గురువు లేకుండా సమగ్రమైన అనుభవాలను పొందలేం. ఒకరకంగా చెప్పాలంటే శరీరమనే గృహంలో సాధన అనేది వైరింగ్ వంటిది. దానికి మీట నొక్కగలిగేది గురువు ఒక్కరే. చైతన్యపూర్ణమైన శక్తి స్వరూపుడైన భగవంతుడు నిరాకారుడు. ఆయనకి సాకారరూపం ఎవరైనా ఉన్నారా అంటే అది గురువు మాత్రమే. భగవంతుని ద్వారా నేరుగా నియమించబడిన వ్యక్తి, భగవంతుని యొక్క స్వరూపం గురువు ఒక్కరే. ఆయనే అన్నింటికన్నా ప్రప్రథముడు. ఆయనకు వ్యతిరేకంగా ఎటువంటి అప్పీలు ఉండదు, అనగా ఏమీ చెప్పబడదు, వినబడదు. నిజానికి గురువు అనే వ్యక్తిని ఒక ప్రాణవంతుడైన 'శాస్త్రరూపంగా' భావించవచ్చును. ఆయనను చదవగలిగితే, ఆయన కొరకు సర్వస్వమూ త్యాగం చేయగలిగితే, ఈ ప్రపంచంలోని సమస్తమైన సంపదలూ, ఆధ్యాత్మికశక్తులు హస్తగతం కాగలవు.

జాబాలుని పుత్రుడైన సత్యకాముడు, గౌతమమహర్షి వద్దకు వెళ్ళాడు. తనను గురించి సమస్తమూ సత్యమే వచించి, గురువు యొక్క దయను పొంది, బ్రహ్మజ్ఞానమును నేర్చుకొనవలెననే తన కోర్కెను వెల్లడించాడు. అప్పుడు గౌతముడు 'గురువుయొక్క ఆజ్ఞను అక్షరాలా పాటించగలిగితే బ్రహ్మజ్ఞానం నీకు లభిస్తుంది' అని చెప్పాడు. అలా చెప్పి శుష్కించిపోయి ఉన్న 10 ఆవులను అతనికిస్తూ 'ఈ పది ఆవులు 1000 ఆవులు కావాలి, అవి పుష్టిగా సత్సంతానాన్ని కలిగిఉండాలి. అప్పటివరకు నువ్వు నా వద్దకు రావద్దు' అని చెప్పాడు. గోమాతలను అడవిలో మేపుతూ మేపుతూఉండగా ఆయనకు ప్రకృతి యొక్క జ్ఞానం కలిగింది. గో సేవ చేయడం వల్ల కలిగిన శక్తితో ఆయనకు పరమాత్మ తత్త్వం బోధపడింది. శక్తివంతమైన సహస్రాధికమైన ఆవులతో ఆయన తిరిగి గురువు చెంతకు వెళ్ళాడు. ఆయన వదనం తేజస్సుతో కాంతులీనుతూఉంది. గురువు యొక్క ఆజ్ఞను పాటించడం వల్ల ఆయన దేనినైతే పొందగలిగాడో అది స్పష్టంగా దృష్టిగోచరమౌతున్నది.

గురుశిష్య పరంపర అనేది భారతీయ సంస్కృతి యొక్క స్వర్ణిమ అధ్యాయమునకు గౌరవాన్ని చేకూర్చిపెట్టింది. గురు గోవిందపాదుని యొక్క శిష్యులు ఆదిశంకరులు, జనార్ధన్‌పంత్ యొక్క శిష్యుడైన ఏకనాథుడు, నివృత్తినాథుని యొక్క శిష్యుడు జ్ఞానేశ్వరుడు, గహనీనాథుని యొక్క శిష్యుడు నివృత్తినాథుడు, మచ్ఛేంద్రనాథుని యొక్క శిష్యుడు గోరక్షానాథుడు, రామానందుని యొక్క శిష్యుడు కబీరు, రైదాసు యొక్క శిష్యురాలు మీరాబాయి, భారతీతీర్థులవారి శిష్యుడు చైతన్య మహా ప్రభువు. శ్రీ అరవిందుల

**ఆత్మనిర్మాణ నియమావళియే సాధన.**

యొక్క శిష్యురాలు శ్రీ మాతా, శ్రీ రామకృష్ణ పరమహంస శిష్యుడైన వివేకానందుడు, వివేకానందుని శిష్యుడు సదానందుడు, సోదరి నివేదిత, స్వామీ విరజానందులవారి శిష్యుడు దయానంద మహర్షి, బుద్ధభగవానుని యొక్క శిష్యుడు ఆనందుడు, చాణుక్యుని యొక్క శిష్యుడు చంద్రగుప్తుడు, నాగార్జుని శిష్యుడు కనహపుడు, వ్యాసమహర్షి శిష్యులైన సూతుడు–శౌనకుడు మొదలైనవారందరినీ ఈ పరంపరకు చెందిన కొన్ని ఉదాహరణలుగా తెలుసుకోవాలి.

పరమపూజ్య గురుదేవులు హిమాలయ పర్వతాలలో సూక్ష్మ శరీరాన్ని ధరించి ఋషిసత్తా రూపంలో వెలుగొందియున్న శ్రీ సర్వేశ్వరానందులవారికి తమని తాము సమర్పణ గావించుకున్నారు. ఈ విధమైన సమర్పణయే ఆయనను యుగద్రష్టగా, నవయుగనిర్మాతగా, గాయత్రీ మంత్రం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తిని సంస్కారపూరితుని గావించగలిగే యుగఋషిగా మాత్రమే కాదు, మహాకాలుని యొక్క ప్రతినిధిగా, ప్రజ్ఞావతారం యొక్క శక్తిరూపంలో ప్రతిష్ఠింపచేసింది. 1969వ సంవత్సరంలో డిసెంబరు నెల అఖండజ్యోతిలో పరమపూజ్య గురుదేవులు **"మేము ఎల్లప్పుడూ మా మార్గదర్శకుని చేతిలోని కీలుబొమ్మగా ఉండేవారం. వారి సూచనల మేరకే మా జీవనాన్ని నడుపుకుంటున్నాం. అందుచేత శేషజీవితం యొక్క రూపురేఖలను మలచుకొనుటకుగానీ, నిర్వహించుకొనుటకుగానీ మా వశంలో లేకపోయినది. ఇప్పటివరకు వారు మా చేత ఏదైతే చెప్తూ, చేయిస్తూ ఉండేవారో దానినే మేం ఆచరిస్తూ ఉండేవారము. మా వ్యక్తిగతమైన కోరికలేవీ లేకుండా కేవలం వారు సూచించిన విధంగానే నడిచేవారము"** ఇదే విధంగా 1980వ సంవత్సరం నవంబరు అఖండ జ్యోతిలో 'జీవితంలో 15 సంవత్సరాల ప్రాయం నుండి 60 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు ఏదో ఒక మహాశక్తి యొక్క సూచనల మేరకు మేం కీలుబొమ్మవలె జీవించాం. ఇంకా బాగా చెప్పవలెనంటే మమ్మ్ము ఒక నిష్ఠావంతుడైన సైనికునిగా భావించవచ్చు. ఈ జీవితం యొక్క ప్రతి ఒక్క క్షణాన్ని మా యొక్క సూత్రసంచాలకుని కోరిక మేరకే గడిపాం' అని వ్రాశారు. అదే వ్యాసంలో వారు 'శరీరం మనస్సు ఈ రెండింటిని అమ్మివేసినప్పుడు కొనుకున్నవారి ఆజ్ఞానుసారం నడవడం తప్ప మరియొక మార్గమేమున్నది? అని కూడా వ్రాశారు.

ఈ విధమైన సమర్పణ, గురువు యొక్క ప్రతి కోరికలోను తన కోర్కెను కలుపుకోవలెననే భావం ప్రగాఢమయ్యే కొద్దీ సాధన ఉన్నత ఆయామములలోకి ప్రవేశిస్తూ ఉంటుంది. నిజమైన శిష్యునికి గురువు యొక్క కృప నాలుగు షరతులతో మాత్రమే లభిస్తుంది అని స్వామీ వివేకానందులవారు వచించారు. సత్యాసత్యముల గురించిన జ్ఞానం, భగవంతుని పొందవలెననే తీవ్రమైన ఆకాంక్ష, ఇహ–పరలోకముల యందలి సమస్తమైన కోర్కెలనూ త్యాగం చేయగలుగుట, గురువుపట్ల అచంచలమైన విశ్వాసం అనునవి ఆయన చెప్పిన నాలుగు షరతులు. ఇవి నాలుగూ అత్యంత ముఖ్యమైనవి. అయితే సాధన అనే సమరంలో సఫలీకృతం కావటానికి నాల్గవ షరతైన గురువుపట్ల అచంచలమైన విశ్వాసం అనే అంశం గురించి కొంచెం దృష్టిసారించాలి.

నిష్ఠ అనగా గురువు దేనినైతే నిర్దేశిస్తాడో దానికనుగుణంగా జీవన విధానాన్ని మలచుకొనుట, గురువు యొక్క ఆజ్ఞానుసారం నడచుకొనుట అని అర్థం. నిజానికి గురువు ఒక శరీరధారి కాదు. వారు చైతన్య బ్రహ్మ స్వరూపులు. గురువు అనే మాధ్యమం ద్వారా జీవులను ఉద్ధరించవలెననే సంకల్పంతో భగవానుడే స్వయంగా మానవ శరీరాన్ని ధరించి ఈ లోకానికి వచ్చాడు అన్న విషయాన్నిమనం అర్థం చేసుకొని తీరాలి. ఈ ప్రపంచంలో అనేకమంది వ్యక్తులు సిద్ధులు, మహాత్ములు కావచ్చు, కానీ మన గురువు మనకు మాత్రమే సద్గురువు. వారు శరీరరూపంలో ఉన్నప్పటికీ, లేకపోయినప్పటికీ వారి ఆజ్ఞను పాటించడమనేది నిజమైన శిష్యుడు పాటించి తీరవలసిన ధర్మం. అలా చేయగల్గిన వ్యక్తి గురువుయొక్క అహేతుకమైన కృపకు పాత్రుడు కాగలడు.

ఒకశతాబ్దం క్రిందట భాస్కరానందులవారనే ఒక విలక్షణమైన యోగి ఉండేవారు. కాన్పూరు సమీపంలోని ఒక పల్లె చివరన నివశించే ఆయన హిమాలయవాసి. అయన తన గురువుయొక్క ఆజ్ఞను పొంది జీవితాంతం కాశీలో ఉండి సాధన చేస్తూ ఉండేవారు. ఎక్కడికీ వెళ్ళకుండా ఇక్కడే ఉంటూ అందరికి సత్ప్రేరణలు ఇస్తూ ఉన్నట్లయితే ఈ లోకంలోనే కాదు, పరలోకంలోనూ సమస్తమైన సంపదలు నీకు లభ్యమౌతాయి. అని గురువు ఆయనను నిర్దేశించారు. తరువాతి కాలంలో ఆయన తపస్సు ఆయనను కాశీనుండి ఒక్క అడుగు కూడా బయటకు వేయకుండానే ప్రపంచమంతటా ఆయన ఖ్యాతిని సుగంధం వలె వ్యాపింపజేసింది అన్నదానికి చరిత్రయే సాక్షి. ప్రిన్స్ ఆఫ్ వేల్స్, రష్యా యొక్క జార్ ప్రభువు, జర్మనీ యొక్క ఛాన్సులర్, మార్క్‌ట్వైన్ మొదలైన రాజులు, మహారాజులు ఎందరో ఆయన పాదధూళి స్వీకరించటానికి ఆయన చెంతకు వచ్చేవారు. ఈ విధమైన సిద్ధి

**సంతోషం సగం బలం.**

గురువు ఆజ్ఞను పాటించుటవల్లనే ఆయనకు లభించినది.

గురువుపట్ల విశ్వాసం కలిగిఉండటమంటే మన యొక్క ప్రేమ భావనలను వారిపై ఆరోపించుకొనుటయే. భావనలకు తర్కానికీ ఎక్కడా ఎటువంటి సంబంధమూ ఉండదు. విశ్వాసం ద్వారా గురురూపవమైన భగవంతునిపట్ల మన ప్రేమను స్థిరపరచుకొనగల్గాలి. గురువుపట్ల మన సమర్పణ-సకామము కాక నిష్కామమైనది, సమగ్రమైనది అయినట్లయితే దాని ఫలితాలు కూడా అదే పద్ధతిలో లభిస్తూ ఉంటాయి. సాధన భవబంధనాలను దాటి పూర్ణత్వమనే లక్ష్యాన్ని చేరుకునేవరకూ యాత్ర సరళంగా సాగుతూ ఉంటుంది. గురువుపట్ల విశ్వాసం అనేదానికి సిక్కు మతంలోని గురు శిష్యపరంపర ఒకమంచి ఉదాహరణ. సద్గురువును, ఆయన నిర్దేశాలను కలిగియున్న గురుగ్రంథ సాహెబ్‌ను మాత్రమే సర్వస్వంగా భావించి ఆయనపట్ల సంపూర్ణ సమర్పణ చేయబడుతూ ఉంటుంది.

శాస్త్రములు గురువును భగవంతునికన్నా అధికమైన బ్రహ్మా-విష్ణు-మహేశ్వరుల యొక్క సమగ్రమైన రూపమనే పోలికను ఇచ్చాయి. గురువుయొక్క దయను పొంది ఎటువంటి గుర్తింపూ లేని అనామకుడు కూడా అనంతవైభవాన్ని పొందగలుగుతాడు. రేగు తీగ పైకి ప్రాకటానికి ఏదోఒక చెట్టుని ఆసరాగా తీసుకుంటుంది. పైకి ప్రాకి శిఖరాగ్రాన్ని చేరుకుని సూర్యకిరణాల ద్వారా ప్రకాశవంతమౌతుంది. ఇదే విధంగా సాధకునికి మార్గదర్శకుని ఆలంబన దొరికినట్లయితే తన శ్రద్ధను, ఆ మార్గదర్శకునిపట్ల పాదుకొని దానిని నిర్వహించగలిగితే ఆధ్యాత్మికసంపదకు అతను యజమాని కాగలడు, సమర్థవంతుడైన గురువుతో జోడింపబడిన సామాన్యుడు కూడా అసామాన్యుడు కాగలడు. సమర్థతతో జోడింపబడినప్పుడు అసమర్థత కూడా సమర్థతగా మారిపోగలదు. ఫలితంగా ఈ ప్రపంచంలో అతనికి ఏపని అసంభవంగా కనిపించదు. మురికి కాల్వలోని నీరు గంగానదిలో కలిసినప్పుడు అవి గంగాజలమనే గౌరవాన్ని పొందుతాయి. ఈ శక్తి సాన్నిధ్యం వల్ల లభిస్తుంది.

అందువల్లనే గురువు సాన్నిధ్యం ద్వారా లభించే ఈ శక్తిని పరసువేది, అమృతం, కల్పవృక్షాలతో సమానమైనదిగా పోలుస్తారు. దీనినే పరిణతి చెందిన కాయకల్పంగా కూడా భావించవచ్చు.

నలుదిక్కులా అపరాధాలు, నేరాలు పెచ్చుమీరుతున్న కలియుగం యొక్క పరాకాష్ఠ సమయమైన ఈనాటి పరిస్థితులలో మతవ్యవస్థ కూడా సవ్యమైన దిశలో లేనట్లు కానవచ్చుచున్నది. మనం గురుదేవుల జ్ఞానశరీరాన్ని మార్గదర్శకంగా చేసుకొని, వారి నిర్దేశాలను హృదయంగమం చేసుకొని, మన శ్రద్ధా-విశ్వాసాలను రోజు రోజుకి ప్రగాఢవంతం చేసుకొనడమనేది ఒక్కటే ఇందుకు పరిష్కారమార్గం. గాయత్రీ మహాశక్తిని ఈ యుగపు విశ్వామిత్రుని వలె ఇంటింటికీ తీసుకొనివెళ్ళి అందరికీ సులభతరం కావించిన ఆ సద్గురువును ఎవరైనా సరే గౌరవించి, అనుసరించినట్లయితే వారు స్థూలశరీరంతో ఉన్నప్పుడు వారికి దగ్గరగా ఉండిన శిష్యులు ఎటువంటి లాభాలను పొందినారో అటువంటి లాభాలనే పొందగలరు. సమీపంలో లేకపోయినప్పటికీ తమ యొక్క సమర్పణాబలం వల్ల ఎక్కలేనన్నిన సిద్ధులను పొందినటువంటి వారు కూడా ఎందరో ఉన్నారు. సద్గురువు లేనిదే సాధనారంగంలో ప్రగతి సాధించగలగటం అనేది అనూహ్యమైన విషయం. మనం విశ్వాసాన్ని నెలకొల్పుకొని, ఆ విశ్వాసాన్ని ప్రతిక్షణమూ దృఢతరం కావించుకుంటూ, ఈనాటి యుగధర్మాన్ని అనుసరించి ఈ యుగపరివర్తనవేళ శిష్యభావాన్ని అలవర్చుకోవాలి. వారు మన సాధనలో పడవ నడుపువాని వలె మనలను భవబంధనాలనుండి దాటించి జీవన్ముక్తులను చేస్తారనే నమ్మకాన్ని మనం ఉంచుకోవాలి.

– అనువాదం : శ్రీమతి లక్కరాజు లక్ష్మీరాజగోపాల్

## యాచకుని పునర్జన్మ

*టాల్‌స్థాయి వద్దకు ఒక యువకుడు వచ్చి ఒక రూపాయి, అర్థో ఈయమని యాచిస్తాడు. టాల్‌స్థాయి మండిపడి “నీ దగ్గర కోట్ల ఆస్తి పెట్టుకుని నన్ను డబ్బు అడుక్కోవడానికి సిగ్గులేదూ? నీ కాళ్ళు ఎంత విలువైనవి, నీ కళ్ళు ఎంత విలువైనవి ఇలా మొత్తం అవయవాల ధర కట్టి చూడు. ఇంత విలువైన శరీరాన్ని ఉపయోగించుకుని నీ దరిద్రాన్ని పోగొట్టులేకపోతే ఇక బ్రతుకెందుకు” అని అంటాడు. వాస్తవాన్ని కళ్ళకు కట్టినట్టు చూపించిన టాల్‌స్థాయికి యాచకుడు ప్రణామం చేసి తన బ్రతుకును చక్కబరచుకుంటాడు. ఇదేదో చిన్న విషయమని భావించకండి. వ్యక్తి విలువను తెలియపరచడం, ఉత్సాహాన్ని అందివ్వడం పునర్జన్మ ప్రసాదించటమంత ఉత్కృష్టమైనది.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**సంతోషం మహత్తర సంపద.**

సాధనా విజ్ఞానం

# పాత్రతను పెంచుకోండి-సిద్ధులను అందుకోండి

జీవితంలో సాధన అనునది ఎంత సమర్థవంతమైనది అంటే – సామాన్య శ్రమతో కూడిన ఏకాగ్రతలో నిమగ్నమగుట వల్ల అది అసామాన్య మహత్తులను, శక్తులను ఉద్భవింపచేయగలదు. సాధారణ స్థితిలో ప్రతివస్తువు తుచ్ఛంగా, అల్పంగా కనిపిస్తుంది. కాని వాటిని ఉత్కృష్టం చేసినట్లయితే, వాటి సూక్ష్మతను లోతుగా పరిశీలించగలిగితే వాటి విశిష్టత, మహత్తు అర్థమవుతాయి. చూడటానికి సముద్రంలో ఉప్పునీరు తప్ప మరేమీ ఉండదు. కాని లోపలికి పోయి లోతుగా పరిశీలించిన వారికి అది రత్నాకరునిగా దర్శనమిస్తుంది. వృధాగా ఎంతో భూమిని ఆక్రమించినట్లు పైకి కనబడే ఉప్పునీటి సముద్రపు లోతుల్లో నిగూఢంగా అమూల్య సంపద దాగి ఉంది. ధూళికణాలు ఎందుకూ పనికిరానట్లు కనబడతాయి. కాని వాటినుండి ప్రచండ అణుశక్తి వెలువడినప్పుడు ప్రపంచమంతా ఆశ్చర్యంతో విస్మయమవుతుంది. కనుక దేనినైనా స్థూలం నుండి సూక్ష్మంలోనికి ఎంత లోతుగా పరిశీలిస్తే అంతే స్థాయిలో సత్యాలు వెల్లడి అవుతాయి.

స్థూల దృష్టికి జీవితం ఒక ఆటగా అనిపిస్తుంది. దాన్ని ఎలాగోలా లెక్కలేకుండా గడిపేస్తాము. అవసరాలు తీర్చుకోడంలో, సమస్యలను పరిష్కరించుకోడంలో, ప్రతికూలతలను అనుకూలం చేసుకోడంలో క్రిందా మీదా పడుతూ ఉండగానే జీవితం ముగిసిపోతుంది. కష్టాలనుండి, లోటుపాట్లనుండి తప్పించుకోలేక పోతుంటాము. అనేకసార్లు జీవితం భరించలేనంత భారంగా తయారవుతుంది. ఫలితంగా ప్రయత్న పూర్వకంగా కాని అప్రయత్నంగా కాని అకాలమృత్యువు నోటికి ఆహారం కావలసి వస్తుంది. నిస్సారం, నిరర్థకం అయిన జీవితం గడపవలసి రావడం పెద్ద శాపం. దీన్ని దురదృష్ట రూపంలోనే స్వీకరించవలసివస్తుంది. ఎందుకు పుట్టామో ఎందుకు బ్రతుకుతున్నామో తెలియకుండా ఉంటుంది. మామూలుగా జీవిత సారం ఇదే. విపరీత పరిస్థితులలో అయితే ఇతర ప్రాణులకంటే నికృష్టంగా ఉంటుందని చెప్పక తప్పదు. సఫలుడు, సమర్థుడు అయి, సమున్నత స్థాయిగల వ్యక్తి అదృష్టశాలిగా కొనియాడబడతాడు. ప్రతివారికీ అలాంటి స్థితి పొందాలన్న ఆశ కలుగుతుంది. ప్రాచీన కాలంలోగాని ఈ కాలంలోగాని భౌతిక గౌరవ మర్యాదలతో తులతూగుతున్నవారికి, ఆత్మ సంబంధమైన విభూతులతో అలరారుతున్నవారికి కొరత లేదు.

అదృష్టవంతులకు, దురదృష్టవంతులకు మధ్య ఉన్న అంతరం చూస్తుంటే, ఒకే విధమైన అవయవాలతో జన్మించిన మనుష్యుల పరిస్థితులలో ఇలా వ్యత్యాసాలు ఉండడానికి కారణమేమిటా అని ఆశ్చర్యం కలుగుతుంది. ఇది సృష్టికర్త పక్షపాత బుద్ధి అనో ప్రకృతి మాయ అంటే సరిపోదు. ఎందుకంటే, ఈ రెండు రకాలైన మనుష్యుల నిర్మాణంలోగాని, యోజనలోగాని, సత్తాలోగాని ఎటువంటి మాయోపాయం, తేడా ఉండే అవకాశం లేదుగాక లేదు. సృష్టిక్రమంలో అటువంటి తేడాలు ఉన్నట్లయితే గ్రహాలు, నక్షత్రాలు గతులు తప్పేవి. పంచభూతాలు, ఋతువులు మొదలైనవి విశృంఖలంగా సంచరించి పరస్పరం ఢీకొంటూ ప్రళయానికి నాంది పలికేవి. కనుక సృష్టిక్రమంలో లోపం లేదన్నది నిర్వివాదాంశం.

మనిషికి మనిషికి మధ్య ఆకాశమునకు భూమికి ఉన్నంత తేడాకు కనపడే కారణం ఏమంటే జీవితపు పైభాగం వరకే సరిపెట్టుకునే బద్ధకస్తులకు పైపొర మాత్రమే అందుతుంది. కాని ఎవరైతే దానిని లోతుగా అన్వేషిస్తారో వారికి ఒకదాని తర్వాత ఒకటిగా అమూల్యమైన లాభాలు చేకూరుతుంటాయి. ఇలా లోతుగా అన్వేషించడాన్ని ఆధ్యాత్మిక పరిభాషలో "సాధన" అని అంటారు. సాధన ఎందుకు? ఈప్రశ్నకు ఒకే ఒక్క నిశ్చితమైన సమాధానం "జీవితానికి" అని. జీవితం కోరుకున్న వరాలిచ్చే కల్పతరువు. ఎవరైనా సరే దానిని ఎంత చక్కగా ఉపయోగించుకుంటే అంతే స్థాయిలో ధన్యత పొందుతారు. వారి పెదవులపై సదా సర్వదా చిరునవ్వుల పువ్వులు విరబూస్తుంటాయి. సృష్టికర్త బీజరూపంలో సంపదల అపరిమిత భాండాగారాన్ని ఈ మానవ శరీరంలో అమర్చిపెట్టాడు. మనం చేసే పొరపాటు దీన్ని వెతికి పట్టుకోలేకపోవడం, ఉపయోగించలేకపోవడం, ఈ పొరపాటుకు ప్రాయశ్చితత్తం ఆత్మజ్ఞానాన్ని పొందడం. ఈ

[redacted]ర్మలుగా రూపొందినపుడే సద్జ్ఞానానికి సార్థకత.

ఆత్మజ్ఞానం జాగృతమయి క్రియ రూపం దాల్చినట్లయితే ఆత్మోన్నతి లక్షణం తక్షణమే గోచరిస్తుంది. ఆ ఆత్మ సంస్కరణ పేరే సాధన.

సాధన వలన సిద్ధి కలిగే మాట నూటికి నూరు శాతం సత్యం. భౌతిక జగత్తులో వివిధ రంగాలలో సాధనా తత్పరుడైన పురుషుడు అద్భుతమైన విజయాలను పొందటం చూస్తున్నాం. జీవితం విలక్షణమైన కార్యక్షేత్రం. జడ జగత్తులోని శక్తులు పరిమితమైనవి. కేవలం సాధనాలు మాత్రం పొందగలుగుతాం. కాని చేతనా జగత్తులోని శక్తులు అపరిమితమైనవి. దానిలో ఆనందం, ఉల్లాసాల భాండారం నిండి ఉంటుంది. వీటికి సంబంధించిన సాధన ఒక విస్తృత విజ్ఞానం.

సాధనకు సంబంధించిన ఈ అభ్యాసాలను పైపైన చూచినట్లయితే, మనం కోరికలు కోరడం, అవి నెరవేడం ఇదంతా ఎక్కడో వెలుపలినుండి జరుగుతున్న కార్యం అన్న భ్రాంతి కలుగుతుంది. సాధన అంటే అర్హతను పొందగలగడం. ఇదే సాధనకు సంబంధించిన తత్వదర్శనం. దీనికోసం జీవితంలో బాహ్యంగా, అంతరంగికంగా వ్యక్తి తననుతాను సంస్కరించుకొన వలసి ఉంటుంది. **సంస్కారమును యోగమని, నియమపాలనను తపమని అంటారు.** ఇవి సాధనకు సంబంధించిన రెండు రంగాలు. బాహ్యంగా సభ్యత, మర్యాదలకు కట్టుబడి ఉంటూ అంతఃశుద్ధికై ఎంతో కృషి చేయవలసి ఉంటుంది. సర్కస్‌లో పనిచేసే జంతువులకు కొన్ని అంశాలలో ఎటువంటి శిక్షణనిస్తారంటే వాటి నైపుణ్యం చూసి అబ్బురపడిపోతాము. ఇదే ప్రక్రియను కుదురుగా ఉండజాలని చంచలమైన మనసును, నియమపాలనలేని జీవితాన్ని క్రమబద్ధీకరించడానికి అమలుచేయవలసి ఉంటుంది. సాధనలోని సమస్త నియమ నిబంధనలు ఈ మహా లక్ష్యం కొరకే నిర్దేశింపబడ్డాయి.

సామాన్యుల నమ్మిక సిద్ధులు దైవానుగ్రహంతో లభిస్తాయనీ, సాధన అనే క్రియ దీని కొరకు చేసే ప్రార్థన అనే భావం కొంతవరకే సత్యం. దుకాణదారుడు ఏ వస్తువు అడిగినా తీసి చూపిస్తాడు. కాని దాని ధర చెల్లించినప్పుడు మాత్రమే దానిని మనపరం చేస్తాడు. అలాగే ప్రార్థనను మన కోరిక వ్యక్తీకరించే చర్య అని అనవచ్చు. కాని దానిని యాచన అని అనడం పెద్ద తప్పు. యాచన అంటే ధర చెల్లించకుండానే విలువైన వస్తువును పొందడం కోసం ప్రాధేయపడడం. ఇందువల్ల చెప్పుకోదగినంతగా ప్రయోజనం లభించదు. ఏదో విధంగా దొరికినా, దాని స్థాయి అత్యల్పంగా ఉంటుంది. పైగా మనసుకు సంతోషకరంగా ఉండదు, గౌరవప్రదంగానూ అనిపించదు. వాటిని ఉపయోగించే సమయంలో ఆత్మన్యూనత కలుగుతూ ఉంటుంది. వాటినే అర్హత వలన సంపాదించుకున్న వారికి గౌరవం, గర్వం, సంతోషం పొంగి పొర్లుతూ ఉంటాయి. చేసుకున్నవారికి చేసుకున్నంత అన్నట్లు ఈ సృష్టిక్రమంలోనే కర్మ-ఫలితం అన్న విధానం రూపొందించబడి ఉన్నది. పవనుడు ప్రాణవాయువును అందరికీ సమానంగా అందిస్తాడు. సమర్థవంతమైన ఊపిరితిత్తులు మాత్రమే దానిని స్వీకరించగలుగుతాయి. మృతుల ముందు పవనుడు నిస్సహాయుడే అవుతాడు. మనోహరమైన, సుందరమైన దృశ్యాలతో నిండిఉన్న ఈ ప్రపంచాన్ని వీక్షించి ఆనందించే అవకాశం దృష్టి చక్కగా ఉన్నవారికే కలుగుతుంది. అసంఖ్యాకమైన ధ్వని ప్రవాహముల ఆరోహణ అవరోహణములను విని ఆనందం పొందగలిగే అవకాశం కర్ణభేరి చక్కగా పని చేస్తున్నవారికి మాత్రమే కలుగుతుంది. వెలుపలి నుండి దైవీ అనుగ్రహాలు వర్షిస్తున్న మాట యదార్థమే అయినప్పటికీ, అవి పొందడానికి "అర్హత" అనివార్యం అన్న షరతు జోడించబడే ఉన్నది.

అర్హతను పెంపొందించుకున్నవారికి యాచించవలసిన అవసరం ఉండదు. వారికి ఉపయుక్తమైనవి సునాయాసంగా అందుతాయి. ఉపయుక్తమంటే వారి స్థాయికి తగినట్టివి అని అర్థం. స్థాయిని అభివృద్ధి చేసుకొనకుండా మహత్తులు విభూతులు లభించవు. ఒకవేళ లభించినా ఎక్కువ కాలం నిలువవు. కాబట్టి అర్హతను అభివృద్ధి చేసుకోవడం తప్పనిసరి. సాధనలో చేసే పని ఇదే. ప్రయత్నం ఎంత ప్రౌఢంగా, గాఢంగా, పరిపక్వంగా ఉంటుందో అంతే గాఢమైన విభూతులు లోనుండి ఉబికివస్తాయి. వెలుపలి నుండి వర్షిస్తాయి.

చెట్లు తమ ఆకర్షణ శక్తితో ఆకాశంలో తిరిగే మేఘాలను ఆకర్షించి వర్షం కురిసేలా చేస్తాయి. మొక్కల మీద, ఆకులు పువ్వుల మీద మంచు బిందువులు తమంతట తామే ఆకర్షణకులోనై జమకూడతాయి. వికసించిన పూలలోని ఆకర్షణ తేనెటీగలను, తుమ్మెదలను, సీతాకోకచిలుకలను అతిథులుగా ఆహ్వానిస్తుంది. ప్రతిభ అనేకమందిని ప్రశంసకులుగాను, అనుయాయులుగాను చేసుకుంటుంది. ఇది ఆకర్షణ శక్తికి ఉన్న మహత్తు. ఇదే విధంగా సాధకుని ఆకర్షణ దైవీశక్తులను అదృశ్యరూపంలో ఆహ్వానిస్తుంది. అనుగ్రహాలను అందించడం వాటికి తప్పనిసరి అవుతుంది.

[redacted] **సమయమే అత్యుత్తమ సంపద.**

సిద్ధుల, విభూతుల ప్రవాహం ఒక విధంగా పైనుంచి వెలుపలినుండి కురుస్తుండగా, మరోవిధంగా లోపలినుండి ఆంతరంగికంగా పొంగివస్తుంది. ఈ దైవానుగ్రహ ప్రవాహంలో ఎంతోమంది అదృష్టవంతులు మునకలు వేస్తూ ఆనందిస్తున్నారు. ఆత్మోత్కర్ష అనే ప్రక్రియద్వారా నిద్రించుతున్న సామర్థ్యాలు జాగృతమౌతాయి. దానితో సునాయాసంగా అన్ని విభూతులూ ప్రకటితమౌతాయి. అజ్ఞానం వలన, సరైన మార్గదర్శకులు లేనందున సామాన్య జనులు వాటికి అపరిచితులుగానే ఉండిపోతున్నారు. నిజానికి మనిషిలో లేనిది లేదు. వాటిని విధాత సామర్థ్యంతో సమానమని చెప్పవచ్చు. వృక్షమునకున్న విశాల రూపం చిన్న విత్తనం లోపల అమరి ఉంటుంది. సౌరమండలం సమస్త ప్రక్రియలు సూక్ష్మరూపంతో పరమాణువులో యధావిధిగా నడుస్తుంటాయి. వ్రేళ్లతో భూమిలోనుండి రసం పీల్చి చెట్టు పచ్చగా ఉండటానికి, పూవులు పూయడానికి, కాయలు కాయడానికి కావలసినవి ఏర్పరుస్తుంది. ఇవన్నీ కళ్లకు కనపడవు. చెట్టు కేవలం ఆకారానికేగాని, దాని శోభ, సమర్థతల శక్తి వ్రేళ్లలోనే నిక్షిప్తమై ఉంది. జీవుని చిన్న అంతరంగం దాదాపు బ్రహ్మ విరాట్‌స్వరూపమంత సమర్థవంతమైనది. సిద్ధి అనే శక్తి వ్యక్తి లోపలినుండే అంకురించి పైకి ఎదుగుతుంది. వెలుపల దాని ప్రగతికి సంబంధించిన పరిచయం లభిస్తుంది.

ఈ విధంగా అర్హతను ప్రకటించి ఈ లోకంలో ఏదంటే అది, ఎంత కావాలంటే అంత పొందగలిగే వీలున్నది. ధనవంతులు ఎంత ఖరీదైన సుఖసాధనలనైనా సరే ఎన్ని కావాలంటే అన్ని ఎలా కొనగలరో, అదే రకంగా సాధనతో అర్హతను పొందినవారు దైవానుగ్రహమనే సంపదతో తమ కోర్కెలను తేలికగా తీర్చుకొనగలరు. అర్హతలేని వారు ప్రార్థించినా, యాచించినా దక్కేదేమీ ఉండదు. ఈ జీవిత సాధన సిద్ధాంతం శాశ్వత సత్యం. సందేహించడానికి, వాదించడానికి అవకాశంలేని సత్యం.

గాయత్రీ మహావిద్య తత్త్వదర్శనంతో, దీని సమర్థసాధనతో పాఠకులు సుపరిచితులే. దీనిని పాత్రతకు, సామర్థ్యానికి, వ్యక్తిత్వానికి సంస్కరణ క్రియగా అంగీకరించినట్లయితే, ఆ మహా ప్రయత్నంలో నిమగ్నులై ఉన్నట్లయితే చరిత్రలోనూ వర్తమానంలోనూ ఉన్నటువంటి ఆధ్యాత్మవేత్తలవలె ప్రతి ఒక్కరూ తమ స్థాయిని ఉన్నతం చేసుకొనగలరు. వారి ప్రతిభ హిమాలయాల కన్నా ఎత్తైన శిఖరాలను చేరుకుని సమున్నతం, సమృద్ధివంతము అవుతుంది. లోకసేవకు కావలసిన ఉత్కృష్టమైన వ్యక్తుల నిర్మాణం ఈ విధమైన జీవన సాధన వల్లనే సాధ్యపడుతుంది. ఈ సాధన అనే యజ్ఞకుండంలో తమ్ముతాము ఆహుతి చేసుకున్నప్పుడే స్వీయ వ్యక్తిత్వంలో దాగి ఉన్న అనంతశక్తుల జాగరణ సంభవిస్తుంది.

★★★

## కదిలించే కళ్లు

33.సీ॥ చీకటిమార్గాన చకచకనదువంగ
ఒంటరితనమన్న ఒణుకు పుట్టె
"చెట్టమీదనుచూడ చెలువారె పక్షులు
నీటిలోనను చేపలీదుచుండె
అడవిలోననుచూడ నలరారె మృగములు
అవియన్నిజీవులే అవనిలోన"
అనియంచుతలవగా నవియన్ని మిత్రులే
ఏకాంతమనుమాట యెగిరిపోయె

తే॥ ప్రాణియనుమాట మనిషికే పాడిగాదు
వసుధయే పెద్దదౌ పరివారమనుచు
మానవాళికి దెలుపంగ మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటి చూపు

34.సీ॥ "భయములేనినడక నయముతోడిమాట
ప్రగతిబాటకుచూడ ప్రథమమెట్టు
యోగియైనవ్యక్తి యోర్పునుపాటించి
ముందుకేగుచునుండ ముక్తి కలుగు"
అనుకొంచుదీక్షగా నడవిలో నడువంగ
భయమన్నదెప్పుడో పరుగుదీసె
ఒంటరితనమైతే ఓడిపోయెనుగాని
కౄరమౌ మృగములు కోరజాచె

తే॥ గురువుగారిని మదిలోన కోరిపిలువ
మృగములే మిత్రులై చేరి మెలగువిధము
మానవాళికి దెలుపంగ మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటి చూపు

రచన–మధుర కవయిత్రి
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**అన్ని దానములలో గొప్పది జ్ఞాన దానం.**

దేవ సంస్కృతి విశ్వవిద్యాలయము

# వ్యక్తిత్వ పరిష్కారము-రచనాత్మక జీవన కళ - 1

సంయమము అనగా ప్రాణశక్తి యొక్క రక్షణ. అంటే మనలోని ప్రాణశక్తిని అనవసరమైన చెడు కార్యక్రమములకు కాక మంచి పనులకు, సమాజహితముకు ఉపయోగించుట. మానవ జీవితములో సంయమము తప్పనిసరిగా ఉండవలసిన లక్షణము. సంయమములేని వ్యక్తి అనేక శారీరక, మానసిక బాధలకు లోనవటమేకాక తాను అనుకున్న పనులను ఎప్పుడూ సరిగ్గా పూర్తిచెయ్యలేడు. ఇది ఆచరించిన వ్యక్తి జీవితములో అనేక అద్భుత మార్పులను పొందగలడు. సంయమము అంటే మనలో ఉన్న జీవశక్తిని పొదుపుగా ఉపయోగించుకోవటం. అది అనవసరమైన విషయాలకు వ్యర్థం కాకుండా మన జీవన లక్ష్యమయిన ఆత్మఉన్నతి కొరకు జీవశక్తిని ఉపయోగించుకోవటాన్ని సంయమము అని అంటారు. సంయమనములు వివిధ రకములు. దీనినే SIVA ప్రిన్సిపల్ అంటారు.

**S** – సమయ సంయమము

**I** – ఇంద్రియ సంయమము

**V** – వాక్ సంయమము

**A** – అర్థ సంయమము

**1. సమయ సంయమము :** సమయాన్ని సవ్యంగా ఉపయోగించుకోవటమే సమయ సంయమము. సమయము ఎల్లప్పుడు ప్రవహించే ఒక అమూల్యమైన నిధి. ఇది గడిచిన క్షణాన్ని వెనక్కు తీసుకొని కొత్త దానిని ఇస్తుంది. ఎవరైతే ఈ సమయ ప్రవాహానికి అనుగుణముగా మారుతారో వాళ్ళు తమ జీవిత సర్వోత్తమ లక్ష్యాన్ని పొందుతారు. ఆలోచించగల వ్యక్తి సాధ్యమైనంత వరకు తన సమయాన్ని వీలైనంత మంచిగా ఉపయోగించి సఫలత పొంది, ఉన్నతి చెందుతాడు.

గడచిన కాలము తిరిగిరాదు. కాలమును విలువైనదిగా భావించి దానిని చక్కగా వినియోగించునప్పుడు అనుకున్న పనులు అనుకున్న ఫలితాలను నిశ్చయంగా పొందవచ్చు. దీనికి ప్రణాళిక చాలా ముఖ్యము. అందరికీ భగవంతుడు ప్రసాదించిన సమయం 24 గంటలు. ఈ 24 గంటల సమయాన్ని ఒక్క నిమిషం కూడా వృధా చేయకుండా అర్థవంతముగా **మనం చేయదల్చుకున్న పనులను చేయాలనుకున్న సమయానికి చేయగలగటమే సమయ సంయమనము.** ఈ ప్రపంచములో గొప్ప బిజినెస్ మాన్‌కి కూలి పని చేసే వారికి కూడా ఉన్నవి ఆ 24 గంటలే. కానీ ఈ స్థాయి భేదానికి కారణము సమయాన్ని వాళ్ళు ఉపయోగించే విధములో వ్యత్యాసమే. అందువల్ల అందరికీ ఈ సమయ సంయమము ఉండాలి.

**2. ఇంద్రియ సంయమము :** మనలోని కోర్కెలకు, ఆలోచనలకు కోపతాపాలకు కారణము ఇంద్రియములు. వీటివలన కుటుంబములో, సమాజములో సంయమనము కోల్పోతూ ఉంటారు. ఎప్పుడైతే ఈ ఇంద్రియాలను నిగ్రహించి అదుపులో ఉంచుకుంటామో అప్పుడు ఆ వ్యక్తిలో విచక్షణా జ్ఞానము వృద్ధి చెంది దుర్గుణాలకు దూరంగా ఉంచగలడు. మనకు ఉన్న ఐదు జ్ఞానేంద్రియాలు– చెవి, కన్ను, ముక్కు, నాలుక, చర్మం లను సరిగ్గా ఉపయోగించుకోవాలి. ఈ ఇంద్రియాలు మనని వాటికి నచ్చిన పనులను చేయిస్తాయి. ఆత్మ ఉన్నతికి కావలసిన పనులను చేయమని చెప్పవు. అందువల్ల ఎల్లప్పుడు ఈ క్రింది వాటిపై సంయమనము ఉంచాలి. అవి

జిహ్వా సంయమము : జిహ్వా అనగా రుచి. నాలుకకు ఇష్టమైన మరియు తినకూడని పదార్థాలను విపరీతముగా తినటం వల్ల శారీరిక, మానసిక అనారోగ్యము కలుగుతోంది. దీనికోసము నియమిత వేళలలో నియమబద్ధ ఆహారం, పచ్చికూరలు, పళ్ళు, సాత్విక ఆహారం తీసుకోవాలి.

కామ సంయమము : కామమయ వాసనలు మనిషిని అధః పాతాళానికి తోసేస్తాయి. కామమయ ఆలోచనలు మనిషిని చెడు అలవాట్లు, చెడు ఆలోచనలవైపు లాగుతాయి. కాముకతో నిండిన పుస్తకాలు, చిత్రాలు ఇందుకు ముఖ్యకారణము. ఇటువంటి వాటిపై ఆసక్తిని ప్రదర్శించక, నియంత్రణలో ఉండుట చాలా అవసరము. ఇది నియంత్రణలో ఉండుటకు స్వాధ్యాయము, సత్సంగములలో పాల్గొనాలి.

ఆలోచనా సంయమనము : మనిషి చేసే ప్రతి పనికి మూలము అతని ఆలోచనలే. మన ఆలోచనలను ఎక్కువగా చేసేవి మన మనస్సే. ఈ మనస్సును అదుపులో పెట్టడం చాలా కష్టము. కానీ అసాధ్యము కాదు. దీనిని సాధన ద్వారా సాధించవచ్చును. మన ఆలోచనా విధానములో మార్పు తేవడం వల్ల పరిస్థితులు సునాయాసముగా మారిపోతాయి. అందువలన మన బాహ్య

[redacted]త్సాహం తెచ్చుకోవాలి. అప్పుడు ఉల్లాసం నీ సొంతమవుతుంది.

పరిస్థితులలో మార్పు రావాలి అంటే మన మనస్సులో, మన ఆలోచనా విధానములో మార్పు రావాలి. జీవితములో సంభవించే అనేక సంఘటనలకు కారణము మనస్సు. మనస్సు నియంత్రించిన వ్యక్తి నిరాశ, నిస్పృహలను దరిచేరనీయడు. మనస్సును అదుపులో ఉంచుకుంటే అన్ని సంయమాలను సాధించవచ్చు.

మనస్సు ఆహారం వలన ఏర్పడుతుంది. అందువలన మన ఆలోచనలలో మార్పు రావాలంటే మన ఆహారంలో మార్పు రావాలి. దీనితో సులభముగా ఆలోచనా సంయమాన్ని పాటించవచ్చు. అందుకే నిరంతరము మంచి ఆలోచనలు చెయ్యటం, మంచి వ్యక్తులను కలవటం, సత్సంగాలకు వెళ్ళటం, స్వాధ్యాయం చెయ్యటం, ఖాళీ సమయాలలో రచనాత్మక ఆలోచనలు (Creative thinking) చెయ్యటం చేస్తూ ఉండాలి.

**3. వాక్ సంయమము :** వాక్కును సరైన విధముగా వాడటమే వాక్ సంయమము. వాక్కుకు గల శక్తి చాలా ఎక్కువ. **పూర్వకాలములో వాక్కు వరాలుగాను, శాపాలుగాను పనిచేసేది.** కానీ ప్రస్తుతకాలములో వాక్కు కేవలం మిత్రులను శత్రువులుగా తయారు చేస్తోంది. వాక్కు మీద నియంత్రణలేని వ్యక్తిని సమాజం చులకనగా చూస్తుంది. మన వాక్కు స్నేహము, ప్రేమ మొదలైన గుణములతో నిండిఉండాలి. చాలాసార్లు మౌనం గొప్ప అనుభూతులను, అనేక సమస్యలకు సమాధానాలను ఇస్తుంది.

**4. అర్థ సంయమము :** ప్రస్తుత పరిస్థితులలో మనిషి తన కాలము, శ్రమ, పలుకుపడి అంతా ధన సంపాదనకే వెచ్చిస్తున్నారు. పుట్టినప్పటి నుండి చదువు మొదలైనప్పటి నుండి ఏది చదివితే ఎక్కువ ధన సంపాదన చేయగలుగుతాము అనే ఆలోచన తప్ప ఏది చదివితే వ్యక్తిత్వము ఏర్పడుతుంది అనే ధ్యాసే ఉండటం లేదు. డబ్బుకే విలువ తప్ప మనిషికి విలువ ఇవ్వటం లేదు. ఎప్పుడైతే ఆలోచనా సంయమము వస్తుందో అప్పుడు దానంతట అదే అర్థ సంయమము కూడా వస్తుంది.

అర్థ సంయమము లోపమువల్ల ఆర్థిక ఇబ్బందులలో ఇరుక్కుంటున్నాడు. సంపాదించిన ధనములో కొంత పొదుపు చెయ్యటం వలన కష్టాలలో ఇరుక్కోకుండా, కొంత ధనమును సమాజ శ్రేయస్సుకు ఉపయోగించటం వలన మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. మన అనవసర ఖర్చులు, ఆడంబరములు తగ్గించుకుంటే ధనము అదే సమకూరుతుంది. ఇదే అర్థ సంయమము.

**అర్థ సంయమనము అంటే మిత వ్యయము.** అంటే తక్కువ ఖర్చుపెట్టటం. “అర్థ” అంటే అర్థము డబ్బుఅనే కాదు, వనరులు కూడా. మనము వనరులని దుబారాగా ఖర్చుపెట్టకుండా పొదుపు పాటించాలి. మనము వనరులను ఉపయోగించేటప్పుడు గొప్పకి వెళ్ళకుండా, పేరు, ప్రతిష్ఠలకి ప్రాకులాడకుండా ఆచితూచి అవసరము మేరకు ఉపయోగించుకోవాలి. ఆ విధముగా మన నిత్య జీవితములో అన్ని సందర్భాలలో ఈ అర్థ సంయమాన్ని పాటించాలి.

**సంయమ సాధనకు ప్రయత్నాలు :**

**ఉపవాసము :** వారములో ఒక రోజు ఉపవాసము చెయ్యటం ద్వారా జిహ్వా సంయమమును సాధన చెయ్యవచ్చు. రుచికి కాక శరీరానికి అవసరమైన ఆహారాన్ని స్వీకరించాలి.

**అర్థ సంయమము :** వచ్చే రాబడిని, ఖర్చులను దృష్టిలో పెట్టుకొని అనవసర ఖర్చులను తగ్గించుకోవాలి, జమాఖర్చులు వ్రాయాలి.

**సమయదానము, అంశదానము, ప్రతిభాదానముల** ద్వారా సమయాన్ని, ధనాన్ని, ఆలోచనలను, మనసును నియంత్రించుకుంటూ సంయమము చేసుకొనుట ద్వారా జీవితాన్ని మలచుకోవచ్చును.

★★★

## వేశ్య స్వర్గానికి, సాధువు నరకానికి

*ఒక సాధువు రేయింబవళ్ళు హరి భజన చేస్తుండేవాడు. అతని కుటీరం ఎదురుగా పెద్ద భవనంలో ఒక వేశ్య రేయింబవళ్ళు సుఖభోగాలతో మునిగి ఉండేది. మరణానంతరం వేశ్య స్వర్గానికి, సాధువు నరకానికి చేరుకున్నారు. సాధువు ఇది అన్యాయమని భగవంతునికి ఫిర్యాదు చేశాడు. భగవంతుడు చిత్రగుప్తుని పిలిచి విషయాన్ని వివరించమని కోరాడు. ఈ సాధువు భజనలు చేస్తున్నా వేశ్యను గురించిన చెడు ఆలోచనలు చేస్తూ నిందిస్తూ ఉండేవాడని, వేశ్య అలాకాక శారీరకంగా తప్పు చేస్తున్నా, మానసికంగా సాధువువలె ఉండాలని కోరుకుంటూ తన తప్పిదాలకు పశ్చాత్తాపం చెందుతూ ఉండేదని చిత్రగుప్తుడు తెలియచేశాడు.*

***ప్రతిఫలం కర్మనిబట్టే కాక చేస్తున్న ఆలోచనల బట్టి కూడా లభిస్తుంది.*** *చిత్రగుప్తుని లెక్క చాల సక్రమమైనదని భగవంతుడు సాధువుకు తెలియచేశాడు.*

*– ప్రజ్ఞా పురాణం నుండి*

**[redacted]యంతోనే ఆత్మశోధన, ఆత్మ నిర్మాణం సాధ్యం.**

# ఆలోచనలకు పదును

**నేటి మన జీవన విధాన చారిత్రక సత్యాలు :**

మన భవనాలు ఆకాశానికెదిగాయి – మన ఆలోచనలు పాతాళాన్ని తాకుతున్నాయి.

రహదారులు విశాలమైనాయి – మనోభావాలు ఇరుకైనాయి.

మన ఖర్చులు పెంచుకున్నాం – అనుభవించేది తగ్గించుకున్నాం

వస్తువుల కొనడం పెరిగింది – ఆ వస్తువుల నుండి పొందే ఆనందం తరిగింది.

మన నివాసాలు పెద్దవైనాయి – కుటుంబాలు చిన్నవైనాయి.

సౌకర్యాలు పెంచుకున్నాం – వీనిని అనుభవించే సమయాన్ని తగ్గించుకున్నాం.

చదివే పుస్తకాలు అనేకం – వాని నుండి పొందే వివేకం శూన్యం.

విషయ పరిజ్ఞానం ఎక్కువ – ఉపయోగించుకొనెడిది తక్కువ.

నిపుణులనేకులు – సమస్యల పరిష్కరించలేని అసమర్థులు.

మందులనేకం – ఆరోగ్యం స్వల్పం

వస్తుసంపద పెంచుకున్నాం – వ్యక్తిత్వ విలువలు పోగొట్టుకున్నాం.

అవసరానికి మించి మాట్లాడతాం, ద్వేషిస్తాం – అతి తక్కువగా ప్రేమనందిస్తాం.

బ్రతుకు తెరువు నేర్చుకున్నాం – బ్రతుకుట మరచిపోయాం.

జీవితాన్ని పొడిగించుకొనగల్గాం – జీవిత విలువలు తగ్గించుకున్నాం.

చంద్రమండలాన్ని చేరాం, తిరిగి రాగలిగాం – నిర్భయంగా రహదారిని దాటలేకపోతున్నాం.

బాహ్య ప్రపంచాన్ని జయించాం – అంతఃకరణాన్ని జయించలేకున్నాం.

అణువిస్ఫోటనం చేయగల్గాం – అసూయను వదిలించు కోలేకపోతున్నాం.

ఆదాయాలు పెంచుకున్నాం – దాని పవిత్రతకు తిలోదకాలిచ్చాం.

మనం శారీరకంగా ఎదిగాం – మానసికంగా దిగజారాం.

భౌతిక లాభాలు ఎదిగాయి – ఆత్మిక లాభాలు తరిగాయి.

ప్రపంచ శాంతిని కోరుతున్నాం – ఇంటిలో అశాంతిని పెంచుతున్నాం.

విశ్రాంతి ఎక్కువ – సంతోషము తక్కువ.

తినుబండారాలు ఎక్కువ – శక్తినిచ్చెడివి తక్కువ.

జంటలిరువురి ఆదాయాలతో – విడాకులు పెరుగుతున్నాయి.

భోగలాలస గృహాలతో – బీటలువారాయి కుటుంబ బంధాలు.

ఆడంబరాలు పెరిగాయి – ఆదర్శాలు తరిగాయి.

– ఆర్. డబ్ల్యూ. ఎమర్సన్ ఆంగ్లమూలానికి
తెలుగు సేత శ్రీ వేణుగోపాలరెడ్డి

## మహాశూన్యోపాసన

*భగవంతుడా!*
*నాకు శక్తినివ్వమని అడిగితే,*
*కష్టాలనిచ్చి శక్తిని పొందమన్నావు.*
*జ్ఞానమునిమ్మని అడిగితే,*
*సమస్యలనిచ్చి సాధనతో జ్ఞానమును పొందమన్నావు.*
*సిరిసంపదల నడిగితే,*
*తెలివినిచ్చి సంపదలను స్వయముగా పొందమన్నావు.*
*ధైర్యమునిమ్మని అడిగితే,*
*ప్రమాదములనిచ్చి వానినధిగమించి ధైర్యమును పొందమన్నావు.*
*ప్రేమనందించమని అడిగితే,*
*ఆపదలోనున్నవారిని ఆదుకొని, ప్రేమతత్త్వమును అనుభవించమన్నావు.*
*వరములనిమ్మని అడిగితే,*
*పలు అవకాశములనిచ్చి, కోరికలను తీర్చుకోమన్నావు.*
*భగవంతుడు అందరికీ అన్నీ ఇచ్చాడు.*
*వానిని అందిపుచ్చుకొని అనుభవింపవలసినది నీవే.*
*నీలోనున్న అంతర్జ్యోతిని దర్శించి,*
*ఆత్మ విశ్వాసముతో అన్నింటిని పొందాలి.*

**[redacted] జ్ఞానమే శక్తి, జ్ఞానాన్ని సంపాదించుకోవాలి.**

వార్తలు

# రాష్ట్రమంతటా జరిగిన వివిధ కార్యక్రమాలు

## 2010 సెప్టెంబరు 16 నుండి 19 వరకు హైదరాబాదులో జరిగిన గాయత్రీ పరివార్ కార్యకర్తల ప్రశిక్షణా శిబిరంపై సమీక్ష

2010 సెప్టెంబరు 16 నుండి 19వరకు గాయత్రీ పరివార్ కార్యకర్తల ప్రశిక్షణాశిబిరము కూకట్‌పల్లి పి.ఎన్.ఎమ్ హైస్కూలు ప్రక్కనే ఉన్న పి. నారాయణదాసు కళ్యాణ మండపములలో నిర్వహించబడినది.

రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసిన గాయత్రీ పరివార్ కార్యకర్తలు 2000 మందితో ఈ శిబిరము నిర్వహింపబడినది. గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, కరీంనగర్ జిల్లాల నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

16వ తేది ఉదయం 8.00 గంటలకు గాయత్రీ మంత్రోచ్చారణ గురువందనంతో ప్రశిక్షణ శిబిరము అనసూయమ్మ, తోషన్ గార్ల యుగసంగీతంతో ప్రారంభమైనది. అటు పిమ్మట శాంతికుంజ్ వరిష్ఠ ప్రతినిధి పూజ్యులు డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్ గారు, దక్షిణ భారత ప్రధాన సంచాలకులు శ్రీ అశ్విని సుబ్బారావు గారు మరియు శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ పరమానంద ద్వివేది గారు జ్యోతి ప్రజ్వలన గావించారు.

శ్రీ అశ్విని సుబ్బారావు గారు శ్రీ గౌర్‌జీ గారిని శిబిరానికి పరిచయం చేస్తూ పూజ్య గురుదేవుల ప్రియ శిష్యులలో ఒక్కరని గురుదేవులకు అతి సన్నిహితంగా మెలిగినవారని తెలిపారు. పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది పురస్కరించుకొని, కార్యకర్తలకు యజ్ఞము మరియు యుగ సంగీతం పట్ల మరింత అవగాహనను పెంచి, వారికి గల జ్ఞానానికి మరింత మెరుగులందించి, మరింత నేర్పుగా కార్యక్రమాలను నిర్వహించుటకు ఈ శిక్షణ తోడ్పాటుపడగలదని తెలిపారు.

తదుపరి శ్రీ బ్రిజ్‌మోహన్‌గౌర్ గారు తమ ప్రవచనము ద్వారా పూజ్య గురుదేవుల రానున్న జన్మశతాబ్దికై తమవంతు, శ్రమ, ప్రతిభ మరియు అంశదానమునందించి యుగపరివర్తనకై పాటుపడవలసినదిగా ఉద్బోధించారు. పూజ్య గురుదేవులు మనందరిని వారి అంగ అవయవములుగా పేర్కొన్నారు. కావున మనమంతా రాముని వానరసేనలా, కృష్ణుని గోపబాలురవలె పూజ్య గురుదేవుల జన్మశతాబ్దిని అత్యంత శ్రద్ధాసక్తులతో, భక్తి ప్రపత్తులతో నిర్వహించాలి. 2011 ఫిబ్రవరి 20న న్యూఢిల్లీలో రెండు లక్షల మందితో ఒకరోజు గాయత్రీ పరివార్ ప్రజ్ఞాపుత్రుల శిబిరము నిర్వహించబడుతుంది. 2011 నవంబర్ 7 నుండి 11 వరకు శాంతికుంజ్ హరిద్వార్‌లో 2 కోట్ల మందితో పూజ్య గురుదేవుల జన్మశతాబ్దిపూర్ణాహుతి మహోత్సవములు నిర్వహింపబడతాయి. ఈ మహత్తర కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించుటకై నేటి నుండి మనమంతా కృషి చేయాలి. పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది ఒక్కసారే వస్తుంది. కావున ఈ అవకాశాన్ని జారవిడచుకొనరాదు. ఈ కార్యక్రమ నిర్వహణకు అనేకమంది ప్రజ్ఞాపుత్రులు 10 దినముల నుండి 30 దినముల వరకు సమయదానము ఇవ్వాలి. ఈ కార్యక్రమానికి డాక్టర్లు, ఇంజనీర్లు, నర్సులు, కాంపౌడర్లు, కార్పెంటర్లు, పైపులపనివారు, శ్రామికులు, రక్షకభటులు, మున్నగు సేవలనందించెడి సమయదానాల అవసరమున్నది అని చెప్పారు.

ఆ తరువాత శిక్షణా శిబిరానికి వచ్చినవారికి జిల్లాలవారిగా టోలీకి 10 మంది చొప్పున 20 టోలీల ఏర్పాటు చేశారు. భోజనానంతరం, టోలీలవారిగా వేదికపైకి పిలిచి వారికి గల యుగ సంగీత, యజ్ఞ సంస్కార కర్మకాండల పరిజ్ఞానాన్ని పరీక్షించారు. అటు పిమ్మట శ్రీ పరమానందద్వివేది గారు మరియు తోషన్ గార్లు కర్మకాండ భాస్కర్‌లోని మంత్రాలను వల్లె వేయించుతూ, సామవేద బాణీలో మంత్ర పఠన విధానాన్ని నేర్పారు.

అదే విధముగా యుగ సంగీతాన్ని కూడా అభ్యసింపచేశారు. ఈ విధముగా 5 గంటల వరకు కార్యక్రమము కొనసాగినది.

సాయంత్రం 6.30 నుండి 8.30 వరకు డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు, యుగనిర్మాణ 18 సత్సంకల్పాలపై ప్రసంగించారు.

**వారు చెప్పిన కొన్ని విషయములు :**

భారతీయ సంస్కృతి ఉత్తమ జీవిత విధానాన్ని తెలుపుతుంది. మీరంతా దేవతలే అని గురుదేవులు అంటారు. గాయత్రి ఒక జీవిత విధానం. గాయత్రి అర్థం చేసుకున్నవారు ద్విజత్వం పొందుతారు. ద్విజత్వం అంటే ఇంకొక జన్మ. చనిపోరు. క్రొత్త జీవిత విధానం వస్తుంది. అందువల్లన దేవతల గురించి కాక దేవమాత గాయత్రి గురించి తెలుసుకోవాలి. చెట్లకున్న పండ్ల మీద రాళ్ళు విసిరితే కొన్ని సమయాలలో పండు దొరక్కపోగా రాయి నెత్తి మీద పడవచ్చు. కాని గాయత్రి సాధన వల్ల ఎలాంటి ప్రమాదాలు జరుగవు. సాధనలో చిన్న లోపాలున్నా ఎలాంటి హాని జరుగదు. ప్రకృతిలోని భూమ్యాకర్షణ నియమాలను న్యూటన్

[redacted] నమ్మేదికాదు. ఆచరించేది, అన్వయించుకునేది.

మహాశయుడు కనుగొన్నాడు. అందువల్ల ఆ నియయాలను న్యూటన్ నియమాలు అంటారు. అవి ఆయన స్వంతం కాదు. సర్వమానవాళికి చెందినవి. అవి అందరికి ఆయన అందిచ్చాడు. ఆవిధంగానే ప్రకృతిలోని గాయత్రిని ప్రపంచానికి అందిచ్చినది హిందువులయినందువలన అది హిందువులకు మాత్రమే సంబంధించినదనుకుంటున్నారు. యదార్థంగా గాయత్రి సర్వమానవులకు చెందినది. త్రిపద గాయత్రి మంత్రంలో మూడు పాదాలలో ఒక్కొక్క పాదంలో 8 అక్షరాలుంటాయి. ఒక్కొక్క పదంలో 8 అక్షరాలుంటే గాయత్రి ఛందస్సు అంటారు. కాని ఛందస్సుతోపాటు లయ (రిథమ్) ఉండాలి. లయ ఉండవలసిన విధంగా ఉంటే విషం కూడా హాని చెయ్యలేదు. ఆ విధంగానే శ్వాసలో లయ ఉంటే క్యాన్సర్ వంటి రోగాలు కూడా పోతాయి. లయ తెలిసిన వారికి మరణం లేదు. శ్వాస లయ గురించి తెలిసిన వారు అవతలి వారి గురించి చెప్పగలరు.

ఓంకారములోని అ, ఉ, మ అక్షరాలు జాగృత, స్వప్న, సుషుప్తావస్థలకు సంబంధించినవి. ఓం అనగానే సమాధి స్థితిలోకి వెళ్తారు. స్వప్న స్థితి గొప్పదనాన్ని తెలుసుకోవాలి. మంచి కలలు కని వాటిని సాకారం చేసుకునే ప్రయ్నతం చేయాలి. భారతీయ సంస్కృతి వీటి గురించే చెప్తుంది. మీరు నేర్చుకోండి, పిల్లలకు నేర్పండి. దేవతలా జీవించండి. ఈ యుగపరివర్తన సమయంలో ఇలానే జీవించాలి.

రాత్రి 8 గంటలకు శ్రీ పరమానంద ద్వివేదిగారు ఆరోజు కార్యక్రమముల సమీక్షించి శాంతి మంత్రముతో పూర్తి గావించిరి.

17వ తేది రెండవ రోజు ఉదయము 5.30 గంటలకు యోగా క్లాసులు జరిగినవి. 9 గంటలకు కార్యక్రమములు ప్రారంభమైనవి. శ్రీ ధనేష్‌చంద్ మరియు రఘు గార్లు యోగా తరగతులు నిర్వహించిరి. శ్రీ పరమానంద ద్వివేది మరియు తోషన్ గార్లు కర్మకాండ భాస్కర్ మరియు యుగ సంగీతం సాధనపై కార్యకర్తలకు శిక్షణను కొనసాగించారు.

17.09.2010 మధ్యాహ్నం నుండి శ్రీ అశ్విని సుబ్బారావుగారు సత్యన్నారాయణ వ్రతకథలో మరుగున పడిన సత్యవ్రతధారణ ప్రాముఖ్యాన్ని వివరించిరి. జనబాహుళ్యానికి పూజ్య గురుదేవులందించిన ఈ సత్యాన్ని తెలియజెప్పి వాడవాడలా ఈ సత్యన్నారాయణ వ్రత కథను ప్రచారం చేయుచూ తద్వారా ప్రజల ఆలోచనా విధానంలో జీవన విధానంలో మార్పువచ్చేలా తెలియజెప్పమన్నారు.

గౌర్‌జీగారు మాట్లాడుతూ జన్మశతాబ్ది మహోత్సవాలలో కార్యకర్తలంతా చక్కగా పనిచేయవలసి ఉన్నదని ఉద్బోధించిరి.

18వ తేది ఉదయం 5.30 నుండి యోగ క్లాసులు జరిగినవి. అటుపిమ్మట 9.00 గంటల నుండి శిక్షణా తరగతులు నిర్వహించారు.

గౌరవనీయులైన డా॥ ప్రణవ్ పండ్యా, హెడ్ అఖిల విశ్వ గాయత్రీ పరివార్ ఉదయం కార్యకర్తలను శ్రీ అశ్విని సుబ్బారావుగారి ఇంటిలో కలిశారు. ఉ॥ 10.00 గంటల నుండి పత్రికా సంపాదకులతో భేటి అయ్యారు. మధ్యాహ్నం అశ్విని గార్డెన్స్‌ను సందర్శించి, గోధుమ పిండి ప్లాంటును ప్రారంభించారు. రాత్రి 7.00 గం॥ల నుండి హైద్రాబాద్ జంటనగరాలలో ఎంపికచేయబడిన, ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్, పారిశ్రామికవేత్తలను, వ్యాపారవేత్తలను (మేధావివర్గం) ఆహ్వానించి వారికి యుగనిర్మాణ యోజన గురించి పరిచయం చేయుట జరిగినది.

సాయంత్రం 6 నుండి డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి ప్రసంగము యుగపరివర్తన సత్సంకల్పాలపై కొనసాగింది. దానిలో నుంచి కొంచెం – ప్రతి కార్యకర్త సమాజ రుణాన్ని తీర్చుకొనుటకై కృషి చేయాలి. కుచేలుని కుటుంబాన్ని ఈ విషయమై ఆదర్శముగా తీసికొనవలసినదిగా వివరించుచూ శ్రీకృష్ణ సీరియల్ నుంచి క్లిప్పింగ్ చూపెట్టారు. తనకు ఆ పూట ఆహారముగా లభించిన ఒక్క మెతుకులో సగభాగము తన ఆరాధ్యదైవమున శ్రీకృష్ణుని కర్పించి, మిగిలిన సగభాగం తిని, భార్య మరియు సమాజంలో ఆకలిగొన్న వారికి అందాలనెడి భావనతో దానిని స్వీకరిస్తారు. తన భక్తుని భక్తితత్పరతను, సమర్పణకు ముగ్ధుడై శ్రీకృష్ణుడు, విశ్వకర్మని పిలిచి, కుచేలునికి చక్కని భవనాన్ని నిర్మించి ఇమ్మని పంపుతాడు. విశ్వకర్మ కుచేలుని ఇంటికివచ్చి తన రాకలోని ఆంతర్యాన్ని తెలుపగా, కుచేలుని భార్య ఈ రీతిలో జవాబిస్తుంది. "నేటివరకు నన్ను, నా కుటుంబాన్ని ఆదుకొని ఈ గ్రామస్తులు మాకు అండగా నిలిచారు. వీరంతా కటికి దారిద్ర్యమనుభవించుచున్నారు. ఇట్టి వీరిని వదలి, మేము భవంతులను మీనుండి పొందుటభావ్యము కాదు. కావున ముందుగా నా గ్రామస్తులకి సౌకర్యాలు కల్గించి ఆ తరువాతే మాకు అని అతి సున్నితంగా విశ్వకర్మ సహాయాన్ని నిరాకరిస్తుంది. ఇది చూసిన కార్యకర్తలు కన్నులు చెమ్మగిల్లాయి. "ఇదే పూజ్య గురుదేవులందించిన ఆదర్శ జీవన విధానం" ఇదే విధముగా మీరంతా జీవించుట అలవర్చుకోవాలి అని ఉద్బోధించారు.

శాంతిమంత్రంతో ఆనాటి కార్యక్రమాలు ముగిశాయి.

19.09.2010 ఉదయం 5.30కు యోగశిక్షణ తదుపరి 10.30లకు ఆదరణీయ డా॥ ప్రణవ్ పండ్యాగారు, డా॥ బ్రిజ్ మోహన్ గౌర్‌జీ, శ్రీ అశ్విని సుబ్బారావుగార్లు సమావేశస్థలికి చేరుకొన్నారు.

ముందుగా శ్రీ అశ్విని సుబ్బారావుగారు డా॥ ప్రణవ్ పండ్యా

**[redacted]హితుని ఉపదేశం పగిలిన నగారా చేసేచప్పుడు.**

గారిని సభకు పరిచయం చేశారు. వైద్య విద్యను అభ్యసించి అమెరికాలో చేస్తున్న ఉద్యోగాన్ని విడచిపెట్టి గాయత్రి పరివార్‌లో చేరారు. పూజ్య గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్యగారి సన్నిధిలో 12 సం॥లు తపస్సు చేశారు.

అటుపిమ్మట డా॥ ప్రణవ్ పండ్యాగారు ప్రవచనం చేస్తూ మీరంతా గురుదేవుని అంగఅవయవాలని తెలిపారు. గురుదేవుని మాటలుగా "మీకు ఎవరైన తటస్థపడి మీ గురువుకన్న మా గురువే గొప్ప అంటే ఒప్పుకోండి, లేదా సమాన గురువులన్నా ఒప్పుకోండి, అట్లుకాక ప్రేమించుటలో మా గురువును మించినవారు లేరన్నచో మీరు ఒప్పుకోవద్దు" అని చెప్పేవారని అన్నారు. మీరు కూడా అదే రీతిలో ప్రేమను పంచండి. పది మందికి ఆదర్శంగా నిలవండి. యుగపరివర్తన భాగస్వామ్యాన్ని పొంది జీవించండి అని ఉత్తేజపరచారు.

19వ తేది ఉదయం డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు "దియా" వర్కుషాపును ప్రారంభించి వారిని ఉద్బోధించుట జరిగింది.

మధ్యాహ్నము నుండి శ్రీరామకృష్ణ మాష్టారు కూడా పరివార్ వేదికపై ఆసీనులై, పూజ్య గురుదేవుల జన్మశతాబ్దికై రూ. 2కోట్ల రూపాయిల అంశదానాన్ని శాంతికుంజ్‌కు ఆంధ్రప్రదేశ్ మరియు దక్షిణ భారతదేశం నుండి అందించవలసినదిగా కార్యకర్తలను ఉద్బోదించిరి. తదుపరి వరుసగా కార్యకర్తలు స్పందించి రూ. 88లక్షల వరకు విరాళాలు ప్రకటించుట జరిగింది.

డా॥ ప్రణవ్ పండ్యా అందరిని ఆశీర్వదించారు. సాయంత్రం 6.00 గం॥ లకు శిక్షణా శిబిరం ముగిసినది.

## పార్వతీపురంలో

24.07.2010 & 25.07.2010 గురుపౌర్ణమి సందర్భమున విజయనగరం జిల్లా పార్వతిపురంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయం నందు 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. 24 తేదిన సాయంత్రం 5 గంటలకు 200 మంది మహిళలతో కలశయాత్ర కన్నులపండువగా, తదనంతరం యుగ సంగీత కార్యక్రమం వీనుల విందుగా జరిగింది. 25వ తేది ఉదయం 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం శ్రీ ఈశ్వరరావు, డిబికె సాయి, సెంబలి మురళి, మణిగార్ల ఆధ్వర్యంలో శ్రీ జి.నారాయణ, డివిఆర్ మూర్తి, రూపవాణి, పూల్‌సింగ్, చంద్రశేఖర్ గార్లు నిర్వహించారు. ఈ యజ్ఞ సందర్భమున పుంసవన సంస్కారములు–2 ఉపనయనము –3, ఒక జన్మదిన సంస్కారం కూడా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భమున 11 మంది యుగశక్తి గాయత్రి మాస పత్రికకు చందాదారులను చేర్పించడం, 3800 రూపాయల సాహిత్య విక్రయం జరిగింది.

సుమారు 1000 మంది పాల్గొన్న ఈ మహాయజ్ఞ కార్యక్రమునకు కురుపాం, పార్వతీపురం కార్యకర్తలు శ్రీ జి. నారాయణరావు, బి. నీలయ్య, గోవింద గార్లు సహకరించారు.

## శ్రీ గాయత్రీ శక్తిపీఠము-కాకివాయి
## (శ్రీ హంసరామ ఆశ్రమం)
## అజ్ఞాతభక్తుని గొప్ప నగదు కానుక

1996 గురుపౌర్ణమి రోజున డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి నేతృత్వంలో వెలసినది శ్రీహంసరామ ఆశ్రమము. కాకివాయి గ్రామము, చేబర్ల మండలం, నెల్లూరు జిల్లాలోనిది. దుర్వాసమహాముని, కణ్వమహర్షులు తపస్సుగావించి నడయాడిన పవిత్ర భూమి, తదుపరి నేటి కాలమందు కాకివాయి సమీపంలోని నాగులవెల్లటూరు గ్రామంలో జన్మించిన ప్రసిద్ధ అవధూత శ్రీ వెంకయ్యస్వామి పాదధూళితో పునీతమైన ప్రదేశము. ఇట్టి శక్తిపాతమును సంతరించుకొన్న ఈ నేలలో 24 లక్షల గాయత్రీ మంత్ర లేఖనములను భూనిక్షిప్తంగావించి, కొన్ని లక్షల గాయత్రీ మంత్రజపముతో శ్రీరామకృష్ణ మాష్టారు మరింత శక్తివంతం గావించిరి.

1996లో ఆశ్రమం స్థాపించిన నాటినుండి, తన శరీరమును, మనస్సును, ధనాన్ని ఆశ్రమ సేవలో వెచ్చించుచూ, ఆశ్రమములో నివాసముంటున్న శ్రీమతి కె. భవానీగారు అభినందనీయులు, ఆదర్శప్రాయులు. 1996 నుండి నేటివరకు అనేక యజ్ఞములతో, మంత్ర జపముతో శక్తిపాతం సంతరించుకొన్న ఈ ఆశ్రమము అనేకమందికి సంతాన ప్రాప్తిని, లక్ష్మీప్రాప్తిని, ఉద్యోగప్రాప్తిని, సంకటనివారణముల గావించుచున్నది. ఈ పరంపరలో **ఒక అజ్ఞాత భక్తుడు కొద్ది కాలము క్రితము రూ. 1,35,000/- లను మారుమూలనున్న ఆశ్రమ హుండీలో సమర్పించుకొనుట, ఇచ్చట దైవీశక్తులకు తిరుగులేని నిదర్శనము.** పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య, మరియు వందనీయ మాతా భగవతీదేవి శర్మల సూక్ష్మ సంరక్షణలో దైవీశక్తులకు ఆలవాలముగా విలసిల్లుచున్న **పరమ పవిత్ర పుణ్య స్థలము, పుణ్య తీర్థము కాకివాయి ఆశ్రమము.**

ఈ ఆశ్రమంలో కొలది దినములుండుటకు ఉచిత వసతి భోజన సౌకర్యమున్నది. నిత్యగాయత్రీ యజ్ఞము, స్మర్తుగామి ఆలయము, ధుని, మహాకాలుని మండపము దర్శింపదగినవి. ఆర్తితో శరణుకోరినవారి పాలిట కల్పవృక్షము, కామధేనువు. ఈ ఆశ్రమము దర్శించి తరించండి. **ఫోన్ : 08621-229097**

★★★

[redacted]మనస్సును క్షాళన చేసుకోవడం ఒక తపస్సు.